రాత్రి పన్నెండున్నర గంటలు

బొమ్మిడి అచ్చారావు

రాత్రి పన్నెండున్నర గంటలయింది.

అకస్మాత్తుగా మెలకువ వచ్చింది అరుణ్ కి. చెవుల్లో ఏదో హోరు. ఎవరో చెవిదగ్గరగా మెల్లగానే అయినా, అతి స్పష్టంగా చెపుతున్నారు:

"రా, నడచిరా ...తిన్నగా వచ్చెయ్యి!" అంటూ.

అరుణ్ లేచి మంచం దిగాడు. గదిలో బెడ్‌లాంపు వెల్తురు పల్చగా పరచుకుని వుంది. తలుపులు బార్లా తెరిచి వున్నాయి.

అరుణ్ ఏదో మైకంలో వున్నవాడిలా అలాగే ముందుకు నడుస్తున్నాడు. పోర్టికోలోకి వచ్చాడు. అక్కడ కాంతివంతమైన దీపం వెలుగుతోంది.

మెయిన్ గేటు తెరిచివుంది.

అరుణ్ గేట్లోంచి రోడ్డుమీదికొచ్చాడు. స్ట్రీట్ లైట్సు వెలగటంలేదెందుకో.

సెకండ్ షో. జనం అంతక్రితమే యిళ్ళకు తిరిగి వెళ్ళి

పోయారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. అంతటా భయంకరమైన నిశ్శబ్దం!

అరుణ్ ఎటూ చూడకుండా తిన్నగా నడుస్తున్నాడు. మెయిన్ రోడ్డు వదిలి సందులు గొందుల్లోంచి నడుస్తున్నాడు. అలవాటుపడిన దారిన నడుస్తున్నవాడిలా బాహ్య స్పృహ లేనివాడిలా మౌనంగా నడుస్తున్నాడు. అలవాటు పడిన దారిన నడుస్తున్నట్టు, ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకి సాగిపోతున్నాడు.

రోడ్డు వదిలి కంకరరోడ్డుమీదికి మళ్ళాడు.

ఊరు చివర ప్రాంతమది! స్మశానం!

దూరంగా ఏవో మంటలు కనిపిస్తున్నాయి.

అరుణ్ సరాసరి ఆ మంటల్ని సమీపించాడు. సగం కాలున్న శవం యింకా చితిమీదనే వుంది. ఎక్కడో శిశువులు కర్ణకఠోరంగా అరుస్తున్నాయి.

అరుణ్ ఇంకా ముందుకి నడుస్తున్నాడు. ఎండుపుల్లలు, విరిగిన మట్టిపాత్రలు, శిధిలమైన శవాల ఎముకలు అతని కాళ్ళకింద ఫటిల్లున పగులుతున్నాయి.

అరుణ్ ఏకాగ్రతతో స్మశానం మధ్యకు నడిచి, ఆగిపోయాడు. గాలి వీచటంలేదు. ఒక్కసారిగా స్తంభించిపోయింది. శవం కాలున్న కవురుకంపు ఆ ప్రదేశం నిండా అలముకుని ఊగుస్పృశిస్తోంది.

అరుణ్ ఎవరో ఆజ్ఞాపించినట్టు అక్కడ కూలబడ్డాడు. కాళ్ళు బాచిపట్టు వేసుకొని నిష్టగా కూచున్నాడు. నిద్రలో జోగుతున్నట్టుగా మెల్లిగా ఏవో నోటితో ఉచ్చరిస్తున్నాడు అస్పష్టంగా.

చితి వెలుగు అతని ముఖంమీద ప్రతిఫలించి అతని ముఖాన్ని భయంకరంగా మార్చేసింది. అతని కళ్ళు

తెరుచుకునే వున్నాయి. ఆ వెలుగులో మండుతున్న జ్యోతుల్లా, రక్తపు ముద్దల్లా ఎర్రగా వున్నాయవి.

ఎవరో అతనికి అతి సమీపంలో కూచుని వున్నారు. అంతదాకా కనిపించని వ్యక్తి ఒక్కసారిగా అతనిముందు ప్రత్యక్షమయ్యాడు.

"నీ పేరు?" అడిగాడతను అరుణ్ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

"జనార్దనం!" అన్నాడు అరుణ్. అతని గొంతులో ఏదో మార్పు వచ్చింది.

"నువ్వెప్పుడు చనిపోయావు?"

"అయిదేళ్ళ క్రితం!"

"ఎలా చనిపోయావు?"

"హత్య చేయబడి."

"ఎవరు చేశారు హత్య?"

"మా చిన్నాన్న. ఆస్తికోసం!"

"ఇది మరెవరికైనా తెలుసా?"

"నాకు తప్ప మరెవరికీ తెలియదు."

"మంచిది. నువ్వెళ్ళొచ్చు."

అరుణ్ లేచి నిల్చున్నాడు. ఒక్కసారిగా పెనుగాలి వీచింది. చితిమంట ఆ గాలికి మరింత ప్రజ్వలంగా వెలుగుతోంది. నక్కల ఊళలు కర్ణకఠోరంగా వినిపిస్తున్నాయి.

అయితే అవేవీ అరుణ్ చెవులకు తాకటంలేదు. అతను కలలో నడుస్తున్నవాడిలా శ్మశానం నుంచి బయటికొచ్చి కంకరరోడ్డెక్కాడు. పదడుగులు వేసి కుప్పలా కూలిపోయాడు.

ఆ మరుక్షణమే అతనికి స్పృహ తప్పిపోయింది.

2

అతనికి స్పృహ తెలిసేసరికి తన యింట్లో తన పడగ్గదిలో వున్నాడు. మంచం చుట్టూ అన్నయ్య, చిన్నాన్న, తల్లి, చెల్లెలు కూచుని తన ముఖంలోకి ఆత్రుతగా, ఆందోళనగా చూస్తూండటం కనిపించింది.

అరుణ్ సగ్గున లేచి కూచున్నాడు.

"ఏమిటి, నాకేమయింది? మీరెందుకిలా నా చుట్టూ మూగి వున్నారు?" అనడిగాడు అయోమయంగా.

అన్నయ్య కిశోర్ చెప్పాడు. "అర్ధరాత్రి నాకెందుకో మెలకువ వచ్చి చూస్తే గదిలో నువ్వు లేవు. తలుపులన్నీ తీసి వున్నాయి. వెంటనే మన కారు తీసుకుని రోడ్డున వెతుక్కుంటూ బయల్దేరాను. స్మశానానికి దగ్గర్లో స్పృహతప్పి పడున్నావు. నేను భయపడి నీ నాడి చూశాను. కొట్టుకుంటోంది. వెంటనే కార్లో పడుకో బెట్టి తీసుకొచ్చాను."

అరుణ్ ఆశ్చర్యంగా అన్నవంక చూసి, "నేను స్మశానం దగ్గర్లో స్పృహతప్పి పడిపోయానా? అసలు నేను మన గేటు దాటి వెళ్ళడం కూడా నాకు గుర్తులేదు." అన్నాడు.

తల్లి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ, "బాబూ, ఇది రెండోసారి. నాలుగు రోజుల క్రితం మొదటిసారిగా ఇలాగే యింట్లోంచి అర్ధరాత్రి వెళ్ళిపోయావు. అయితే ఆ రోజు మనకు తెలిసిన పెద్దమనిషి వేదా సెకండ్ షో చూసి కార్లో వస్తూ నిన్ను గుర్తుపట్టి, ఎక్కించుకుని తీసుకొచ్చి అప్పగించాడు. మళ్ళీ ఇప్పుడిలా చేశావు" అన్నది.

అరుణ్ ఆమెవంక గాజుకళ్ళతో చూసి, "నిజంగా ఏం జరిగిందో నాకు తెలియదమ్మా! నాకేమాత్రం గుర్తు

లేదు. రాత్రి తొమ్మిదిన్నరదాకా ఇంగ్లీషు నవల చదువుకుని మంచినీళ్ళు తాగి పడుకున్నాను. మళ్ళీ ఇప్పుడే మెలకువ వచ్చింది" అన్నాడు.

అరుణ్ చిన్నాన్న అతనివంక సూటిగా చూస్తూ, "గుర్తు తెచ్చుకో! వారం రోజుల క్రితం వెళ్ళినప్పుడు కూడా నాకేం గుర్తులేదన్నావు. అప్పుడు రోడ్డు ప్రమాదం జరిగి వుండేదని, త్రుటిలో తప్పిపోయిందని నిన్ను తెచ్చిన వేదాగారు చెప్పారు. రెండోసారి క్షేమంగా బయట పడ్డావు—సమయానికి కిశోర్ మేలుకొని చూడటంవల్ల!" అన్నాడు. ఆయన పేరు ప్రసాదరావు.

అరుణ్ ఆయనవంక చూసి, "నాకేం గుర్తు రావటం లేదు చిన్నాన్నా! అంతా అయోమయంగా వుంది" అన్నాడు. అతని తల వేయి సమ్మెట్లతో కొడుతున్నట్టు ఒకటే నొప్పి. చెవుల్లో ఏదో హోరు తల పట్టుకుని మంచం మధ్య అలాగే కూచుండిపోయాడు.

"అన్నయ్య నెందుకలా వేధిస్తారు? కాసేపు విశ్రాంతిగా పడుకోనివ్వండి. ఏదయినా గుర్తొస్తే తెల్లారాక చెపుతాడు కదా!" అన్నది అరుణ్ చెల్లెలు స్రవంతి. అన్న పరిస్థితికి ఆమె చాలా బాధపడుతోంది.

"నేను తమ్ముడి గదిలో పడుకుంటా నీరాత్రికి. మీ రందరు వెళ్ళిపొండి" అన్నాడు కిశోర్.

తల్లి, ప్రసాదరావు, స్రవంతి ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

కిశోర్ తమ్ముడి పక్కనే మంచం వేసుకొని, "పడుకో అరూ, ఇంకేమీ ఆలోచించవద్దు ప్రశాంతంగా నిద్రపో!" అన్నాడు అనునయంగా.

అరుణ్ పడుకున్నాడేగాని, చాలాసేపటివరకు నిద్ర

రాలేదు. ఏవేవో పిచ్చి ఆలోచనలు ముసురుకొంటున్నాయి.

తనకి గతంలో ఎప్పుడూ యిలా నిద్రలో నడిచే లక్షణంలేదు. ఇప్పుడు కొత్తగా యిదేమిటి? తమ కుటుంబంలో కూడా ఎవరికీ ఇలాంటి వ్యాధిలేదు. తనకి సంక్రమించిందేమిటి?

అరుణ్ బాగా కలవారి కుటుంబంలో పుట్టాడు. అతని తండ్రి పెద్ద బిజినెస్ మేగ్నెట్. ఎలాంటి వ్యాపారం తలపెట్టినా లక్షలకు లక్షలు లాభాలు కురిశాయి. పట్టిదల్లా బంగారమయింది. కోటికి పగడలెత్తాడు.

అయితే విధి వక్రించి అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఊరి పొలిమేరల్లో స్మశానం సమీపంలో ఆయన వస్తూన్న చెవర్లెట్ కారును లారీ ఢీకొని తుత్తునియలు చేసేసింది.

అప్పటిదాకా అన్నగారికి సాయంగా ఆయన వ్యవహారాలు చూస్తున్నాడు ప్రసాదరావు. ఆయన హఠాన్మరణంతో అన్ని వ్యవహారాలు అతనే తన భుజస్కంధాలమీద కెత్తుకున్నాడు. అప్పటికి ప్రశాంతికి పదేళ్ళుంటాయి. కిశోర్ కి పన్నెండేళ్ళు.

ఇది జరిగి దాదాపు పదేళ్ళు కావస్తోంది.

ఇప్పుడు కిశోర్ చిన్నాన్నతో కలిసి తమ ఫ్యాక్టరీకి వెళ్ళివస్తూన్నాడు. చాలవరకు వ్యాపార రహస్యాలు ఆకళింపు చేసుకున్నాడు.

అరుణ్ బి.కామ్ ఫైనలియర్ పరీక్షలు రాశాడు, ఆ సంవత్సరమే. రిజల్ట్సు రావలసి వుంది. ఎం.కామ్ చెయ్యాలనుకొంటున్నాడు.

ప్రశాంతి ఎం.బి.బి.యస్ మొదటి సంవత్సరంలో వుంది. అది ఆమె తండ్రి ఏంబిషన్. బతికుండగా కూతుర్ని డాక్టర్ని చేస్తానని అందరితో ఆనందంగా చెప్తూ దేవాడాయన. ప్రశాంతికి అదంతా గుర్తుంది. అందుకే పట్టుదలగా చదివి, మెడికల్ ఎంట్రన్స్‌లో ఫస్టు ర్యాంక్ తెచ్చుకొని మెడిసిన్‌లో సీటు తెచ్చుకొంది.

చార్టర్డ్ అకౌంటెంట్‌గా పెద్ద పేరు సంపాదించాలని అరుణ్ విషయంలో అతని తండ్రి కోరుకొనేవాడు. అందుకే అరుణ్ కామర్స్ తీసుకున్నాడు. ఓపక్క ఎం.కామ్. చేస్తూ సి.ఏ. చెయ్యాలని అతను ప్లాన్ చేసుకున్నాడు ప్రస్తుతం ఈవెనింగ్ కాలేజీలో సి.ఏ. కోర్సుకి హాజరవుతున్నాడు కూడా.

అరుణ్ చాలా తెలివైనవాడు. అయిదున్నర అడుగుల పొడవుతో సన్నగా అయినా బలంగా వుంటాడు. స్ఫురద్రూపి. ఎండలో నడిస్తే కందిపోతాడనిపించే శరీర చ్ఛాయ. మనస్తత్వం కూడా చాలా సున్నితం. ఎవర్నీ నొప్పించడు. ఎవరైనా చిన్నమాటన్నా పడడు.

అలాంటి అరుణ్ ప్రవర్తనలో అనుకోకుండా వచ్చిన ఈ ఆకస్మిక వింత పరిణామానికి అతని కుటుంబ సభ్యులంతా విచారసముద్రంలో మునిగిపోయారు.

వారం రోజుల క్రితం అతడు నిద్రలో నడుస్తూ వెళ్ళిన సమయానికి అతని గదిలో మరెవరూ లేరు. ఈసారి కూడా అతను ఒంటరిగానే పడుకొని నిద్రపోతుండగా అదే సంఘటన రిపీట్ అయింది.

అందుకే ఇకమీదట తమ్ముడ్ని రాత్రిళ్ళు ఒంటరిగా నిద్రపోనివ్వకూడదని, తను తోడుగా పడుకోవాలని నిర్ణయించుకున్నాడు కిశోర్.

3

"అమ్మా, అన్నయ్యని చిన్నాన్న హత్య చేయించాడు" రవీంద్ర మాటలకి ఉలిక్కి పడింది విశాలాక్షి.

"ఏమిట్రా రవీ, నువ్వు చెప్తున్నది? జనార్దనాన్ని మీ చిన్నాన్న హత్య చేయించాడా? నువు కలగాని కంటున్నావా? జనార్దనం సముద్ర స్నానానికి వెళ్ళి చనిపోయాడు. అది అందరికీ తెలిసిన విషయమే! జనార్దనం చనిపోయిన రోజున మీ చిన్నాన్న ఊళ్ళో కూడా లేరు."

"అదేనమ్మా ఆయన గొప్పదనం! తనమీదికి అనుమానం రాకుండా చాలా తెలివిగా ఊళ్ళో లేకుండా ప్రయాణం పెట్టుకొని, సమయానికి ఎక్కడున్నుంచో ఊడిపడి పని పూర్తిచేసుకొని వెళ్ళిపోయాడు."

"నేను నమ్మను. మీ చిన్నాన్న అలాంటివారు కాదు. జనార్దనాన్ని చంపాల్సిన అవసరం అతనికేముంది?"

"ఆ విషయమే నాకూ అంతు బట్టడంలేదు. అన్నయ్యని చంపడంవల్ల చిన్నాన్నకేం లాభముంది?"

"నువ్వు పొరబడుతున్నావు రవీ. అనవసరమైన అపోహాలతో నీ మనసు పాడుచేసుకోకు, నా మనసు పాడు చెయ్యకు!"

"అమ్మా, చిన్నాన్నమీద నేరారోపణ చెయ్యటం నా అభిమతం కాదు. అన్నయ్యది ప్రమాదవశాత్తు సంభవించిన మరణం కాదు—హత్య అని తెలిసినప్పట్నించీ నా మనసు మనసులోలేదు. అందుకు సహేతుకమైన కారణం తెలుసుకొనేవరకు నాకు మనశ్శాంతి వుండదు!"

"అసలు నీకీ అనుమానమెందుకొచ్చింది?"

"అవసరమొచ్చినపుడు, చెప్పాల్సిన సందర్భం వచ్చినపుడు తప్పక చెప్తాను" అన్నాడు రవీంద్ర.

విశాలాక్షి కొడుకు వంక సాలోచనగా చూసింది.

ఆమెకిద్దరే కొడుకులు. జనార్దనం, రవీంద్ర.

రవీంద్ర రెండు నెలల పిల్లాడుగా వున్నప్పుడే ఆమె భర్త ఫ్యాక్టరీలో ప్రమాదానికి గురై చనిపోయాడు. అప్పటికి జనార్దనం అయిదేళ్ళ పిల్లాడు. అప్పట్నుంచీ కొన్నాళ్ళపాటు పుట్టింట్లో ఉన్నది విశాలాక్షి.

జనార్దనం పెరిగి పెద్దాడయ్యాక మళ్ళీ సిటీ వచ్చారు తల్లీకొడుకులు ముగ్గురు. జనార్దనం తండ్రి పని చేసి ప్రమాదానికి గురైన ఫ్యాక్టరీలోనే అకౌంటెంటుగా ఉద్యోగం సంపాదించాడు. తండ్రి ప్రమాదానికి గురైనందున ఆ ఫ్యాక్టరీలోనే కొడుక్కి ఉద్యోగమివ్వటం న్యాయమని భావించాడు కిశోర్

ఆ ఫ్యాక్టరీ కిశోర్ తండ్రి స్థాపించినదే!

జనార్దనం చిన్నాన్న పోలారావు అదే ఫ్యాక్టరీలో ఫోర్మన్ గా పని చేస్తున్నాడు.

పోలారావు తన అన్న కుటుంబం వాళ్ళ పుట్టింట్లో ఉన్నంతకాలం వాళ్ళెలా వున్నారో, ఏం కష్టపడుతున్నారో ఓసారి చూడాలని ఏనాడూ ప్రయత్నించలేదు. పైగా జనార్దనం ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూన్నపుడు కూడా సాయం చెయ్యలేదు.

అయినా జనార్దనం ఆ ఉద్యోగానికి కావలసిన అర్హతలు కలిగివుండటం, కిశోర్ కి అతనిపట్ల సానుభూతి యేర్పడటం—యీ రెండూ జనార్దనానికి ఉద్యోగాన్ని సంపాదించి పెట్టాయి.

ఆ తర్వాతినుంచే పోలారావు ఆ యింటికి మళ్ళీ రాకపోకలు సాగించాడు. జనార్దనం మాత్రం చిన్నాన్నపట్ల చాలా విముఖత్వం ప్రదర్శించేవాడు. కష్టాల్లో ఉన్నపుడు

ముఖం చాటు చేసి, తనకో గుర్తింపున్న ఉద్యోగం సంపాదించుకోగానే, తనకిక అతని సహాయం ఏదీ అవసరం లేదని నిర్ధారణ చేసుకున్నాక తను యింటివైపు తొంగి చూశాడు. అందుకే చిన్నాన్నపట్ల జనార్దనానికి సదభిప్రాయంలేదు. పాలిటెక్నిక్‌లో సివిల్ కోర్సు చదువుతున్న రవీంద్రకి కూడా చిన్నాన్నపట్ల మంచి అభిప్రాయం లేదు.

విశాలాక్షి మాత్రం మరది యిన్నాళ్ళకయినా తను యింట కాలు పెట్టినందుకు చాలా ఆనందించింది. కొడుకుల్ని మందలించి చిన్నాన్నతో సత్సంబంధాలు ఏర్పరచుకోమని ఒత్తిడి చేసింది.

తల్లిని బాధపెట్టడం ఇష్టంలేక అన్నదమ్ములిద్దరు చిన్నాన్నను పలకరించటం అలవాటు చేసుకున్నారు.

ఆ తర్వాత రెండు నెలలకి ఏదో పండగ సందర్భంగా సముద్ర స్నానానికి వెళ్ళిన జనార్దనం లోతున స్నానం చేస్తూ మునిగిపోయాడు. మరో గంట తర్వాత అలలు అతడి శవాన్ని ఒడ్డుకు విసిరేశాయి. అతడు ప్రమాదవశాత్తూ మునిగి చనిపోయాడని అందరు నిర్ధారించారు.

కాని ఇప్పుడు రవీంద్ర, జీర్ణించుకోలేని విషయం చెప్పగానే విశాలాక్షి తెల్లబోయింది. నమ్మలేను. కాని ఎందుకో ఆమె మనసులో అస్పష్టంగా అనుమాన వీచికలు కదలాడాయి జనార్దనం చనిపోవటానికిముందు జరిగిన ఓ సంఘటన గుర్తువచ్చింది.

ఆ సంఘటన తలచుకొనే కొద్దీ ఆమెలోని అనుమానం మరింతగా బలపడసాగింది. రవీంద్ర మాటల్ని అందు కన్వయించుకుంటే ఆమెకేదో స్ఫురించినట్టే అనిపించింది.

అలా జరగటానికి కవకాశముంది!

కాని .... కాని .... గోపాలరావు అంత దుర్మార్గుడా? చిన్న విషయానికే అన్న కొడుకుని, రక్త స్పర్శ వున్న వాడ్ని చంపుతాడా?

విశాలాక్షి మెదడు ఆలోచనలతో వేడెక్కిపోయింది.

4

"ఈ రోజునించీ నేను నీ గదిలోనే పడుకొంటున్నాను" అన్నాడు కిశోర్.

రాత్రి పదిగంటలు.

అప్పటిదాకా 'మర్కెంటైల్ లా' చదువుతున్న అరుణ్ పుస్తకంనించి తలెత్తి అన్నవైపు చూసి చిన్నగా నవ్వి, "నేనేమైనా చిన్నపిల్లవాడినా?" అన్నాడు.

"చిన్నపిల్లవాడవు కాదుగాబట్టే నీ గదిలో పడుకొంటున్నాను. నాన్నగారు నీమీద పెట్టుకున్న ఆశల్ని నిజం చెయ్యటానికి నా వంతు బాధ్యత నేను నిర్వర్తించాలి కదా!" అన్నాడు కిశోర్ నవ్వుతూ.

"నేనింకా ఓ గంట చదువుకుంటాను. లైటుంటే నీకు నిద్రపట్టదు కదా! బెడ్ లాంప్ వేసుకుంటానులే!" పెద్ద లైటు తీసెయ్యబోయాడు అరుణ్.

కిశోర్ వారించి, "ఉండనివ్వు, నేనుకూడా అప్పుడే నిద్రపోవటంలేదు. ఫ్యాక్టరీ అకౌంట్స్ రాసుకుంటాను" అన్నాడు ఫైళ్ళు ముందేసుకొని టేబిల్ దగ్గర కుర్చీ లాక్కుంటూ.

అరుణ్ అన్నవైపు ఓ సారి చూసి తిరిగి తన పుస్తకంలో లీనమయిపోయాడు.

పదకొండు గంటలయింది.

"నాకు నిద్రొస్తోంది. పడుకుంటాను" అన్నాడు అరుణ్ ఆవలిస్తూ.

కిశోర్ కి కూడా నిద్రొస్తోంది. అయినా బలవంతాన నిరోధించుకుంటున్నాడు.

అరుణ్ పడుకున్న పదినిమిషాల్లోనే గాఢ నిద్రలో మునిగిపోయాడు.

అతని వంకే చూస్తూ నిద్రనాపుకోవటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు కిశోర్.

సరిగ్గా అప్పుడే గోడ గడియారం పన్నెండుగంటలు కొట్టింది.

కిశోర్ కి నిద్రనాపుకోవటం తలకు మించిన పనయ్యింది. తమ్ముడి పక్కనే వున్న బెడ్ మీద నడుము వాల్చాడు. మరు నిమిషానికే గుర్రు పెట్టి నిద్రపోయాడు.

సరిగ్గా పన్నెండున్నర గంటలయింది.

"అరుణ్, లే....నిద్రలే...." అంటూ వినిపించింది మంద్ర స్వరంలో.

అరుణ్ దిగ్గున లేచి కూచున్నాడు మంచంమీద. అతని చెవుల్లో సముద్రపు హోరు. అతని కళ్ళు యెక్కడో చూస్తున్నాయి. అసంకల్పితంగానే లేచి మంచం దిగాడు.

"రా....నడచిరా....తిన్నగా వచ్చెయ్యి!" చెవిలో రొద. మెల్లిగానే అయినా అతి స్పష్టంగా వినిపించింది రొద మధ్య.

అరుణ్ ముందుకు అడుగులు వేశాడు. ఎటూ చూడటంలేదు. ఎక్కడో శూన్యంలోకి చూస్తున్నాయి కళ్ళు.

కిశోర్ మంచి నిద్రలో వున్నాడు. ఏ ఉద్దేశంతో అరుణ్ పక్కన మంచం వేసుకొని అంతదాకా యెదురు చూశాడో ఆ ఉద్దేశం నెరవేర నేలేదు.

అరుణ్ అలా అలా ముందుకు నడిచి, తీసి వున్న తలుపులగుండా గేటు బయటకొచ్చి రోడ్డెక్కాడు.

రోడ్డు నిర్మానుష్యంగా వున్నాయి. అంతటా అంధకారం అలముకొని వుంది.

అరుణ్ అలా నడుస్తూనే వున్నాడు ముందుకి... ఇంకా యింకా ముందుకి....

తారు రోడ్డునుంచి కంకర రోడ్డుకి తిరిగాడు.

స్మశానంలోకి ప్రవేశించాడు.

ఓ పక్కగా చితి మండుతూనే వుందింకా. నక్కల ఊళలు వినిపిస్తూన్నాయి.

అరుణ్ నడుస్తూనే వున్నాడు.

నిన్నటి ప్రదేశం రాగానే టక్కున నిల్చిపోయాడు.

నేలమీద చతికలబడ్డాడు. చితి మంట అతని ముఖంలో ప్రతిఫలిస్తోంది భయంకరంగా.

అతని పక్కనే తవ్వబడ్డ సమాధి గోతులు.

ఆ గోతిలోనించి అంతక్రితమే పాతబడ్డ శవాన్ని బయటకితీసి నేలమీద పరుండబెట్టా రెవరో.

అకస్మాత్తుగా ఆ వ్యక్తి ప్రత్యక్షమయ్యాడు. నిన్న అరుణ్ని ప్రశ్నించిన వ్యక్తి! జనార్దనం ఆత్మని ఆవాహన చేసిన వ్యక్తి.

అతని చేతిలో మనిషి ముంజేతి ఎముక వుంది. దాంతో శవం తలనుంచి కాళ్ళదాకా, మళ్ళీ కాళ్ళనుంచి తలదాకా తాకుతూ యేవో మంత్రాలు జపిస్తూన్నాడు. తెలుగు సంస్కృతంకాని మరో భాష అది! పైశాచిక భాష!

శవం ఓ స్త్రీమూర్తిది!

ఆ వ్యక్తి దాదాపు ఆరడుగుల పొడవున్నాడు. ఒంటి

మీద తుండులాంటి గుడ్డ తప్ప మరేవిధమైన ఆచ్ఛాదనా లేదు! ఆ గుడ్డని నడుంచుట్టూ కట్టుకున్నాడు.

ఒంటినిండా విబూది పూసుకున్నాడు. ముఖాన విబూది అడ్డ పట్టీలుగా పూసుకున్నాడు. మెళ్ళో పూసలదండ లున్నాయి. కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా ఉన్నాయి. చితి వెలుగుపడి, అవి మరింత భయంకరంగా అయ్యాయి.

ఆ స్త్రీ శవాన్ని తాకించిన ఎముకను అరుణ్ కళ్ళకు తాకించాడు. అతని తలమీద మూడుసార్లు దాంతో కొట్టాడు. ఎముకతో అరుణ్ కూచున్న స్థలంచుట్టూ వలయాకారంగా గీశాడు. కాలుతున్న చితినుండి అగ్ని కణాలు ఓ పగిలిన మట్టిపాత్రలో తెచ్చాడు.

రక్తంలా ఎర్రగా ఉన్న ద్రవాన్ని ఆ నిప్పులో పోశాడు ఆ వ్యక్తి. ఒక్కసారిగా పెద్ద పొగ లేచింది. అరుణ్ ముఖం ఆ పొగలోకి వంచాడా వ్యక్తి. అరుణ్ దగ్గుతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. కొంతసేపటివరకు మామూలు స్థితికి రాలేకపోయాడు.

ఆ వ్యక్తి అరుణ్ కళ్ళలోకి సూటిగా చూశాడు. అరుణ్ కళ్ళు మత్తుతో జోగుతున్నాయి. ఎటో చూస్తున్నాయి. ముందుకి వెనక్కి పూనకం వచ్చినవాడిలా మెల్లగా ఊగుతున్నాడు.

ఆ వ్యక్తి అరుణ్ వంక తీక్షణంగా చూసి, "ఎవరు నువ్వు?" అన్నాడు.

"నేను సుజాతను" అన్నాడు అరుణ్. చిత్రంగా అతని గొంతు స్త్రీ గొంతుగా మారిపోయింది.

"నువ్వు బతికి వున్నావా?"

"లేదు. నిన్న ఉదయం చనిపోయాను."

"ఎందుకు చనిపోయావు?

"నా భర్త, అత్త చంపేశారు."

"చంపేశారా?"

"అవును. కిరోసిన్ పోసి నిప్పంటించారు."

"అయితే ప్రమాదవశాత్తు చీరకొంగుకు నిప్పంటుకొని చనిపోలేదా?"

"లేదు, లేదు. బలవంతాన కాల్చి చంపేశారు. నా భర్త నన్ను కదలకుండా పట్టుకుంటే, అతని తల్లి కిరోసిన్ పోసి నిప్పు పెట్టింది."

"ఈ విషయం ఎవరికైనా తెలుసా?"

"ఎవరికీ తెలియదు. పోలీసులకి తెలిస్తే గొడవవుతుందని అప్పటికప్పుడు తెచ్చి పాతేశారు."

"వెళ్ళు ... వెళ్ళు .... వెళ్ళిపో!" అన్నాడా వ్యక్తి.

అరుణ్ ఒక్కసారిగా వెనక్కి విరుచుకు పడిపోయాడు.

ఆ వ్యక్తి ఆ స్త్రీ శవాన్ని సమాధి గోతిలో పూడ్చివేసి మట్టి కప్పేశాడు. ఆ వెంటనే అరుణ్ దగ్గరకొచ్చి ఎముకతో అతని మాడుమీద ముమ్మారు కొట్టి స్మశానంలో ఎటో మాయమయ్యాడు.

పదినిమిషాల తర్వాత అరుణ్ లేచాడు. చుట్టూ ఒకసారి చూసి కెవ్వున అరిచాడు. కొద్ది క్షణాలవరకు తనెక్కడున్నదీ అర్థం కాలేదు. అర్థమయిన వెంటనే స్పృహ తప్పి పడిపోయాడు—స్మశానం నడిబొడ్డులో.

మరో పదినిమిషాల తర్వాత తమ్ముడ్ని వెతుక్కుంటూ ఛ్రున కార్లో వచ్చి స్మశానం దగ్గర ఆగాడు కిశోర్.

కిందికి దిగి లోపలకు పరుగెత్తాడు.

సరిగ్గా అప్పుడే ఎవరో కారు పక్కగా మెరుపులా మెరిసి మాయమయ్యారు.

కిశోర్ స్మశానం మధ్యలో శవంలా పడున్న అరుణ్ ని గుర్తుపట్టి. మోకాళ్ళమీద వంగి ముక్కు దగ్గర చెయ్యి పెట్టి చూశాడు. ఊపిరి ఆడుతోంది.

రెండు చేతుల్తోను అరుణ్ ని ఎత్తుకొని, కారు దగ్గరకు నడిచాడు. బరువుతోను, ఒకరకమైన ఆందోళన భయం తోను అతని శరీరం పూర్తిగా చెమటతో తడిసిపోయింది.

అతికష్టంమీద కారు దగ్గరకు నడిచాడు. వెనక తలుపులు తెరిచి వున్నాయి. ఆ ఆందోళనలో అవెందుకు తెరిచి వున్నాయో ఆలోచించలేదు కిశోర్. వెనక తలుపులు మూసి ముందుకొచ్చి స్టీరింగ్ దగ్గర కూచుని కారు స్టార్టు చేయబోయాడు.

స్టార్టు కాలేదు.

మళ్ళీ మళ్ళీ సెల్ఫ్ కొట్టాడు. స్టార్టు కాలేదు.

కారు దిగి ముందుకొచ్చి బోనెట్ ఎత్తి బ్యాటరీ, ప్లగ్ అన్నీ చెక్ చేసుకున్నాడు. ఫ్యూయల్ సప్లై సరిగా వుందని నిర్ధారణ చేసుకున్నాడు.

అంతా సవ్యంగానే వుంది. మరి కారెందుకు స్టార్టు కావటంలేదు?

బోనెట్ మూసి మళ్ళీ డ్రైవింగ్ సీట్లో కూచుని స్టార్టు చేశాడు. బుర్రుమని శబ్దం చేస్తున్నదేగాని స్టార్ట్ కాలేదు.

అప్పుడు సమయం రాత్రి రెండుగంటలు దాటి యిరవై అయిదు నిమిషాలయింది.

స్మశానం ముందు ఆ సమయంలో ఒంటరిగా వున్నానన్న ఆలోచన రాగానే అతని వెన్నులో యేదో జరజర పాకినట్టయింది. సన్నగా ఒణుకు ప్రారంభమయి శరీరమంతా పాకింది. అంతక్రితం స్మశానం నడిబొడ్డులో సమా

ధుల మధ్య అరుణ్ ని ఎత్తుకొని వచ్చినపుడు కూడా భయమనిపించలేదు.

కాని, మంచి కండిషన్ లోవున్న కారు అకస్మాత్తుగా చెడిపోవటం గమనించిన ఆ క్షణంలో, ఆ అర్ధరాత్రి సమయం, ఒంటరితనం, పరిసరాలు అతనికి భయోత్పాతం కలిగించాయి.

సరిగ్గా అప్పుడే ఓ వ్యక్తి కారు వెనకవైపు నుంచి డ్రైవింగ్ సీటు దగ్గరకొచ్చాడు.

హెడ్ లైట్సు వెలుతురు కెదురుగా నిల్చున్నాడు.

అతను నవ్వుతున్నాడు. వికృతంగా చాలా వికృతంగా నవ్వుతున్నాడు. అతనికి ఎడమకన్ను లేదు. ఆ స్థానంలో నల్లటిగుంట వుంది. ఆ గుంటకిందుగా ముఖమంతా నల్లగా మచ్చలు పడివుంది.

కుడివైపు కనుగుడ్డు పైకి పొడుచుకువచ్చింది. ఆ గుడ్డు నుంచి తెల్లటి సొనలాంటి పదార్థం స్రవిస్తోంది. పెదాలుండాల్సిన స్థలంలో చర్మంలేదు. పళ్ళు వికృతంగా కనిపిస్తున్నాయి.

ఆ ఆకారాన్ని చూస్తూనే కిశోర్ చిన్నగా కేక పెట్టాడు. అతని కనుగుడ్లు ఆశ్చర్యంతోను, భయంతోను పెద్దవయ్యాయి. నిలువెల్లా ఒణికిపోతున్నాడు. నాలుక పొడారిపోయింది.

ఆ వికృతరూపుడు ముందుకి మరింత ముందుకి.... కిశోర్ కి సమీపంగా వస్తున్నాడు.

కిశోర్ సీటుకి అతుక్కుపోయాడు.

"నువ్వు ...నువ్వు.... శ్యామలరావు...." అన్నాడు కీచుగా కిశోర్.

ఆ వ్యక్తి వికటంగా నవ్వుతూ ఇంకా యింకా ముందుకి

వచ్చాడు. చేతులు కిశోర్ ముఖంమీదికి చాచాడు.

అంతే! కెవ్వున అరుస్తూ కారు తలుపు భళ్ళున తెరుచుకుని రెంజో పక్కనుంచి కారు దిగి శక్తివంచన లేకుండా తారురోడ్డు మీదికి పరుగెత్తాడు కిశోర్.

వెనకనుంచి ఆ ఆకారం ఇంకా నవ్వుతూనేవుంది గుండెలు దద్దరిల్లేటట్టు.

5

కారు శబ్దం విని కలత నిద్రనుంచి మేల్కొన్నది ప్రవంతి. పక్కనే నిద్రిస్తున్న తల్లిని లేపింది.

లైటు వేసి బాల్కనీలోకి వచ్చింది ప్రవంతి. తల్లి కంగారుగా లేచి "ఏమిటమ్మా?" అన్నది.

ప్రవంతి బాల్కనీలోకి వచ్చేటప్పటికి తమ కారు గేటుదాటి వెళ్ళిపోవటం కనిపించిందామెకు.

అందులో ఎవరున్నారు? కొంపతీసి అరుణ్ అన్నయ్య నిద్రలోనే కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోవటంలేదు కదా!?....

"అమ్మా, కిందికి వెళ్దాంరా! అరుణ్ అన్నయ్య గది తలుపులు తెరిచివున్నాయి." అన్నది మెట్లవైపు పరుగులాంటి నడకతో ఉరుకుతూ.

తల్లి శాంతమ్మ కూతుర్ని అనుసరించింది.

గదిలోకి అడుగుపెడ్తూనే, "అరుణ్ అన్నయ్యేకాదు, తోడు పడుకున్న కిశోరన్నయ్య కూడా లేడు." అన్నది ప్రవంతి విస్తుపోయి, ఖాళీగావున్న బెడ్స్ వైపు చూస్తూ.

శాంతమ్మ నిల్చోలేనట్టు నేలమీద కూలబడిపోయింది. "చిన్నాన్నను లేపుతల్లీ! ఏమిటమ్మా. యిది? ఈ ఇంటికేదో చేటుకాలం వచ్చినట్టుంది. బంగారంలాంటి బిడ్డ ఇలా ఎందుకూ కాకుండా పోతున్నాడేమిటి భగ

ఉంటుందా!.... వాడిని చల్లగా చూడు." ఆమె మనసు, ఆక్రోశిస్తోంది.

స్రవంతి చిన్నాన్న గది తలుపులు కొట్టింది.

ప్రసాదరావు కళ్ళు నులుముకుంటూ తలుపు తెరిచి, స్రవంతిని చూసి, "ఏమిటమ్మాయీ, ఏమయింది?" అనడిగాడు.

"అన్నయ్యోళ్ళిద్దరు కనిపించటంలేదు చిన్నాన్నా! తలుపులన్నీ తెరిచివున్నాయి. ఇంతక్రితమే మన కారును తీసుకుని ఎవరో వెళ్ళటం చూశాను. ఇద్దరన్నయ్యల్లో ఎవరో తెలియదు!" చెప్పింది స్రవంతి.

ప్రసాదరావు చకచక దుస్తులు మార్చుకున్నాడు.

"ఏ కారు తీసుకు వెళ్ళారు?" అడిగాడు.

"షెవర్లెట్. మారుతికారు తాళాలు మీ దగ్గరే వుంటాయికదా!?" అన్నది స్రవంతి.

ప్రసాదరావు ప్రత్యేకం మారుతికారు వాడతాడు ఇంట్లో తక్కినవాళ్ళందరు - ముఖ్యంగా పిల్లలు ముగ్గురు షెవర్లెట్ ఉపయోగిస్తారు.

ప్రసాదరావు అరుణ్ గదివైపు నడిచాడు అక్కడ కాంతమ్మ ఇంకా నేలమీద కూలబడివున్నది!

ప్రసాదరావుని చూసి లేచి నిల్చుందామె. భర్తపోయి నప్పట్నుంచి ఆడపడుచా మరిది ముందు పడక తప్పటం లేదామెకు. భర్త వుండగా ఆమె ఏనాడూ గది దాటి బయటికి రాలేదు. రాణివాసం స్త్రీలా బతికింది.

ప్రసాదరావు మౌనంగా వెనుతిరిగి గరాజ్ వైపు అడుగులు వేశాడు మారుతికారు బయటకి తీశాడు

సరిగ్గా అప్పుడే పరుగులు పెడ్తూ వచ్చాడు కిశోర్.

ప్రసాదరావు ఇంజన్ ఆపి కిందకి దిగి కిశోర్ కెదురెళ్ళి "ఏమిటి, ఏం జరిగింది?" అనడిగాడు.

కిశోర్ రెండు నిమిషాలవరకు ఏం మాట్లాడలేక పోయాడు. స్రవంతి పరిస్థితి గమనించి చల్లటి మంచినీళ్ళు తీసుకొనివచ్చి యిచ్చింది.

గటగట తాగేసి మళ్ళీ మరో గ్లాసు కావాలని అడిగాడు కిశోర్.

తర్వాత చెప్పాడు జరిగిన సంగతి:

కాంతమ్మ గొల్లుమన్నది. "అయితే చినబాబుని స్మశానంలో ఒంటరిగా వదిలిపెట్టేసి వచ్చేశావా? ఎంత పొరపాటు చేశావు?" అన్నది.

"పద విశ్రాం! కారేదో కారణం చేత చెడిపోయి వుండొచ్చు. పెట్రోలుందా టాంకులో....?" అడిగాడు ప్రసాదరావు.

"ఉండాలి! ఉదయమే టాంకు ఫుల్ చేయించాను. ఎంతో డిస్టెన్స్ తిరగలేదు" చెప్పాడు కిశోర్ మారుతి కారెక్కుతూ.

ఆ పాటికే కారు స్టార్టు చేశాడు ప్రసాదరావు.

మరో పదినిమిషాల తర్వాత మారుతికారు స్మశానం చేరుకున్నది.

కిశోర్ గుండె పీచు పీచుమంటున్నది. మళ్ళీ ఆ వికృత రూపుణ్ణి మాడవలసి వస్తుందేమోనని అపరిమితంగా వణికి పోతున్నాడు. అయితే చిన్నాన్నకి ఆ వింత వ్యక్తి గురించి చెప్పలేదు. తనకే భయంవేసి పారిపోయివచ్చానని, కారు స్టార్టు కాకపోవటంవలననే వచ్చేశానని చెప్పాడు.

ప్రసాదరావు మారుతికారు దిగి ఫ్లాట్ఫాం దగ్గరకు నడిచాడు.

వెనకసీట్లో కాళ్ళు బయటకి చాపుకుని స్పృహలేని స్థితిలో వున్నాడు అరుణ్.

ముక్కుదగ్గర వేలు పెట్టి చూశాడు, శ్వాస ఆడు తోంది. సంతృప్తిగా తలాడించి, డ్రైవింగ్ సీట్లో కూచు న్నాడు తలుపు తెరచి.

కిశోర్ ఊపిరి బిగబట్టుకుని చూస్తున్నాడు! ఆ వికృత రూపం మళ్ళీ ఎప్పుడు ఎలా ప్రత్యక్షమవుతుందోనని గుబులుగా, భయంగా ఉంది!

అదీగాక తను డ్రైవింగ్ సీటు తలుపు, యిటుపక్క తలుపు తెరచి పారిపోయాడు. కాని ఇప్పుడు ఆ రెండు తలుపులు వేసేసి వున్నాయి. వెనక మూసిన తలుపులు తెరచి వున్నాయి. ఎవరు చేశారాపని?

ప్రసాదరావు ఇంజన్ స్టార్టు చేశాడు.

మరుక్షణమే షెవర్లెట్ స్టార్టయింది.

కిశోర్ నిర్ఘాంతపోయాడు. ఇదేమిటి? తను దాదాపు అరగంట కష్టపడ్డా స్టార్టుకాలేదు. ఇప్పుడు ఇలా స్టార్టు చెయ్యగానే అలా స్టార్టయింది. చిత్రంగా అనిపించింద తనికి.

“కిశోర్, నువ్వు కారు డ్రైవ్ చేసుకునిరా. నేను దీని విషయం చూస్తాను.” అన్నాడు ప్రసాదరావు షెవర్లెట్ ని ఇంటిదారి పట్టిస్తూ.

మరో పదిహేను నిమిషాల తర్వాత రెండు కార్లు కిశోర్ ఇంటి ఆవరణలోకి ప్రవేశించాయి.

ప్రసాదరావు, కిశోర్ అరుణ్ ని మోసుకుని అతని గదిలోకి తీసుకువెళ్ళి పక్కమీద పడుకోబెట్టారు.

స్రవంతి, శాంతమ్మ ఆత్రుతగా బెడ్ దగ్గరకు చేరు కున్నారు.

అప్పుడు తెల్లవారుఝామున నాలుగ్గంటలయింది.

ప్రసాదరావు అరుణ్ ని తట్టి లేపాడు. అరుణ్ లో ఎలాంటి కదలికా లేదు. ఎంతకీ లేవలేదు.

కిశోర్ ఫోన్ దగ్గరకు పరుగెత్తాడు. డాక్టరుకి ఫోన్ చేశాడు.

డాక్టర్ వచ్చి అరుణ్ ని పరీక్షించాడు. మెలకువ రావటానికి ఇంజక్షన్ ఇచ్చాడు.

పది నిమిషాల తర్వాత అరుణ్ నిద్రనుంచి లేచినట్టు పక్కమీద కదిలి, కళ్ళు తెరిచాడు. లేవబోయి మళ్ళీ వెనక్కు వాలిపోయాడు.

"పడుకో బాబూ, లేవద్దు!" అన్నది శాంతమ్మ వచ్చే దుఃఖాన్ని అదిమిపట్టి

అరుణ్ ఆమె వంక విచిత్రంగా చూసి, "ఎవరు నువ్వు? అసలు ఎవరు మీరింతా? ఇక్కడికెందుకు వచ్చారు? వెళ్ళిపొండి; నేనిక్కడికి రాను, వెళ్ళండి!" అంటూ అరిచాడు.

అందరు నిర్ఘాంతపోయారు, డాక్టర్ తో బాటు.

"డాక్టర్ " అన్నాడు ప్రసాదరావు ఇంకేమి చెప్పటానికి నోరు రాక.

డాక్టరు అరుణ్ ని సమీపించాడు. అతన్ని పరీక్షించటానికి స్టెతస్కోప్ గుండెలకి ఆనించబోయాడు. అంతే, డాక్టర్ని చాచి లెంపకాయ కొట్టాడు అరుణ్.

ఊహించని ఈ పరిణామానికి నిశ్చేష్టుడై తూలి గోడమీద పడ్డాడు డాక్టరు.

"గెటవుట్ ...పోండి, ఇక్కడ్నుంచి వెంటనే వెళ్ళిపొండి!" అంటూ అరిచాడు అరుణ్.

అతని కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా వున్నాయి. వికృ

తంగా నవ్వుతున్నాడు. అతని ముఖంలోకి చూడటానికే వాళ్ళంతా భయపడుతున్నారు. అంత భయంకరంగా వుందతని రూపం!

ప్రసాదరావు చొరవగా ముందుకొచ్చాడు. అరుణ్ వైపు తీక్షణంగా చూశాడు. అరుణ్ అంతకంటె తీక్షణంగా చూశాడు.

అరుణ్ చెంపలు రెండు ఛెళ్లు ఛెళ్ళున చరిచాడు ప్రసాదరావు.

అరుణ్ పెద్ద కేకపెట్టి వెనక్కి విరుచుకుపడి పోయాడు. మరుక్షణం అతనికి స్పృహతప్పిపోయింది.

6

"నాన్నా, చెల్లాయి ప్రమాదవశాత్తు చీరకొంగు అంటుకొని చనిపోలేదు. చంపేశారు." అన్నాడు శేఖర్ లోకనాథంతో.

లోకనాథం విస్తుపోయి చూశాడు "ఏమిటి శేఖర్, సుజాత ప్రమాదవశాత్తు చనిపోలేదా? ఎవరు చెప్పారు నీకు?" అన్నాడు.

"ఎవరు చెప్పితే నేం. సుజాతది బలవన్మరణం! బావ, అతని తల్లి కిరోసిన్ పోసి కాల్చేశారు. అందుకే మనం వెళ్ళేలోపల సమాధి చేసేశారు చెల్లాయిని."

"నువ్వు అపోహపడుతున్నావు. పోలీసులకి తెలిస్తే కర్మ చెయ్యనివ్వరని, ఆటంకాలొస్తాయని భయపడి అర్జంటుగా సమాధి చేసేశారని చెప్పారు కదా! సుజాత భర్త గోపీ ఉత్తముడు. అతని తల్లి కూడా చాలా సౌమ్యురాలు. వాళ్ళంటే కిట్టని వాళ్ళెవరో చెప్పిన మాటలు నిజమని నమ్మేశావు, అవునా?"

"లేదు నాన్నా! నాకు చాలా నమ్మకంగా తెలిసింది.

చెల్లాయిని పాతిపెట్టిన సమాధి తవ్వి చూద్దాం. డాక్టరు పరీక్ష చేయిద్దాం. పోస్టుమార్టంలో నిజానిజాలు తేలిపోతాయి."

"శేఖర్, పిచ్చి పిచ్చిగా మాట్లాడకు. సమాధి చేసిన పిల్లను మళ్ళీ బయటకు తవ్వటం ఎంతమాత్రం మంచిది కాదు. పుణ్యలోకాలు పొందవలసిన బిడ్డకు ఆత్మశాంతి దొరకదు. ఆ ఆలోచనే మంచిదికాదు."

"నాన్నా, మీరింకా అమాయకత్వంలో వుండి మాట్లాడుతున్నారు. గోపీ ఉత్తముడనుకొంటున్నారు. కాని నాకు తెలిసిందేమిటంటే, అతనికి మరోచోట మరో అమ్మాయి వుంపుడుకత్తెగా వుందని, ఆమెకోసమే చెల్లాయిని పొట్టన బెట్టుకున్నాడని! అతనితల్లి కూడా సుజాతను వేధించుకు తినేది!"

"నీ అభిప్రాయం సహేతుకంగా లేదు. ప్రతిరోజూ పేపర్లలో ఇలాంటి కేసులు గురించి చదువుతున్నాం. అయితే అవన్నీ కట్నం తేలేదనే కక్షతో చేస్తున్న దురాగతాలు. కాని మనం సుజాతకి కట్నం దండిగా ఇచ్చాం. అల్లుడు యేది కావాలంటే క్షణాలమీద ఇచ్చేవాళ్ళం. పెట్టుపోతల్లో యేనాడూ లోటు చెయ్యలేదు. సుజాతను చంపుకోవటంవల్ల వాళ్ళకే నష్టం. నీ అనుమానం నిరాధారం."

"నాన్నా, నేను ముందే చెప్పాను. మరో పిల్ల వల్లో పడి, చెల్లాయిని అడ్డం తొలగించుకున్నాడని! నా అనుమానం ఉత్త అనుమానమాత్రమే కాదు. అందుకు పటిష్టమైన సాక్ష్యాధారాలున్నాయి. సుజాతను నిర్దాక్షిణ్యంగా, రాక్షసంగా చంపినందుకు గోపీని అతని తల్లిని ఉరికంబమెక్కిస్తాను. చెల్లాయి ఆత్మకు శాంతి కలిగిస్తాను" శేఖర్

విసురుగా వెళ్ళిపోయాడక్కడనుంచి.

లోకనాథం అతను వెళ్ళిన వైపే సాలోచనగా చూస్తూ నిల్చుండిపోయాడు.

అతను ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా యీ మధ్యనే రిటైరయ్యాడు అతనికి సుజాత, శేఖర్ ఇద్దరే సంతానం.

సుజాతను మూడేళ్ళ క్రితమే గోపీకిచ్చి వైభవంగా పెళ్ళిచేశాడు. సుజాత గ్రాడ్యుయేట్. గోపీ కిశోర్ ఫ్యాక్టరీలో మెకానికల్ ఇంజనీరు. కట్నకానుకలు ఘనంగా ఇచ్చి చేశాడు లోకనాథం.

శేఖర్ బి టెక్ ఫైనలియర్లో వున్నాడిప్పుడు. అతనికి ఆవేశం పాలెక్కువ. సుజాతను ప్రాణసమానంగా చూసుకొనేవాడు శేఖర్. తన బావగారు ఇంజనీరు కావటం తండ్రి ఇంజనీరే కావటం, తనూ ఇంజనీరింగ్ కోర్సు చదవటం అతనికి చాలా ఆనందం కలిగించే అంశాలయ్యాయి.

ఇంజనీరు బావంటే ప్రాణం పెట్టేవాడు. అయితే ఆ బావ చెడు వ్యసనాలకు లోనయ్యాడని తాగుడు, జూదమే కాకుండా అమ్మాయిల వేటగాడని, ప్రత్యేకం ఓ అమ్మాయిని చేరదీసి వేరే యింట్లో పెట్టాడని తెలిసిన రోజున శేఖర్ మండిపడ్డాడు.

అన్నాళ్ళుగా గోపీపైనున్న సదభిప్రాయం దూది పింజెలా ఎగిరిపోయింది. మంచులా కరిగిపోయింది.

గోపీ తనకన్న పెద్దవాడు, పైగా చెల్లెలు భర్త. చాలా సున్నితమైన వ్యవహారం. భార్యాభర్తల మధ్యకి మూడో మనిషి అడ్డురావటం మంచిదికాదని తెలియని అమాయకుడు కాదు శేఖర్.

అందుకే తనంతట చెల్లెలు చెప్తుందేమోనని ఎదురు

చూశాడు. పుట్టింటికి వచ్చినప్పుడల్లా సుజాతనుంచి ఆ విషయాలు రాబట్టాలని చూశాడు. ఆమె చాలా గుంభనగా ఆ విషయాలను దాచేసేది. ప్రసంగం పెరగనిచ్చేది కాదు.

కాని శేఖర్ అంత తేలిగ్గా వదల్లేదా విషయం. కొందరు స్నేహితులతో రహస్యంగా ఇన్వెస్టిగేట్ చేశాడు. నిజాలు బయటపడ్డాయి. ఆధారాలతో బాటు తండ్రికి వివరంగా తెలియచెప్పాలనుకున్నాడు.

ఇంతలోనే ఎదురుచూడని ఘోరం జరిగిపోయింది. చెల్లాయి గ్యాస్ స్టౌవ్ అంటుకొని కాలిపోయిందని గోపీ టెలిగ్రామిచ్చాడు. తండ్రి, తను వెళ్ళేసరికి ఖననం చేసేశారు. చుట్టుపక్కల వాళ్ళుకూడా అది ప్రమాదవశాత్తూ జరిగిందేనని చెప్పటంతో నిజమేననుకున్నాడు లోకనాథం.

కాని శేఖర్ తేలిగ్గా నమ్మలేదు. అంత అర్జెంటుగా ఖననం చెయ్యటం అతనిలోని అనుమానాన్ని మరింత బలపర్చింది. అయితే బయటపడలేదు.

తండ్రితో బాటు ఓసారి చెల్లాయి సమాధిని దర్శించి పువ్వుగుచ్చాలు ఉంచి వచ్చేశాడు. ఆ క్షణంలోనే మనసులో దృఢంగా నిశ్చయించుకున్నాడు—

“చెల్లీ, నీ చావుకు కారకులైనవాళ్ళ అంతు చూస్తాను. నీ ఆత్మకు శాంతి చేకూరుస్తాను” అని.

ఆ తర్వాత అతను చేసిన ప్రయత్నంవల్ల అసలు విషయం బయటపడింది.

7

“ఎవరైనా సైకియాట్రిస్టుకి చూపిస్తే మంచిదనుకొంటున్నాను” అన్నాడు డాక్టరు సుధాకర్.

ప్రసాదరావు, కిశోర్ అతని వంక ప్రశ్నార్థకంగా

చూశారు.

"తమ్ముడి కేసుపరిస్థితి ఎలా వుందని మీరు ఫీలవుతున్నారు డాక్టర్?" అనడిగాడు కిశోర్.

సుధాకర్ సాలోచనగా చూసి, "ఫిజికల్లీ హి ఈజ్ ఆల్‌రైట్! కాని అతను మానసికంగా బాగా బలహీనపడిపోయాడు___ఎందుకో బాగా భయపడిపోయాడు.... స్మశానం మధ్య పడున్నాడని అన్నాడు కదా....!" అన్నాడు.

"తమ్ముడు స్వతహాగా పిరికివాడు డాక్టర్! అందుకే భయపడివుంటాడు. కాని అర్ధరాత్రి దాటాక ఒంటరిగా స్మశానానికి నడిచి వెళ్ళటం ఎంతో ధైర్యవంతులకి గాని సాధ్యంకాని పని. ఈ ద్వంద్వ ప్రవృత్తి యేమిటో అంతుబట్టడంలేదు."

"కొందరిలో ఇలాంటి ప్రవృత్తి వుండటం అసహజం కాదు. పిరికివాళ్ళు ఒకోసారి ఎంతో ధైర్యంగా ప్రవర్తించటం, హత్యలు చేయటం, సాహసాలు చేయటం నాకు తెలుసు. అదే ద్వంద్వ ప్రవృత్తి."

"అయితే మీ సలహా ఏమిటి?"

"మన సత్యావతే తను చూడటమే అన్నివిధాల సరయినదని నా అభిప్రాయం. ఇలాంటి విషయాలు సైకియాట్రిస్టు అయితేనే సరిగా డీల్ చేయగలుగుతాడు. నాకు తెలిసిన సైకియాట్రిస్టు వున్నారు రెఫర్ చెయ్యమంటారా?"

"చెప్పండి.... వెంటనే కన్సల్టు చేస్తాం. ఇప్పుడు వాడి పరిస్థితి నానాటికీ తీసికట్టుగా వుంది. ఇలా వదిలేస్తే ఎలాంటి విపరీత పరిణామాలకి దారితీస్తుందో అనూహ్యంగా వుంది" అన్నాడు, అంతవరకు మౌనంగా వారి

సంభాషణ వింటున్న ప్రసాదరావు.

"ఆయన పేరు మేఘనాథ్. ఫారిన్ రిటర్న్డ్. ఆయన ఇలాంటి కేసుల్ని సమర్థవంతంగా ట్రీట్ చేస్తారు. అందుకే ఆయన్ని సజెస్టు చేస్తున్నాను."

"డాక్టర్ నాదో సందేహం...." కిశోర్ ఆగాడు.

"ఏమిటది?"

"తమ్ముడిలా అయిపోవటానికేదైనా దుష్టశక్తిని ప్రయోగించారేమో ఎవరైనా..?"

"వాట్డూయూ మీన్? చేతబడి కావచ్చుననా?"

"అలాంటిదిగాని .... దయ్యమేదైనా ఆవహించటం గాని ..."

"స్టాపిట్! మీరలాంటి మూఢనమ్మకాలని పట్టుకొని వేళ్ళాడుతూ ట్రీట్‌మెంట్ అలక్ష్యం చేశారంటే చేజేతులా అతన్ని పోగొట్టుకుంటారు. అతను చాలా నీరసంగా వున్నాడు. బలమైన ఆహారం మందులు చాలా అవసరం."

కిశోర్ వెంటనే సర్దుకొని, "అబ్బే, భూతవైద్యుల చుట్టూ తిప్పుతానని మీరనుకొంటున్నారల్లే వుంది; నేను వాటికి వ్యతిరేకిని.... ఇలా వింతగా ప్రవర్తించేవాళ్ళు ఈమధ్య యెక్కువైపోయారు. అందుకని అలా అడిగాను" అన్నాడు.

సుధాకర్ ఏదో అనబోతుండగా అరుణ్ పక్కమీద కదిలాడు. అందరు ఆత్రంగా అతన్ని సమీపించారు. ఆడవాళ్ళు అనవసర ఆందోళనతో చికాకుపరుస్తారని వాళ్ళని ఆ గదిలోకి రావద్దని ముందుగానే చెప్పాడు డాక్టరు.

అరుణ్ లేచి కూచున్నాడు పక్కమీద.

డాక్టర్ సుధాకర్ అతనికి దూరంగా స్టూల్ లాక్కొని కూచున్నాడు. అంతక్రితం జరిగిన అనుభవం అతనింకా మరచిపోలేదు. రోగి మానసిక పరిస్థితి అస్తవ్యస్తంగా వుందని తెలిసికూడా సాహసించటం మూర్ఖత్వమనిపించుకుంటుందని తెలుసతనికి.

అరుణ్ కళ్ళు తెరిచి ఆ గదిలోని ముగ్గురి వంక పరిశీలనగా చూశాడు. అయితే అతని చూపులో స్థిరత్వం లేదు. ఎవరిమీద నిలబడటంలేదు.

సుధాకర్ అతనివైపు చూసి, "మిస్టర్ అరుణ్.... అరుణ్...." అని పిలిచాడు.

అరుణ్‌నించి రెస్పాన్స్ లేదు. అతని కళ్ళు పత్తికాయల్లా విచ్చుకున్నాయి. "అరుణ్ ఎవరు? నా పేరు శ్యామలరావు...." అన్నాడు.

ముగ్గురు నిర్ఘాంతపోయారా మాటలకి. ముఖ్యంగా కిశోర్ ముఖాన నెత్తురుచుక్క లేదు. పాలిపోయి వుంది. ఏమిటీ విచిత్ర పరిస్థితి?

సుధాకర్ మెల్లగానే, అయినా గంభీర స్వరంలో చెప్పాడు. "నీ పేరు అరుణ్....శ్యామలరావు కాదు."

"నో నా పేరు శ్యామలరావు, నువ్వెవరు?" అన్నాడు అరుణ్ సుధాకర్ వైపు కోపంగా చూస్తూ.

"నేను డాక్టర్ని. మీ ఫేమిలీ డాక్టర్ సుధాకర్ని."

"డాక్టర్ వా, యాక్టర్ వా? ఇక్కడెవరూ పేషెంట్స్ లేరు. నీకిక్కడేం పని?"

"ఊరికే ఫ్రెండ్లీగా వచ్చాను. పేషెంట్ కోసంకాదు. చూసిపోదామని....అంతే!"

"వాళ్ళిద్దరు ఎవరు?"

"అతను మీ అన్నయ్య కిశోర్. ఈయన మీ

చిన్నాన్న ప్రసాదరావుగారు."

"డామిట్, అబద్ధాలు చెప్పకు. నాకు అన్నలుగాని, తమ్ముళ్ళుగాని లేరు — అక్క తప్ప! ఆ అక్క కూడా చచ్చిపోయింది నా కళ్ళముందే! చిన్నాన్నగాని పెద నాన్నగాని లేరు! నీలా అబద్ధాలు చెప్పే వాళ్ళంటే నా కసహ్యం. నువ్వు ఖచ్చితంగా యాక్టర్ వే!''

ముగ్గురు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. కిశోర్ ఆసక్తిగా వింటున్నాడా మాటల్ని. శ్యామలరావు చని పోయి రెండు నెలలయింది. అతని అక్క కూడా అప్పుడే చనిపోయింది. ఈ సంగతులన్నీ అరుణ్ ఎలా చెప్ప గలుగుతున్నాడు?

కిశోర్ అరుణ్ ముఖంలోకి పరీక్షగా చూస్తూన్న సమయంలోనే అరుణ్ అతనికేసి తీక్షణంగా చూశాడు. వికృతంగా నవ్వాడు. ఆ నవ్వు అరుణ్ నవ్వు కాదు.... అవును.... అది శ్యామలరావు గొంతులాగానే వుంది. అత నిలాగే నవ్వేవాడు. అయితే ఆ నవ్వు వికృతంగా వుండేది కాదు.

అరుణ్ కిశోర్ కళ్ళల్లోకి చూస్తున్నాడు. "హల్లో నేను గుర్తొచ్చానా? నిన్ను తేలిగ్గా వదులాననుకోకు. నిన్ను, నీ కుటుంబాన్ని సర్వనాశనం చేస్తాను. అప్పుడు గాని నా కసితీరదు. నా పగ చల్లారదు" అన్నాడు.

కిశోర్ గుడ్లప్పగించి చూస్తూన్నాడు. "ఏమిటి, ఇతని మాటల కర్థం? శ్యామలరావు ఆత్మ అరుణ్ ని ఆవహిం చిందా? శ్యామలరావు తనమీద కక్షవహించాడా? అందుకే అరుణ్ ని ఆవహించి, తనకి జరగబోయే పరి ణామాల గురించి హెచ్చరిస్తున్నాడా? తన కుటుంబం మీద పగసాధిస్తాడా?

డాక్టర్ సుధాకర్ అరుణ్ వంక చూసి, "మిమ్మల్నొకసారి చెకప్ చెయ్యొచ్చా?" అనడిగాడు. అరుణ్ ఇలా వింతగా ప్రవర్తిస్తున్నపుడు అతని హార్ట్ బీట్, పల్స్ రేటు చూడాలని అతని అభిప్రాయం. కాని, అరుణ్ అంగీకరించే అవకాశమివ్వలేదు.

"డోంట్ టచ్ మి! నేను బాగానే వున్నాను. ప్లీజ్ గో అవే!" అరిచాడు అరుణ్.

సుధాకర్ జంకాడు. తను యింకా బలవంతం చేసుకుంటే జరగబోయే పర్యవసానం గ్రహించాడు.

ప్రసాదరావు అరుణ్ వంక అనునయంగా చూసి, "బాబూ, అరుణ్ కాఫీ తాగుతావా?" అన్నాడు.

"కాఫీ తాగను. రక్తం తాగుతాను. ఉందా?" అన్నాడు వికటంగా నవ్వుతూ అరుణ్.

మళ్ళీ అతన్ని మాట్లాడించే సాహసం యెవరూ చెయ్యలేదు. మీదపడి కరుస్తాడో, రక్తం తాగుతాడో అనూహ్యంగా వుంది.

కిశోర్‌కైతే ఒళ్ళంతా చెమట్లు పట్టేసి. భయాందోళనలతో సన్నగా వణుకు మొదలయ్యింది. అరుణ్ యే క్షణంలోనైనా తనమీద పడి కరుస్తాడేమోనని సందేహం పట్టి పీడిస్తోంది.

శ్యామలరావు పగ సాధించబోతున్నాడా? తన ప్రాణ సమానుడైన తమ్ముడిని నాశనం చేసి రెండురకాలుగా తనమీద కక్ష తీర్చుకుంటున్నాడు. తప్పు చేసింది తనైతే, దండన అమాయకుడైన అరుణ్‌కా? ఇది అన్యాయం. తను సాగనివ్వకూడదు!

అయితే తను గతరాత్రి స్మశానం దగ్గర చూసినది శ్యామలరావు ప్రేతాన్నా? చచ్చేటపుడు యెలాంటి

రూపంలో తనకి చివరిసారిగా కనిపించాడో, అదే రూపంతో ప్రత్యక్షమయ్యాడు.

అదెలా సాధ్యం? చనిపోయిన మనిషి మళ్ళీ అదే రూపంతో కనిపించటం ఎక్కడైనా వుందా? తను భ్రమపడ్డాడా? లేక భయపడ్డాడా? ఒంటరితనంవల్ల, పిరికితనంవల్ల తను చిత్త చాంచల్యానికి లోనయ్యాడా? అంతా చిత్రంగా వుంది!

సరిగ్గా అప్పుడే అరుణ్ పెద్దగా కేక వేసి విరుచుకు పడిపోయాడు. అతనికి వెంటనే స్పృహ తప్పిపోయింది.

డాక్టర్ సుధాకర్ ఆత్రుతగా అరుణ్ పల్స్ హార్ట్ బీటింగ్ చూశాడు. నార్మల్ కన్న ఎక్కువగా వుండటం గమనించి సాలోచనగా తలూపాడు.

తన వంక ఆత్రుతగా చూస్తున్న కిశోర్ని, ప్రసాద రావుని చూసి మందహాసం చేసి, "హీ ఈజ్ ఆల్ రైట్! కాని మానసికంగా బాగా అలిసిపోయాడు. అతనికి విశ్రాంతి బాగా కావాలి! అంతే కాదు, బలమైన ఆహార మివ్వాలి. స్పృహలోకి వస్తే మళ్ళీ వింతగా ప్రవర్తిస్తాడేమో! సెలైన్ అరేంజి చెయ్యనా?" అన్నాడు సుధాకర్.

"సెలైనా? తమ్ముడు నోటితో ఆహారం తీసుకోవటానికి నిరాకరిస్తే అప్పుడు చూద్దాం. ఈసారి తెలివిలోకి వచ్చాక మనల్ని గుర్తిస్తాడేమో! అది కన్ఫర్మ్ చేసుకున్నాక మీరన్నట్టు సెలైన్ పెట్టిస్తే బావుంటుంది" అన్నాడు కిశోర్.

"ఓ.కే., దెన్! నేను మళ్ళీ ఓ గంట తర్వాత వస్తాను. రెగ్యులర్ పేషెంట్స్ ఎదురుచూస్తూంటారు. ఈలోపల అరుణ్ లేచి ఎబ్‌నార్మల్‌గా ప్రవర్తిస్తే

నాకు ఫోన్ చెయ్యండి, వెంటనే వస్తాను" అంటూ లేచాడు సుధాకర్.

కిశోర్, ప్రసాదరావు మౌనంగా తల లూపారు.

తలుపుదాకా వెళ్ళాక మళ్ళీ వెనుతిరిగి, "అతన్ని కొట్టడంగాని, అతనితో వాదన పెంచుకోవటంగాని చెయ్యొద్దు. మెంటల్ డిప్రెషన్‌కి దారితీసే ప్రమాద ముంది. అప్పుడు, హి విల్ బి అవుటాఫ్ అవర్ హేండ్స్!" అన్నాడు సుధాకర్.

"అలాగే డాక్టర్!" అన్నారిద్దరు ఒకేసారి.

సరిగ్గా అప్పుడే అరుణ్ లేచికూచున్నాడు.

కిశోర్, ప్రసాదరావు అతన్ని సమీపించారు.

8

"ఏమిటి రవీ, యిలా వచ్చావు? భోంచేశావా? దా, కూచో!" అన్నాడు పోలారావు.

"నేను కూచోవటానికి రాలేదు. నీ విషయం తేల్చుకోవటానికే వచ్చాను" అన్నాడు రవీంద్ర సూటిగా చిన్నాన్న వంక చూస్తూ.

"నా విషయమా? ఏమిటి రవీ, వింతగా మాట్లాడు తున్నావు?"

"నటించకు! జనార్దనం అన్నయ్యని నువ్వే చంపే శావు."

"నీకు పిచ్చెత్తిందా ఏం? జనార్దనాన్ని నేను చంపడ మేమిటి? అయినా ఆర్నెల్ల తర్వాత నువ్వీ ప్రసక్తి తేవటంలో అంతరార్థ మేమిటి?" కోపంగా అన్నాడు పోలారావు.

"నిజం నిలకడమీద తేలటం అనాదిగా వస్తూన్నదే! ఈసారికూడా అలాగే ఆలస్యమయింది — ఆర్నెల్లు!"

"రవీ, నీకు మతిపోయింది. అసలు జనార్దనాన్ని చంపాల్సిన అవసరం గాని, అగత్యంగాని నాకు లేదు. నువ్వొట్టి పుణ్యానికి నామీద అభాండాలేస్తున్నావు!"

"నా దగ్గర సాక్ష్యాధారాలున్నాయి. అమ్మకూడా చెప్పింది నువ్వు ఆస్తికోసం అన్నయ్యని గతంలో ఓసారి బెదిరించావని....!"

పోలారావు వికటంగా నవ్వాడు.

"ఆస్తి....ఆస్తి....ఎక్కడిది మీకు? లేని ఆస్తికోసం జనార్దనాన్ని చంపానంటావా? నీకు నిజంగానే పిచ్చెత్తింది. వెంటనే స్పెషలిస్టుని కల్సి చూపించుకో."

"స్టాప్ ది నాన్సెన్స్! నాకెలాంటి చిత్తచాంచల్యం లేదు. నేను బాగానే వున్నాను. ఆస్తి అంటావా, అది వుందో లేదో నాకంటే నీకే బాగా తెలుసు."

"ఏం తెలుసు? ఆస్తే వుంటే మీరందరు అన్నాళ్ళు అగచాట్లు పడాల్సిన అగత్యమే లేకపోయేది కదా!"

"పైకి అందరు అనుకునేమాటే అది! కాని మా నాన్నగారు బతికుండగానే లక్షరూపాయలు ఖరీదు చేసే ఇళ్ళస్థలాలు సంపాదించారని, వాటికి సంబంధించిన పత్రాలు నీదగ్గరే చిక్కుపడిపోయాయని, నువ్వు ఆ స్థలాలను పరిచక్షులకు బేరం పెట్టావని, వాటిని అమ్మటానికి జనార్దనం అన్నయ్య సంతకం కావలసి వచ్చిందని అన్నయ్య సంతకం పెట్టడానికి నిరాకరించాడని, నువ్వు బెదిరించావని—అన్నీ తెలిశాయి నాకు."

"ఓహో, చాలా తెలిశాయన్నమాట! ఏవో సాక్ష్యాధారాలున్నాయన్నావు కదా! అవేమిటో చూపించు"

"చూపించాల్సిన వాళ్ళకి తప్పకుండా చూపిస్తాను. స్వార్థంతో అన్నకొడుకని కూడా చూడకుండా నిర్దా

క్షుణ్ణంగా ఓ అమాయకుడిని పొట్టన పెట్టుకున్నావు. నిన్నంత తేలిగ్గా వదలను."

"ప్రగల్భాలు కట్టిపెట్టు. జనార్దనం ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి చనిపోయాడు. ఇక నువ్వారోపిస్తూన్న పత్రాలవిషయం నాకేం తెలియదు. మీ నాన్న బతికుండగా ఏమీ సంపాదించలేదు. నేను జనార్దనాన్ని ఓసారి సంతకం పెట్టమన్న మాట నిజమేగాని, యీ విషయంలో కాదు."

"మరో కథ అల్లుతున్నారా?"

"అంత ఖర్మేం పట్టలేదు నాకు. నువ్వనవసరంగా నన్నుమానిస్తున్నావుగాబట్టి నీ అపోహాల్ని తొలగించటానికే చెప్తున్నాను."

"ఏమిటది?"

"మీ అన్నయ్య ఫ్యాక్టరీలో అకౌంటెంటు. అప్పుడప్పుడు కంపెనీ క్యాష్ బాంకులో కట్టడం, డ్రా చెయ్యటం కూడా అతనిమీదే పెట్టేవారు. ఆ ఉద్యోగానికి నేను సెక్యూరిటీ ఇచ్చాను. అందుకుగాను కొంత డబ్బు కంపెనీకి డిపాజిట్ కట్టాను. కాబట్టే జనార్దనానికి ఆ ఉద్యోగం దొరికింది. ఆ సొమ్మును ప్రతినెల తన జీతం నించి ఇవ్వటానికి జనార్దనం ఒప్పుకున్నాడు. తీరా నేను డబ్బు కట్టాక తను నెలనెలా డబ్బివ్వటానికి నిరాకరించాడు."

"అబద్ధం! అన్నయ్య అలాంటివాడు కాదు. నిజంగా నువ్వు సెక్యూరిటీ ఇచ్చివుంటే తల తాకట్టు పెట్టయినా డబ్బు చెల్లించేసి వుండేవాడు. కాని పక్షంలో నెల నెల తీర్చటానికి సంతకమైనా చేసి వుండేవాడు. కాని

అన్నయ్య సంతకం పెట్టనని నిరాకరించాడంటే అదేదో బలమైన కుట్ర అయివుండాలి!"

"కుట్రా? అతని మీద ఎవరు కుట్రపన్నుతారు?"

"ఎవరో ఎందుకు — నువ్వే! మా తండ్రి పోయినప్పట్నుంచీ ఈనాటి దాకా మా ఆలనా పాలనా చూశావా? ఈనాడు అన్నయ్య ప్రయోజకుడయితే, ఎలా వాడ్ని ఉద్యోగంనించి బయటకి పంపెయ్యాలా అని ప్లాన్ చేశావు. ఉద్యోగం నించి పంపలేక ఏకంగా పైకి పంపేశావు."

"గెటౌట్! మరో క్షణం నా కళ్ళముందున్నావంటే ఏం చేస్తానో నాకే తెలియదు. పోనీలే రక్తసంబంధీకులు కదా అని నాకు చేతనైన సహాయం చేస్తే, చివరికి నా మీద అభాండాలు వేసి అవమానకరంగా మాట్లాడతావా? వెళ్ళిక్కడ్నుంచి!"

"వెళ్తాను మిస్టర్ పోలారావ్! నీ అకృత్యాలు అన్నీ బయట పెడతాను. అన్నయ్యనెందుకు ఎలా హత్య చేశావో అన్నీ వివరాలతో పోలీసులకి చెప్పటానికే వెళుతున్నాను. వాళ్ళే చూసుకుంటారు తక్కిన కథ."

"ఆగు!" వెనకనించి అరిచాడు పోలారావు. ఇప్పుడతని చేతిలో నిగనిగ మెరుస్తున్న పిస్తోలు ఉంది. అది తిన్నగా రవీంద్రకే గురిచేయబడివుంది!

9

శేఖర్ చాలా సేపట్నుంచీ ఆ పాన్ షాపు దగ్గర ఎదురు చూస్తున్నాడు. ముఖానికి పేపరడ్డం పెట్టుకొని ఆ చోటే పరీక్షగా చూస్తున్నాడు.

అంతకితమే తన పాద గోపీ ఆ యింట్లోకి వెళ్ళాడు. అతను మళ్ళీ బయటకొస్తాడని చూస్తున్నాడు. గంట

యినా బయటకు రాలేదు.

స్కూటర్ బయట స్టాండు వేసి వున్నది.

సాయంత్రం ఆరు గంటలయింది.

ఆ ఇల్లు గోపీ ఉంపుడుకత్తెదని శేఖర్‌కి తెలుసు. ఆమె వల్లో పడి చెల్లాయి సుజాతని నిలువునా ప్రాణం తీసేశాడు గోపీ. అలాంటి కిరాతకుడ్ని నరరూప రాక్షసుడ్ని ఎట్టి పరిస్థితుల్లోను ప్రాణాలతో వదలకూడదని నిర్ణయించుకున్నాడు శేఖర్.

అయితే చట్టానికి సాక్ష్యాధారాలు కావాలి. వాటిని కోర్టులో రుజువు చెయ్యగలగాలి. అప్పుడే గోపీకి శిక్ష పడుతుంది.

కాని తను చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకోవాలను కుంటున్నాడు. తనే న్యాయమూర్తిగా తన చెల్లెలుకు జరిగిన అన్యాయానికి గోపీకి శిక్ష విధించాలనుకుంటు న్నాడు. అతనికి ఆ పనిగా సాయపడిన అతని తల్లిని కూడా శిక్షించాలి! పరోక్షంగా అతన్ని ప్రేరేపించిన ఈ ఉంపుడుకత్తెను కూడా విడిచిపెట్టకూడదు!

సుజాత గురించి తలచుకునే కొద్దీ శేఖర్ రక్తం సల సల మరుగుతోంది. నిర్దాక్షిణ్యంగా అమాయకురాలైన చెల్లెల్ని పొట్టన పెట్టుకున్న ఈ రాక్షసుల్ని నిలువునా నరికెయ్యాలి.

అప్పుడే సుజాత ఆత్మకు శాంతి!

శేఖర్ పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

మరో అరగంట తర్వాత గోపీ బయటికొచ్చాడు. వెనకనే గుమ్మందాకా వచ్చిన మెరుపు తీగను చూసి పళ్ళు పటపటలాడించాడు. నిజానికి ఆ అమ్మాయి సుజాత అంతటి అందగత్తె కాదు. కాని గోపీ ఎలా పడ్డాడీమె

తల్లోకి కామం గుడిది.

గోపీ స్కూటర్ మీద వెళ్ళిపోయాడు.

శేఖర్ చకచక ఆ గుమ్మం మెట్లెక్కాడు. తలుపు పైన టకటక చప్పుడు చేశాడు.

"ఎవరు?" అన్న సన్నటి స్వరం వినిపించింది.

"నే నే!" అన్నాడు పొడిగా.

తలుపులు తెరుచుకున్నాయి. ఆమె బయటికి తొంగి చూసి శేఖర్ ని చూసి వెంటనే తలుపులు మూసుకో బోయింది.

శేఖర్ మెరుపు వేగంతో తలుపు సందున కాలు పెట్టి నెట్టుకుంటూ లోపలికి వెళ్ళిపోయాడు. ఆ వెనకనే తలుపు మూసి బోల్టు పెట్టేశాడు.

"ఎవరు....ఎవరునువ్వు....వెంటనే బయటికి వెళ్ళక పోయావంటే అందర్నీ పిలిచి అల్లరి చేస్తాను" బెదిరించింది ఆమె.

శేఖర్ చేతిలో తళుక్కున మెరిసింది బటన్ నైఫ్!

"పిలుస్తావా? ఇప్పుడు పిలు....నీ పిలుపు శాశ్వతంగా ఆగి పోతుందో లేదో, చూద్దువుగాని!" అన్నాడు.

ఆమె భయంతో బిగుసుకుపోయింది.

"న....నన్నేం చెయ్యకు....నీకేం కావాలో తీసుకుపో...." అన్నది. గొంతు పొడారిపోయి, చెమట్లతో ఆమె శరీరం తడిసిపోయింది.

"నాక్కావలసింది నీ దగ్గర లేదు. నువ్విచ్చేది నా కక్కర్లేదు."

"నీకేం కావాలన్నా సరే తీసుకుపో నే నడ్డు చెప్పను. కాని, నన్నేం చెయ్యకు...." భయంగా చూసిందతని వంక.

"నీ పేరేమిటి?" అడిగాడు శేఖర్.

"సుందరి" అన్నదామె.

"ఓహో, అపురూప సౌందర్యవతివనీ సుందరి అని పేరు పెట్టుకున్నావు? ...ఊఁ! ఏం కావాలన్నా ఇస్తానన్నావు కదా, నువ్వే కావాలి! రా." అన్నాడు శేఖర్ ఆమె చెయ్యిపట్టుకొని.

సుందరి ఒక్క క్షణం ఆలోచించి, "నీ కోరిక తీరుస్తాను. నన్నేం చెయ్యకుండా వదిలేస్తావా?" అన్నది....

"నీ క్షేమం హాని చెయ్యకపోతే నువ్వు నాతో గడపటానికి సిద్ధమేనన్నమాట! నీవు శీలంపోయినా, ప్రాణం నిలబడితే చాలు, అవునా?"

"ప్రాణంపోతే రాదుకదా!"

"ఓహో! ఇంత శీలవతివనా నిన్ను గోపీ ఉంచుకున్నాడు?"

"గోపీ సంగతి నీకెలా తెలుసు? నువ్వెవరు?"

"నేనెవరో నీవు తెలియాల్సిన అవసరం లేదు. కాని ఓ అమాయకురాలిని చంపించినందుకు, ఆమె బంధువుల్ని శోకసముద్రంలో ముంచి నువ్వు ఆ గోపీగాడితో కులుకుతున్నందుకు నిన్నేం చేసినా పాపంలేదు!"

సుందరి భయంగా చూసింది. "నేనెవర్నీ చంపించలేదు. నాకేం తెలియదు" అన్నది.

"అలాగా! సుజాతని చంపించింది నువ్వుకాదూ? నీ వల్లోపడికదూ, ఆ నికృష్టుడు అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్యను కిరోసిన్‌తో తగలేశాడు?! ఏం నువ్వు ఆమె కన్నా అందగత్తెవా? ఆమె కాలిగోటికి కూడా సరిపోలవు." శేఖర్ ఒక్కో అడుగే ఆమె దగ్గరకు వేస్తుంటే ఆమె మరింత వెనక్కిపోతోంది. గోడ

అడ్డొచ్చింది. గోడకు ఆనుకుని నిల్చుండిపోయింది.

"నువ్వే అందాన్ని నమ్ముకుని వచ్చి సంసారాన్ని మంటపెట్టేశావో, ఏ అందాన్ని నమ్ముకుని నా చెల్లెలి జీవితాన్ని మట్టిలో కలిపేశావో, ఏ అందం చూసి మోహించి ఆ గోపీగాడు నీ వెంట పడ్డాడో— ఆ అందం నీకు శాశ్వతంగా లేకుండా చేస్తాను." అంటూ ముందు కొచ్చి ఆమె రెండు బుగ్గలమీదా కత్తితో పొడవుగా గాట్లు పెట్టాడు శేఖర్.

ఆమె కెవ్వున అరవబోయింది. చటుక్కున నోరు మూసేశాడు.

ఆమె ముఖమంతా రక్తమయమయిపోయింది. బాధతో భయంతో ఆమె ముఖంలోకి ప్రేతకళ వచ్చేసింది.

శేఖర్ ఆమె జుట్టు చేతిలోకి తీసుకుని కుత్తుక వరకు ఆమె జడ కోసి పారేశాడు. ఆ తర్వాత ఆమె చెవులు ముక్కు కోసేశాడు. శూర్పణఖ ముక్కు చెవులు కోసిన లక్ష్మణుడిని తలపింప చేస్తున్నాడు శేఖర్. అతని ముఖం క్రోధంతో అరుణిమ దాల్చింది. మూడో నేత్రం తెరిచిన శివుడిలా, దక్షయజ్ఞాన్ని నాశనం చేసిన వీరభద్రుడిలా మహోగ్రంగా ఉన్నాడు.

బాధ భరించలేక గోడు గోడున ఏడుస్తోంది సుందరి. ఆమె దుస్తులంతా రక్తమయం! భయంతో, ఆందోళనతో, బాధతో ఆమె మరుక్షణం స్పృహతప్పి నేలమీద కుప్ప కూలిపోయింది.

సరిగ్గా అప్పుడే బయట గుమ్మందగ్గర గోపీ నిల్చుని తలుపు తడుతున్నాడు.

శేఖర్ కొద్ది క్షణాలు అలాగే నిల్చుండిపోయాడు. తప్పించుకుని పోయే మార్గం గురించి ఆలోచిస్తూ.

10

"ఎలావుంది అరుణ్ ఒంట్లో?" కిశోర్, ప్రసాద రావు ఒకేసారి అడిగారు.

అరుణ్ కాస్త ఆశ్చర్యంగా చూసి, "నాకేం? నేను బాగానే వున్నానే! చాలాసేపు నిద్రపోయినట్టున్నాను. బాగా ఆకలిగావుంది.... టైమెంత?" అన్నాడు.

కిశోర్ చెప్పాడు "మధ్యాహ్నం రెండున్నరయింది. లే, లేచి ముఖం కడుక్కోనిరా! నీకోసమని మేం కూడా భోంచెయ్యకుండా చూస్తున్నాం."

వెళ్ళిపోబోయిన సుధాకర్ అరుణ్ లేవటం చూసి వెనక్కి వచ్చాడు.

సుధాకర్ని అంతదూరంలో చూస్తూనే "హలో డాక్టర్! రండి, రండి! ఏమిటిలా వచ్చారు?" అన్నాడు అరుణ్, ముఖంలో నవ్వు తెచ్చుకుంటూ.

సుధాకర్ మందహాసం చేస్తూ, "ఊరికే వచ్చాను. హౌ డు యూ డూ?" అన్నాడు.

"ఓ.కే. ఫైన్! అలా సోఫాలో కూర్చోండి" అన్నాడు అరుణ్ మంచం దిగి కుర్చీలో కూచుంటూ.

సుధాకర్ అరుణ్ దగ్గరగా వచ్చి అతన్ని పరిశీలనగా చూస్తూ "ఏమిటి డల్‌గా వున్నారు....!?" అన్నాడు, యథాలాపంగా అన్నట్టు. అంటూనే అరుణ్ చేతిని స్నేహపూర్వకంగా నొక్కుతూ పల్స్ రేటు గమనించాడు.

నార్మల్‌గావుంది!

"కూచోండి ఇప్పుడే వస్తాను" అంటూ బాత్ రూం వైపు నడిచాడు అరుణ్.

సుధాకర్ కిశోర్ వంక చూసి, "అతనిప్పుడు చాలా మామూలుగా ఉన్నాడు. ఇంతక్రితం ఎంతిగా ప్రవర్తించిన

మనిషి ఇతనేనా అనిపించేటట్టున్నాడు. అతనిలోని ఈ ద్వంద్వ ప్రవృత్తిని మనస్తత్వ నిపుణుడయితేనే ఖచ్చితంగా బాగు చెయ్యగలుగుతాడు. మేఘనాధ్‌ని కన్సల్టు చేయటంలో అలక్ష్యం చెయ్యొద్దు" అన్నాడు.

కిశోర్ "అలాగే సర్. మీరు చాలా శ్రమ తీసుకున్నారు. వెళ్ళిరండి! అవసరమైతే ఫోన్ చేస్తాను." అన్నాడు.

సుధాకర్ వెళ్ళిపోయాడు.

మరో అయిదు నిమిషాల తర్వాత అరుణ్ తిరిగొచ్చి, "నేను రెడీ! పదన్నయ్యా భోంచేద్దాం!" అన్నాడు.

అప్పటికే డైనింగ్ టేబిల్ దగ్గర శాంతమ్మ, స్రవంతి అన్నీ సర్ది సిద్ధంగా ఉన్నారు. అరుణ్ వింత ప్రవర్తనకు ఇద్దరు బాగా కుంగిపోయారు. డాక్టర్ వద్దన్నాడని గదిలోకి రాలేదు కాని బయటినుంచి ఎప్పటికప్పుడు అరుణ్ ప్రవర్తనని వారిద్దరు పరిశీలిస్తూనే వున్నారు.

అరుణ్ వాళ్ళిద్దర్నీ చూసి, "ఏమ్మా! నువ్వూ ఇంకా భోంచెయ్యలేదా? హాయ్ స్రవంతీ," అంటూ పలకరించాడు.

శాంతమ్మ కొడుకువంక ఆప్యాయంగా ప్రేమగా చూసింది. ఇంత సౌమ్యుడైన కుర్రాడ్ని ఏదో దుష్టశక్తి పీడిస్తోంది. వాడి బంగారు భవిష్యత్తుని, ఆరోగ్యాన్ని నాశనం చేస్తోంది. ఎన్నాళ్ళు ఈ శిక్ష?

కిశోర్ ప్రసాదరావుతో ఇంకా గదిలోనే ఉన్నాడు.

"చిన్నాన్నా, మేఘనాధ్‌కి ఫోన్ చెయ్యనా?" అంటున్నాడు.

ప్రసాదరావు తలూపి, "కానీ కన్సల్టు చెయ్యటంలో తప్పులేదుగా! ఇప్పుడు మామూలుగానే వున్నాడు. కాని

ఎప్పుడెలా మారిపోతాడో చెప్పలేంకదా!" అన్నాడు.

కిశోర్ ఫోన్ దగ్గరకు నడిచాము.

డయిల్ చేశాడు. అవతల్నుంచి రెస్పాన్స్ వచ్చింది.

"మేఘనాథ్ గారు ఊళ్ళో లేరండి. బొంబే వెళ్ళారు. రేపు ఉదయానికొస్తారు." అన్నారు అవతల్నుంచి.

కిశోర్ వెంటనే, "రాగానే కిశోర్ ఫోన్ చేశాడని, అర్జంటుగా రమ్మన్నాడనీ చెప్పండి." అంటూ ఫోన్ క్రేడిల్ చేసి "పద చిన్నాన్నా! భోంచేదాం" అన్నాడు.

భోజనాల దగ్గర చాలా ఉదిగ్గా కూచున్నాడు అరుణ్. మామూలుగానే తిన్నాడు.

అప్పుడు మధ్యాహ్నం మూడున్నరగంటలయ్యింది.

కిశోర్ తనగదిలో కూచుని ఆలోచిస్తున్నాడు. సుధాకర్ మాట కాదనలేక సైకియాట్రిస్ట్‌కి ఫోన్ చేశాడే గాని, ఏ భూత వైద్యుడినో పిలిపించి వుండాల్సిందేమోనని పదే పదే అనిపిస్తోంది.

ఖచ్చితంగా శ్యామలరావు ఆత్మే అరుణ్‌ని పట్టుకొంది, అనుమానం లేదు! శ్యామలరావు చనిపోయి తన మీద కక్ష తీర్చుకుంటున్నాడు. తనని వచ్చి సాధిస్తున్నాడు. అమాయకుడైన అరుణ్‌ని పట్టి పీడిస్తూ తనని ఆత్మక్షోభ కలిగిస్తున్నాడు.

శ్యామలరావు!....తను అన్యాయమే చేశాడు ఆ కుటుంబానికి. కావాలని చేసిన తప్పుకాదు. కాని తప్పు తప్పే! అది నిప్పులా నిండు జీవితాల్ని బలితీసుకొంది. అందుకు శ్యామలరావు తనకి శిక్ష విధించాలి. అరుణ్ ఏం చేసాడు?

ఎలా ఈ సమస్యని పరిష్కరించాలి? శ్యామలరావు ఆత్మని ఎలా వదిలించుకోవాలి? ఈ రాత్రి మళ్ళీ అరుణ్‌ని

ఆవహిస్తాడా? అరుణ్ ని ఆవహించినప్పుడు అరుణ్ మాటలు అచ్చం శ్యామలరావు మాటల్లాగే ఉంటున్నాయి. ఆ చూపు, నవ్వు—అంతా శ్యామలరావే!

స్మశానంలో తనకి స్పష్టంగా కనిపించింది శ్యామలరావు దెయ్యం! అయితే మామూలుగా కాదు, చాలా వికృతంగా. తను భ్రమపడ్డాడా? లేక తను చేసిన పాపం తనకి అనుక్షణం గుర్తొచ్చి తనే అలా ఫీలవుతున్నాడా?

తల విదిలించాడు కిశోర్. ఏది ఏమైనా తన గురించి అరుణ్ బలైపోకూడదు! ఇది తనకి, శ్యామలరావుకి మధ్యనున్న వైరం! తనే తేల్చుకోవాలి! అరుణ్ కిందులో భాగంలేడు.

కిశోర్ ఆలోచనలమధ్య ఫ్యాక్టరీకి వెళ్ళకుండానే గడిపేశాడు. ప్రసాదరావు వెళ్ళాడు.

రాత్రి ఎనిమిదిగంటలకే భోజనాదులు ముగించి అరుణ్ గదిలో పుస్తకాలు ముందేసుకుని కూచున్నాడు కిశోర్.

అరుణ్ అతనికన్న వెనగ్గా గదిలోకి వచ్చాడు.

కిశోర్ తమ్ముడివంక చిరునవ్వుతో చూసి, "ఈ రాత్రికి కూడా నీ గదిలోనే పడుకుంటాను." అన్నాడు.

అరుణ్ భుజాలెగరేసి, "అభ్యంతర మేముంటుంది? విత్ ప్లెజర్!" అన్నాడు.

కిశోర్ ఏమయినాసరే, ఆ రాత్రంతా మేలుకునే ఉండాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు మనసులో.

అరుణ్ తొమ్మిదిన్నరవరకు క్లాసు పుస్తకాలు తిరగేశాడు. రెండురోజులుగా క్లాసులకి పోవటంలేదు. పగలైతే ఫరవాలేదు గాని, ఈవెనింగ్ కోర్సు కాబట్టి సాయంత్రం అయినించి రాత్రి పదిగంటలదాకా

ఉంటాయి క్లాసులు. తల్లిదండ్రని ఒకటే గొడవ.

తనకైతే సి.ఏ. కోర్సంటే ప్రాణం! ఎం.కాంలో చేరటానికి ముందే ఆ కోర్సు పూర్తైనంతవరకు కవర్ చేసెయ్యాలని దృఢనిశ్చయంతో ఉన్నాడు! ఈ అనారోగ్య పరిస్థితివల్ల అనుకోకుండా బ్రేక్ పడింది.

పుస్తకాలు చూస్తూ చూస్తూనే అలాగే నిద్రలోకి జారిపోయాడు అరుణ్.

కిశోర్ క్రీగంట తమ్ముడ్ని చూస్తూనే ఉన్నాడు. అతని చర్యల్లోగాని, ప్రవర్తనలోగాని ఏదైనా మార్పు గోచరిస్తుందేమోనని జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉన్నాడు.

పది గంటలు కొట్టింది గడియారం.

మేడమీద గదుల్లో లైట్లు వెలుగుతున్నాయి. అంటే తల్లి, ప్రశాంతి ఇంకా మేలుకునే ఉన్నారన్నమాట! కింది గదిలో పడుకున్న చిన్నాన్న కూడా బహుశా నిద్రపోయివుండడు! ఆయన గదిలో కూడా లైటు వెలుగుతున్నది.

వాతావరణంలో ఎలాంటి మార్పు కనిపించలేదు.

కిశోర్ అలాగే ఏదో పని కల్పించుకుని మెలకువగా ఉన్నాడు. ఆ సాయంత్రమే నిద్రరాకుండా నిరోధించే క్యాప్స్యూల్ వేసుకున్నాడు. అది సుధాకర్ యిచ్చాడు.

డాక్టరిచ్చిన మందు పనిచేస్తోందనటానికి ఆవలింతలు కూడా రావటంలేదు కిశోర్‌కి. ఫ్రెష్‌గా అప్పుడే నిద్రలేచినట్టు ఉత్సాహంగా ఉంది.

పన్నెండున్నర గంటలయింది.

సరిగ్గా అప్పుడే వాతావరణంలో చెప్పుకోదగ్గ మార్పు కనిపించింది. గాలి రివ్వున వీచింది. కిటికీ తెరలు కదిలాయి. తలుపులు కొట్టుకున్నాయి.

గాల్లో ఏదో గుర్తు తెలియని మార్పు స్పష్టంగా గోచరించింది. గదిలో ఎవరో మసలుతున్నట్టు భ్రాంతి.

కిశోర్ నిద్రపోతున్నట్టు కళ్ళు మూసుకుని పక్కకు తిరిగి పడుకుని, గదిని క్రీగంట పరిశీలిస్తున్నాడు. ముఖ్యంగా అరుణ్ మంచంవైపు దృష్టిని కేంద్రీకరించాడు.

చటుక్కున దీపాలు ఆరిపోయాయి. కావాలనే గదిలోని దీపం తీసెయ్యకుండా అట్టే పెట్టాడు కిశోర్. గదిలో జరిగేదంతా చూడాలని అతని ఉద్దేశం!

కాని ఒక్కసారిగా గదిలో గాఢాంధకారం అలముకోగానే కిశోర్ ఉలిక్కిపడ్డాడు. చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దం అలముకొని ఉంది.

సరిగ్గా అప్పుడే అరుణ్ మంచంలో లేచి కూచున్నాడు.

కిశోర్ ఊపిరి బిగబట్టి చూస్తున్నాడు.

అరుణ్ నించున్నాడు. ముందుకి నడుస్తున్నాడు. అంతక్రితం తను జాగ్రత్తగా బోల్టు పెట్టి వుంచిన తలుపులు తెరుచుకుని వుండటం చూసి విస్తుపోయాడు కిశోర్. ఇదెలా జరిగింది? తను భ్రమపడుతున్నాడా?

అరుణ్ గది బయటకు వెళ్ళిపోతుండగా మెల్లిగా లేచాడు కిశోర్. గుమ్మం దగ్గరకు వెళ్ళి బయటికి చూశాడు. అప్పటికే అరుణ్ గేటుదగ్గరికి వెళ్ళిపోయాడు.

చిత్రం! మెయిన్ గేట్ కూడా బార్లా తెరచివున్నది.

అరుణ్ గేట్లోంచి బయటకు నడిచి రోడ్డెక్కాడు. వీధిలైట్లు కూడా వెలగటంలేదు. సప్లయి ఫెయిల్యూర్ లా వుంది!

అరుణ్ తిన్నగా నడుస్తూ వెళ్ళిపోతున్నాడు. ఎంతో అలవాటైన దారిలో బాగా అలవాటయినవాడిలాగా

చురుగ్గా అడుగులు వేస్తూ వెళ్తున్నాడు.

కిశోర్ జాగ్రత్తగా అనుసరించి వెళ్తున్నాడు.

అరుణ్ మామూలుగానే స్మశానంవైపు నడుస్తున్నాడు. కంకర రోడ్డుమీదికి మరలాడు అరుణ్.

కిశోర్ తనూ అరుణ్ వెంట స్మశానంలోనికి నడిచాడు.

అరుణ్ ఏకాగ్రతతో స్మశానం మధ్యన వెళ్తున్నాడు. కిశోర్ అతన్ని అనుసరిస్తున్నాడు.

స్మశానమంతా జాగ్రత్తగా పరిశీలిస్తూనే అరుణ్ని అనుసరిస్తున్నాడు కిశోర్.

అరుణ్ నడుస్తున్నాడు. ఓ గొయ్యిదగ్గర ఆగాడు. అది సమాధి గొయ్యి! అప్పటికే ఎవరో ఆ గొయ్యి తవ్వి వుండాలి.

అరుణ్ ఎవరో చెప్పినట్టుగా ఆ గొయ్యి పక్కనే కూలబడ్డాడు. బాచిపట్టు వేసుకున్నాడు.

గోతివంక చూసి త్రుళ్ళిపడ్డాడు కిశోర్.

గోతిపక్కనే ఓ శవం వెల్లకిలా పడుకో బెట్టబడి వుండటం కూడా కనిపించింది.

ఆ గోతికి కుడివైపు బ్రహ్మజెముడు చెట్లు చాలా ఒత్తుగా పెరిగివున్నాయి. కిశోర్ మెల్లగా ఎవరి దృష్టి పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ బ్రహ్మజెముడు మొక్కల వెనక్కి చేరాడు.

ఇప్పుడు అతనికి ఆ చుట్టుపట్ల జరిగేదంతా కనిపిస్తోంది వినిపిస్తోంది.

చీకటి దట్టంగా అలముకొని వుంది!

కిశోర్ అరుణ్ వంక చూస్తూన్నాడు. అరుణ్ బుద్ధిమంతుడిలాగా కూచుని వున్నాడు. ఏ ఆలోచన లేకుండా

నిర్వికారంగా నిశ్చలంగా కూచునివున్నాడు.

సరిగ్గా అప్పుడే ఎక్కణ్నుంచో ఓ వ్యక్తి హడావిడిగా వచ్చి గొయ్యి పక్కన కూచున్నాడు,

కిశోర్ ఊపిరి బిగబట్టి చూస్తూన్నాడు. ఆటువంటి వ్యక్తి నిదివరలో యెక్కడయినా చూశానేమోనని గుర్తు చేసుకోవటానికి ప్రయత్నిస్తూన్నాడు. గతంలో ఎక్కడా చూసిన గుర్తు రావటంలేదు.

ఆ వ్యక్తి శవం పక్కనున్న శవం ఒంటికి, తన చేతిలో వున్న ముంజేతి ఎముకను తలనుంచి కాళ్ళదాకా, కాళ్ళ నుంచి తలదాకా తాకిస్తున్నాడు. ఏవేవో మంత్రాలు జపిస్తున్నాడు. తెలుగు, సంస్కృతంగాని ఏదో భాష— పైశాచిక భాష!

కిశోర్ పరీక్షగా అతనివంకే చూస్తూన్నాడు.

అతను ఒంటినిండా దట్టంగా విబూది పూసుకున్నాడు. ముఖాన విబూది అడ్డబొట్లు! మెళ్ళో పూసల దండలు. కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి. దూరంగామండుతోన్న చితి వెలుగు అతని ముఖంమీద ప్రతిఫలిస్తోంది!

కిశోర్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు—అంతక్రితం స్మశానంలో ఎక్కడా చితి వెలుగులేదు. ఒక్కసారిగా ఆ వెలుగు ఎక్కడ్నించి వస్తోంది?

అతను అరుణ్ వొంటికి ముంజేతి ఎముకను తాకిస్తున్నాడు. ముందుగా కళ్ళను తాకించాడు. ఆ తర్వాత అతని తలమీద దాంతో మూడుసార్లు మెల్లిగా కొట్టాడు. ఎముకతో అరుణ్ కూచున్న స్థలం చుట్టూ వలయాకారంగా గీశాడు.

కిశోర్ ఇక ఆలస్యం చెయ్యలేదు.

ఈ తంతు జరగనివ్వకూడదు! అతను అరుణ్‌ని ఏదో

మత్తులోకి తీసుకు వెళ్ళటానికి ప్రయత్నిస్తున్నాడు. అతని ప్రయత్నం కొనసాగనివ్వకూడదు!

అంతే! రివ్వున వాడిదగ్గర మధ్యకు ఒక్క సారిగా పరుగు పెట్టాడు కిశోర్.

అదే అతను చేసిన పొరపాటు!

ఆ వ్యక్తి ఒక్క క్షణం తొట్రుపడ్డాడు కిశోర్ని చూసి. ఆ తర్వాత యేం ఎరగనట్టు హడావిడిగా అక్కడ్నుంచి మెరుపులా మాయమై చీకటిలో వెళ్ళిపోయాడు.

కిశోర్ అతని వెంట పరుగెత్తాడు. కాని, అప్పటికే ఆలస్యమయ్యింది. అతని జాడ లేదు!

ఎముకలు, ఎండు చితుకులు అతని కాళ్ళ కింద ఫెటిల్లుమని పగులుతున్నాయి. కుండ పెంకులు చిట్లుతున్నాయి.

ఇప్పుడు స్మశానంలో ఎక్కడా మండుతున్న చితి గాని, వెలుగు గాని లేవు! కనీసం పొగకూడా లేదు.

కిశోర్ కి అంతా చిత్రంగా వుంది!

అతనెక్కడికి మాయమయ్యాడు? తను చూసింది నిజమేనా? లేక భ్రమపడ్డాడా?

తనది భ్రమ కాదని సమాధి గొయ్యి రుజువు చేస్తోంది. గోతిపక్కన పడున్న శవం యింకా అక్కడే అలాగే వుంది!

అప్పుడు పడింది కిశోర్ చూపు తమ్ముడిమీద!

వెల్లకిలా విరుచుకుపడిపోయి స్పృహ లేకుండా పడున్నాడు అరుణ్.

కిశోర్ మోకాళ్ళమీద వంగి అరుణ్ ముక్కు దగ్గర వేలు పెట్టి చూశాడు.

శ్వాస ఆడుతోంది! కాని చాలా బలహీనంగా.

వాడి చూశాడు—అది కూడా బలహీనంగానే వుంది.

ఇప్పుడేం చెయ్యాలి? అరుణ్‌ని అనుసరించి వచ్చే హడావిడిలో కారు జోలికి పోలేదు. వెంట కారుంటే యెంత బావుణ్ను!

ఇప్పుడు అరుణ్‌ని యెలా మోసుకుపోవాలి?

కిశోర్ వంగి అరుణ్‌ని లేపి భుజంమీద వేసుకో బోయాడు. కాని అరుణ్ తోటకూర కాడలా వేలాడి పోతున్నాడు. చేతుల్లో నిలబడటంలేదు.

ఏం చెయ్యాలో తెలియని అగమ్య స్థితిలో అతని కళ్ళముందు మెరుపులు మెరిశాయి. అప్రయత్నంగా కళ్ళు మూతలు పడ్డాయి కిశోర్‌కి.

11

రవీంద్ర కొద్ది క్షణాలు కర్తవ్య విమూఢుడిలా నిల్చుండిపోయాడు.

పోలారావు వికటంగా నవ్వాడు. అతని చేతిలోని పిస్తోలు యే క్షణంలోనైనా పొగలు కక్కటానికి సిద్ధంగా సేఫ్టీ కాచ్ కూడా తప్పించబడి వుంది.

“ఇప్పుడు చెప్పు బిడ్డా. నా అక్రుత్యాలని. బయట పెడతావా? నీ అన్నను నేను హత్య చేశావా? సాక్ష్యాధారాలు నీ దగ్గరున్నాయా? ...వాటిని యమధర్మరాజుకు చూపించు. భూలోకంలో ఎవరూ చూసే అవకాశం లేదుగా మరి!....” పోలారావు ట్రిగ్గర్ మీద వేలుంచాడు.

రవీంద్రలో తెగింపు వచ్చేసింది. చిన్నాన్న యెంతకయినా తెగించగల దురాత్ముడని, కిరాతకుడని పూర్తిగా అర్థమైపోయింది. అన్నను చంపినట్టే తనని కూడా

చంపేయటానికి వెనుతియ్యటం లేదు.

తండ్రిని కూడా పోలారావే చంపేశాడేమో ..!?

మొదటిసారిగా రవీంద్రకు తన తండ్రి మరణం వెనక చిన్నాన్న హస్తం ఉండివుండొచ్చునని తట్టింది.

అతని మస్తిష్కం చాలా తీవ్రంగా ఆలోచిస్తోంది. ప్రస్తుతం ఇంట్లో పోలారావు తప్ప మరెవరూ లేరు. తను, పోలారావు మాత్రమే ఆ గదిలో వున్నారు. తనని కాల్చి పారేయటానికి సంసిద్ధంగా వున్నాడు పోలారావు. రివాల్వర్ కి సైలెన్సర్ అమర్చాడని తను గ్రహించగలడు.

రవీంద్ర చాలా వేగంగా, పోలారావు ఏమాత్రం ఊహించటానికి కూడా వీలుకానంత వేగంగా పోలారావు మీదికి ఎగిరి గుండెలమీద తన్నాడు.

పోలారావు అంతదూరంలో వెల్లకిలా పడిపోయాడు. రివాల్వర్ ఎగిరి దూరంగా పడింది.

ఖంగ్ మన్న శబ్దం వినిపించింది.

పోలారావు వెంటనే లేవలేకపోయాడు. నడుములు పట్టుకుపోయాయి.

ఈ లోపల పరిస్థితిని తన అదుపులోకి తెచ్చుకున్నాడు రవీంద్ర. లేవబోతున్న పోలారావుని పొట్టలో తన్నాడీ సారి. బాధగా మూలిగి లుంగచుట్టుకుపోయాడు పోలారావు.

రవీంద్ర ఒక్క అంగలో రివాల్వర్ దగ్గర కురికి దాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

“కదలకు మిస్టర్ పోలారావ్! నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తాను” అన్నాడు రవీంద్ర కర్కశంగా.

పోలారావు నిస్సహాయంగా చేతులెత్తేశాడు.

రవీంద్ర అతన్ని నిప్పులు కురిసే కళ్ళతో తీక్షణంగా చూసి, "నిన్ను పినతండ్రిగా చెప్పుకోవటానికి నాకు సిగ్గేస్తోంది. లోకంలో నీలాంటి పినతండ్రులు ఉంటారని జీవితంలో మొదటిసారిగా తెలిసింది. నాకు చాలా ఆనందంగా వుంది! ఈ క్షణంలో నిన్ను కాల్చిపారేసినా అడ్డుకునేవాళ్ళు లేరు.... చెప్పు, అన్నయ్య నెందుకు చంపావో చెప్పు!..." అన్నాడు.

అతని చేతిలోని రివాల్వర్ సూటిగా పోలారావు గుండెలకు గురిచేయబడివుంది.

పోలారావు అటుఇటు చూశాడు. తప్పించుకునే దారి కోసం వెతుక్కుంటున్నాడని రవీంద్ర గ్రహించాడు.

"పోలారావ్, నీ ట్రిక్కులు నా దగ్గర పనిచేయవు. అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకోకు .... ఊఁ.... చెప్పు....అన్నయ్య నెందుకు చంపావు? అతను నీకేం అపకారం చేశాడని యింత ఘోరానికి పూనుకున్నావు?" హుంకరించాడు రవీంద్ర.

"నువ్వు చెప్పావుకదా, మీ నాన్న సంపాదించిన ధనం గురించి! అది నిజమే! అది లక్షరూపాయలు కాదు కదా, పదివేలు కూడా ఖరీదు చెయ్యని రోజుల్లో ఆ ధనాన్ని సంపాదించాడు మీ నాన్న. అప్పట్లో నాకు సగం ధనం ఇమ్మని అడిగితే 'నా కిద్దరు కొడుకులున్నారు, వాళ్ళకి యిల్లు కట్టుకోవద్దా?' అని నవ్వేశాడు.

"నాకు ఒళ్ళు తెలియని కోపం వచ్చేసింది. ప్రమాదాన్ని సృష్టించి నేనే మీ నాన్నను చంపేశాను. అయితే ఆ ధనం పత్రాలు దక్కించుకోవటానికి చాలా శ్రమపడ్డాను. తీరా చూస్తే ఆ పత్రాలన్నీ మీ అన్న

పేర మార్పించాడు మీ నాన్న అంతక్రితమే.

"జనార్దనం మేజరు తీరేగాని స్థలం అతని పరం కాదు. అంతదాకా కోర్టు అధీనంలోనే వుంటుంది ఆస్తి. ఈ విషయం తెలిసి హతాశుడనయిపోయాను. ఈ లోపల మీరంతా మీ అమ్మ పుట్టింటికి వెళ్ళిపోయారు.

"తిరిగొచ్చి జనార్దనం మళ్ళీ అదే ఫ్యాక్టరీలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. మేజరయ్యాడు. ఓ రోజు జనార్దనాన్ని సముద్రస్నానం నెపంతో బీచ్‌కు తీసుకువెళ్ళాను. ఆస్తి నా పేర పవర్ ఆఫ్ పట్టా రాసివ్వమని నయాన చెప్పాను. అందుకు లక్షరూపాయలు ఇస్తానని ఆశ పెట్టాను.

"జనార్దనం వినలేదు. ఆ స్థలం విషయం తనకు ముందే తెలుసునని యీ రోజు అది పదిలక్షల విలువ చేస్తుందని తను త్వరలోనే ఆ స్థలం సగం అమ్మి ఆ సొమ్ముతో మిగిలిన స్థలంలో ఫ్యాక్టరీ కట్టుకోబోతున్నానని. తను చిట్టిపాపాయిని కాదని పొగరుగా సమాధానం చెప్పాడు.

"జనార్దనం ఎటువంటి పరిస్థితుల్లోను నాకు లొంగడని అర్థం చేసుకున్నాను. అతి నిదర్శనలో ఫ్యాక్టరీ లావాదేవీల్లో తెల్లకాగితం మీద సంతకం పెట్టిన విషయం గుర్తొచ్చింది. ఫ్యాక్టరీలో చేరే సమయంలో సెక్యూరిటీ కోసం నేను సంతకాలు చేయించిన కాగితాల్లో ఒకటి నా దగ్గర వుండిపోయింది. దాన్ని పవర్ ఆఫ్ పట్టాకి ఉపయోగించుకోవాలనుకున్నాను.

"ఈ ఆలోచన రాగానే నేను ఆలస్యం చెయ్యలేదు. అదురుబాటుగా కూచున్న జనార్దనాన్ని వెనక నుంచి రివాల్వర్ మడమతో గట్టిగా కొట్టి స్పృహ తప్పించి ఆ తర్వాత సముద్రంలో ముంచేసి ఇంటికొచ్చేశాను.

"ఉన్నదున్నట్టు అంతా ఒప్పేశాను. నా నేరం క్షమ్యం. మీ కందరికీ అన్యాయం చేశాను, నిజమే! అందు కిప్పుడు పశ్చాత్తాపపడుతున్నాను.... ఒక్క విషయం అడుగుతాను, నిజం చెప్పు! నీకు నామీద యెందు కను మానం వచ్చింది? జనార్దనం హత్య చేయబడ్డాడని నీ కెవరు చెప్పారు?"

"అవన్నీ నీ కనవసరం. నీతో, ముచ్చటలాడు తూ కూర్చోవటాని కాదు నేనొచ్చింది. వెంటనే మా నాన్నగారు అన్నయ్య పేర రాసిన ఆ పత్రాలు, అన్నయ్య సంతకంతో వున్న బ్లాంక్ పేపరు నాకు అప్ప గించు."

"ఓ, అవా? సేఫ్టీ కోసం బాంక్ లాకర్లో దాచాను...."

"ఏ బాంక్? లాకర్ నంబరెంత? కీస్ ఏవి?"

"ఇస్తాను. సిండికేట్ బాంక్. లాకర్ నంబర్ థర్టీ త్రీ" పోలారావు లేచి పక్కకి అడుగేశాడు.

"ఎక్కడికి?"

"తాళాలు అడిగావు కదా! టేబిల్ సొరుగులో వున్నాయి తీసిస్తాను."

రవీంద్ర యేదో చెప్పబోయాడు. ఇంతలోనే పోలారావు మెరుపువేగంతో టేబిల్ మీదున్న ఫ్లవర్ వేజ్ అందుకొని రవీంద్ర చేతిమీదకు విసిరాడు.

అంతే! రవీంద్ర చేతిలోని రివాల్వర్ యెగిరి అంత దూరంలో పడింది. అతను దానికోసం అటు అడుగువేసే లోపల యెగిరి గంతేసి రివాల్వర్ అందుకున్నాడు పోలారావు.

"ఏరా పిచ్చిరా, నామీదే తిరుగుబాటు చేస్తావా?

పైగా నా నుంచి రహస్యాలు సేకరిస్తావా?" అంటూ రివాల్వర్ గురిచూసి కాల్చాడు.

ప్రమాదాన్ని గుర్తించిన రవీంద్ర చటుక్కున నేల మీద బోర్లాపడుకుండిపోయాడు.

సరిగ్గా అప్పుడే తలుపులు తెరుచుకుని గదిలోకి అడుగు పెట్టిన వ్యక్తి గుండెల్లో దూసుకు పోయింది బుల్లెట్.

"అబ్బా!" అంటూ ఆ వ్యక్తి కిందవాలిపోవటం, "బాబూ, సురేంద్రా!" అంటూ పోలారావు గావుకేక పెట్టి ఆ వ్యక్తి దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళటం ఒకేసారి జరిగాయి.

ఆ వ్యక్తి—పోలారావు ఒక్కగానొక్క కొడుకు సురేంద్ర!—మెడిసన్ మూడో సంవత్సరం చదువుతున్నాడు.

రవీంద్ర వూహించని రీతిలో జరిగిపోయిన సంఘటనకు కొంతసేపు నిర్ఘాంతపోయి అంతలోనే తేరుకొని ఒక్క అంగలో పోలారావుమీద కురికి అజాగ్రత్తగా వున్న పోలారావు చేతి నుంచి రివాల్వర్ లాక్కుని అతని కణతకు గురిపెట్టాడు.

పోలారావు పిచ్చిగా నవ్వాడు. మళ్ళీమళ్ళీ నవ్వాడు. తర్వాత కుమిలి కుమిలి ఏడ్చాడు.

"చంపెయ్యి రవీంద్రా! చెట్టంత కొడుకుని చేతులార చంపుకున్నాక నేను బతికి ప్రయోజనం లేదు, నీ తండ్రిని అన్నను చంపిన కిరాతకుడ్ని—నీ ఇష్టమొచ్చిన శిక్షను విధించుకో!" అన్నాడు నిర్లిప్తంగా.

"నేను నీలా రాక్షసుడ్ని కాదు. నాకు రక్తదాహం లేదు. న్యాయంగా మాకు రావలసిన ఆస్తి మాకిచ్చేస్తే

చాలు! ఆ పత్రాలు అప్పగించు. నేను వెళ్ళిపోతాను" అన్నాడు రవీంద్ర. అతని చేతిలోని రివాల్వర్ పోలా రావుకే గురిచేసి ఉంది. పోలారావు మాటల్ని నమ్మటం మూర్ఖత్వమనిపించుకుంటుందని అతనికి బాగా తెలుసు.

పోలారావు యాంత్రికంగా లేచి ఐరన్ సేఫ్ దగ్గరకు నడిచాడు రవీంద్ర అతని వెన్నుకి రివాల్వరు ఆనించి అతని వెనకే నడిచాడు.

ఐరన్ సేఫ్ తెరిచి సీక్రెట్ లాకర్లోంచి దస్తావేజులు, మరికొన్ని పత్రాలు తీసి రవీంద్ర చేతి కిచ్చాడు పోలా రావు

రవీంద్ర వాటి నందుకోటానికి చేయి చాచాడు. అంతే! పోలారావు ఆ చేతిని పట్టుకుని మెలితిప్పేశాడు. కర కర మని చప్పుడు చేస్తూ రవీంద్ర చేయి విరిగి పోయింది. అదే సమయంలో కాలితో రవీంద్ర చేతిమీద పూని తన్నాడు పోలారావు. రివాల్వరు ఎగిరి అల్లంత దూరంలో పడింది.

మరుక్షణం పోలారావు చేతిలో రివాల్వరు ప్రత్యక్ష మయ్యింది.

రవీంద్ర విరిగిపోయిన చేయి పెడుతున్న నరకయాత నను లెక్క చేయకుండా ఒంటిచేత్తో పోలారావుమీద తిరగబడ్డాడు. ఎగిరి తన్నాడు.

ఇద్దరూ నేలమీద పడ్డారు.

రివాల్వరు ఢామ్మని పేలింది.

12

తలుపుమీద టకటక మని చప్పుడు!

"సుందరీ.... సుందూ " పిలుస్తూన్నాడు గోపీ ఆ గొంతును వెంటనే గుర్తుపట్టాడు శేఖర్. అతను గోపీ!

శేఖర్ మనసులో అప్పటికప్పుడే స్థిరనిశ్చయం రూపు దిద్దుకుంది. గోపీని ట్రాప్ చెయ్యటానికి సరైన అదను దొరికింది. తన చెల్లెలు జీవితాన్ని నాశనం చేసిన దుష్టుడ్ని ఉరికంబమెక్కించటానికి చక్కటి అవకాశం!

శేఖర్ మోకాళ్ళమీద వంగి సుందరిని ముట్టుకొని చూశాడు. చల్లగా తగిలింది శరీరం, శేఖర్ కంగారుగా ఆమె ముక్కుదగ్గ వేలు పెట్టి నిర్ఘాంతపోయాడు.

ఆమె శ్వాస ఆడటంలేదు! గాయాలతో కాదు— షాక్‌తో చనిపోయిందామె.

తను ఆమెను చంపాలనుకోలేదు. వికృతంగా కురూపిగా తయారు చెయ్యాలనుకున్నాడు. కాని జరిగిందేమిటి?

తనిప్పుడు హంతకుడు! ఒక హత్యకైనా యెన్ని హత్యలకైనా శిక్ష ఒకటే! ఉరికంబం! తనకిక సంకోచం గాని, భయంగాని లేవు.

అంతదాకా గోపీని చంపాలనుకున్న ఆలోచనని మరో విధంగా మార్చుకున్నాడు.

తలుపు అదే పనిగా కొడుతున్నాడు గోపీ. కిటికీలో నించి చూసి గోపీ అని ఇందాకే నిర్ధారణ చేసుకున్నాడు శేఖర్.

తలుపు ఓరగా తెరిచాడు.

"ఏమిటింత ఆలస్యం? ఏం చేస్తూన్నావు లోపల?" అనుకుంటూ లోపలకి అడుగుపెట్టిన గోపీని వెనకనుంచి వాటేసుకొని అతని ముక్కుమీద గుడ్డతో అదిమాడు శేఖర్—తను ఊపిరి బిగబట్టి.

తియ్యటి వాసన. అటు యిటు గింజుకున్నాడు గోపీ. కాని క్లోరోఫాం పని చెయ్యటంతో తల పక్కకి వాల్చేసి నేలమీదకు జారిపోయాడు.

షేక్ టేబిల్ మీదున్న ఆపిల్ ముక్క తీసి. దాన్ని కోసిన కత్తిని చూసినప్పుడే ఆ కత్తిమీద గోపీ వేలి ముద్రలుండే అవకాశముందని గ్రహించాడు. కర్చీఫ్‌తో కత్తిని తీసుకొన్నాడు. దాన్ని నేలమీద పెట్టి, గోపీ కుడి చేతిలో గట్టిగా బిగించి వేలిముద్రలు పడేవరకు నొక్కిపట్టి తర్వాత కర్చీఫ్‌తో దాన్ని పట్టుకున్నాడు.

ఇంతక్రితం దానిమీద వేలిముద్రలు పడివుండకపోతే ఇప్పుడు స్పష్టంగా పడివుంటాయి! ముందు జాగ్రత్తకోసం అలా చేయక తప్పదనుకున్నాడు.

కత్తిని సుందరి కడుపులో దించేశాడు కళ్ళు మూసుకుని. ఆ క్షణం అతడనుభవించిన చిత్తక్షోభని వర్ణించటానికి మాటలు చాలవు వచ్చిన పాముని చంపడమంటే ఇదే కాబోలు ననుకున్నాడు వేదనగా.

కాని, కత్తి! గోపీమీద కక్ష తీర్చుకోవాలి. ఇంతకన్న మంచి అవకాశం వస్తుందో రాదో తెలియదు. వచ్చినపుడే దాన్ని వినియోగించుకోవాలి!

చటుక్కున బయటికొచ్చాడు. క్లోరోఫాం మత్తులో ఓ యిరవై నిమిషాలవరకు పడివుంటాడు గోపీ! ఈలోపల జరగవలసింది చాలా వున్నది.

బయటినుంచి గది తలుపు గొళ్ళెం పెట్టేశాడు. ఇంతలోనే మరో ఆలోచన వచ్చింది. తలుపులు తెరచుకుని గది లోపల్నుంచి వెనక తలుపు తెరచుకుని - దాన్ని బయటనుంచి గడియ పెట్టేశాడు.

గోపీకి ఈలోపల మెలకువ వచ్చినా లేచి పారిపోవటానికి వీల్లేకుండా జాగ్రత్త చేసుకున్నాడు. దొడ్డితలుపు తెంచుకొని చుట్టు తిరిగి వాళ్ళ వీధిలోకి వచ్చాడు. ఇప్పుడు వీధి తలుపు గడియ పెట్టేశాడు. అయిదు నిమిషా

అయిపోయిందప్పుడే.

క్లోరోఫాం చాలా తక్కువ మోతాదులో ప్రయోగించాడు.

దగ్గరలో వున్న పబ్లిక్ బూత్ లోకి దూరాడు. అప్పటికి పదినిమిషాలు గడిచింది. పోలీసులు రావటానికి మరో పది పదిహేను నిమిషాలు పడుతుంది. ఈలోపల గోపీ స్పృహలోకి వచ్చినా తలుపులు రెండువైపుల్నుంచి బంధించి వుంటాయి కాబట్టి అతను తప్పించుకుని పారిపోలేడు.

రిసీవర్ ఎత్తి డయల్ చేసి ఏభై పైసల నాణెం వేశాడు.

"హల్లో క్రైం బ్రాంచ్!" అని వినిపించింది అవతల్నుంచి.

శేఖర్ సుందరి ఇంటి అడ్రసు చెప్పి, "గోపీ అనే ఇంజనీరు తన ప్రియురాల్ని హత్యచేశాడు. మీరు వెంటనే బయల్దేరి యీ యింటికి వెళ్తే హంతకుడు రెడ్ హేండెడ్ గా దొరుకుతాడు" అన్నాడు.

"హల్లో, మీరెవరు?" అడిగాడు ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్.

"నేనెవరో తెలియాల్సిన అవసరం మీకు లేదు. ఫర్ యువర్ ఇన్ఫర్మేషన్, మరో రహస్యం కూడా చెపుతాను. ఇదే గోపీ రెండురోజుల క్రితం తన తల్లి సాయంతో భార్యను కిరోసిన్ పోసి తగలెట్టి, గప్ చిప్ గా స్మశానంలో పాతిపెట్టేశాడు. కావాలంటే వెళ్ళి వెరిఫై చేసుకోవచ్చు."

"థాంక్యూ ఫర్ యువర్ సివిక్ సెన్స్! ఏ స్మశానం? యే సమాధి? ప్లీజ్ గివ్ డిటెయిల్స్!"

శేఖర్ వివరాలు చెప్పాడు.

"ఇప్పుడే సుందరి ఇంటికి వెళ్తున్నాం! కుదిరితే, మీ వారితో చెపితే...." శ్రీనివాస్ అర్ధోక్తిలో ఆగాడు.

వెంటనే డిస్కనెక్ట్ చేశాడు శేఖర్.

13

కళ్ళు తెరిచేసరికి తన గదిలో బెడ్ మీదున్నాడు కిశోర్. తన ముఖం మీదికి వంగి చూస్తూన్న తల్లిని, చెల్లెల్ని ఆత్రుతగా గదిలో పచార్లు చేస్తూన్న చిన్నాన్నను చూసి వెంటనే లేచి కూచున్నాడు.

"అమ్మా, తమ్ముడేడి?" అన్నాడు గదిలో దేని కోసమో వెతుక్కుంటున్నట్టు చూసి.

"అరుణ్ తన గదిలో హాయిగా నిద్రపోతున్నాడు" చెప్పాడు ప్రసాదరావు.

"నన్ను, తమ్ముణ్ని స్మశానం దగ్గర్నుంచి యెవరు తీసుకొచ్చారు?" అడిగాడు కిశోర్.

"తమ్ముడు ఇంట్లోనే వున్నాడు కదా! నువ్వే స్మశానం దగ్గర పడున్నావు. చిన్నాన్న తీసుకొచ్చాడు. పదినిమిషా లయింది. నీవు మెలకువరావటంకోసమే యెదురుచూస్తూ న్నాం" శాంతమ్మ చెప్పింది.

కిశోర్ నిర్ఘాంతపోయి, "అదేమిటి, అరుణ్ ని నేను ఫాలో అయి స్మశానానికి వెళ్ళాను. కారు లేకుండా వెళ్ళిపోయాను. వాడు స్పృహతప్పి పడిపోతే నేను ఎత్తుకొని స్మశానం బయటకు తీసుకురాబోయాను. ఇంతలో నా కళ్ళముందు యేవో మెరుపులు మెరిసి మైకం వచ్చి పడిపోయాను. ఆ తర్వాతేమయిందో నాకు తెలియదు" అన్నాడు.

శాంతమ్మ, స్రవంతి, ప్రసాదరావు తెల్లబోయి చూశారతని వంక.

"తమ్ముడేడి? నేను వెంటనే చూడాలి!" అన్నాడు కిశోర్ లేచి కూచుని.

ప్రసాదరావు కిశోర్ చెయ్యి పట్టుకున్నాడు ఆసరాకి.

"ఫరవాలేదు చిన్నాన్నా నేను నడవగలను!" అన్నాడు కిశోర్ అరుణ్ గదివైపు అడుగులేస్తూ.

అరుణ్ గది తలుపులు దగ్గరగా వేసి వున్నాయి.

ప్రసాదరావు తెరిచాడు.

మంచంమీద అరుణ్ ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. గదిలో టేబుల్‌లాంప్ వెలుగుతోంది.

కిశోర్ అరుణ్ దగ్గరగా వెళ్ళి అతని ముఖంలోకి చూశాడు. అంతక్రితం తమ్ముడితో బాటు తను ఆ గదిలోనే పడుకున్నాడు. మంచం, పక్క అలాగే వున్నాయింకా.

"నేనీ గదిలో తమ్ముడికి సాయం పడుకున్నానుకదా!" అన్నాడు కిశోర్.

"అవును బాబూ! ఎప్పుడు తలుపు తెరుచుకొని వెళ్ళిపోయావో తెలియదు. ప్రవంతి నేను నా గదిలో నిద్రపోయాం. అరుణ్ పక్కన నువ్వున్నావుకదా అని మేం నిశ్చింతగా నిద్రపోయాం. చిన్నాన్న వచ్చి చెప్పేవరకు మాకు జరిగిందేమిటో తెలియదు" చెప్పింది శాంతమ్మ.

ప్రశ్నార్థకంగా చిన్నాన్నవైపు చూశాడు కిశోర్.

"అవును కిశూ, అరుణ్‌కి నువ్వు తోడు పడుకున్నావు కదా అని నేనూ ఆదమరచి నిద్రపోయాను. అర్థరాత్రి ఎందుకో మెలకువ వచ్చి చూస్తే అరుణ్ గది తలుపులు బార్లా తెరచి వున్నాయి. నా నిద్రమత్తు వదలిపోయింది. పక్కమీద అరుణ్‌కోసం ముందుగా చూశాను. హాయిగా

నిద్రపోతున్నాడు.

"చిత్రంగా. నువ్వు లేవు బాత్ రూంలో, ఆరు బయటకో వెళ్ళుంటావనుకున్నాను. ఓ పదినిమిషాలు చూశాను. నువ్వు రాలేదు. బాత్ రూంలోను, ఆవరణలోను లేవు. కార్లు రెండూ వున్నాయి. మరో పది నిమిషాలు చూసినా నువ్వు రాకపోవటంతో కారేసుకుని బయల్దేరాను దార్లో యెక్కడా కనిపించలేదు. ఇంతలో కారు హెడ్ లైట్స్‌లో ఎవరో రోడ్డుమీద పడివుండటం చూసి ఆపాను.

"కారు దిగి చూద్దునుకదా, నువ్వే! ఎవరు రోడ్డు మీద పడేశారో అర్థం కాలేదు. శ్వాస బాగానే వుందని సంతృప్తిపడ్డాక నిన్ను కార్లో పడుకోబెట్టి ఇంటికి తీసుకొచ్చాను. అప్పటికీ నీకు స్పృహరాలేదు. నీ గదిలో పడుకోబెట్టి అమ్మను, స్రవంతిని లేపాను" చెప్పాడు ప్రసాదరావు.

కిశోర్ నిశ్చేష్టుడై విన్నాడు.

ఏమిటిది? తను స్మశానంవరకు తమ్ముడ్ని అనుసరించి వెళ్ళటం, అక్కడ తను చూసిన క్షుద్రదేవతోపాసకుడు, అరుణ్ మూర్ఛపోవటం, తను అతన్ని భుజాన్నెత్తుకుని రాబోతూ స్పృహతప్పి పడిపోవటం—ఇదంతా తన భ్రమా?....లేక కలా?....కల కాదని తెలుస్తూనేవుంది. తను నడిరోడ్డుమీద పడున్నాడని చిన్నాన్న చెప్తున్నాడు. చిన్నాన్న అబద్ధం చెప్పడు!

"పన్నెండున్నరకి కరెంటు పోయింది. మీరెవరైనా గమనించారా? — మళ్ళీ ఎప్పుడొచ్చిందీ?" అడిగాడు కిశోర్.

శాంతమ్మ స్రవంతి తమకి తెలియదన్నారు.

ప్రసాదరావు మాత్రం తను లేచేసరికి లైట్లు వెలుగుతూనే వున్నాయని చెప్పాడు.

కిశోర్ కి అంతా అగమ్యగోచరంగా వుంది. తల విదిలించాడు. అసలు ఏం జరిగింది? అరుణ్ ని లేపి అడిగితే..!? ప్రయోజనముండదు. అరుణ్ నిద్రలోనే నడిచి వెళ్ళాడు. బాహ్య స్పృహ తెలియని స్థితిలో ఏం జరిగిందో ఎలా జరిగిందో ఎలా చెప్పగలడు?

"రెస్టు తీసుకో కిశోర్, నీ మనసెందుకో బాగుండ లేదు. ఇంతవరకు అరుణ్ నిద్రలో నడుస్తూన్నాడని చింతిస్తూంటే, సడ్డన్ గా కూడా ఆదేవిధంగా ప్రవర్తించటం విచిత్రంగా వుంది. ఉదయం మాట్లాడుకుందాం!" అన్నాడు ప్రసాదరావు.

"నేను గదిలోనే పడుకుంటాను" అన్నాడు కిశోర్ అరుణ్ పక్కనున్న బెడ్ మీద కూచుంటూ.

అప్పుడు రాత్రి మూడున్నర గంటలయింది.

14

"అన్నయ్యా, అన్నయ్యా!" అంటూ అరుణ్ తట్టి లేపుతుండగా మెలకువ వచ్చి త్రుళ్ళిపడి లేచాడు కిశోర్.

అరుణ్ అప్పటికే స్నానం చేసి ఫ్రెష్ గా వున్నాడు.

తమ్ముడి వంక అయోమయంగా చూసి, "ఏమిటి?" అన్నాడు కిశోర్.

"ఫ్యాక్టరీకి వెళ్ళావేమోనని లేపాను" అన్నాడు అరుణ్ తప్పు చేసినవాడిలా తలతిప్పుకొని.

వాల్ క్లాక్ అప్పుడే తొమ్మిది కొట్టింది.

"అరెరె, తొమ్మిదయిందా అప్పుడే!? చాలా సేపు నిద్రపోయినట్టున్నాను...." అనుకొంటూ బెడ్ మీదనుంచి లేచాడు.

స్నానాదికాలు ముగించుకుని ఫ్యాక్టరీకి వెళ్ళేసరికి అక్కడంతా హడావిడిగా వుంది.

కిశోర్ ఆశ్చర్యంగా మేనేజర్ని పిలిచి "ఏమిటి, అందరు యేదో ఆందోళన చేస్తున్నట్టున్నారు!?" అనడిగాడు.

మేనేజర్ విష్ చేసి చెప్పాడు.

"నిన్న సాయంత్రం రెండు విచిత్రమైన సంఘటనలు జరిగాయి సార్! మన ఫోర్మన్ పోలారావు తన కొడుకును చంపేసి, కణతకు పిస్తోలు పేల్చుకొని చచ్చిపోయాడు సార్! పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాలవల్ల విరక్తి చెంది యిలా చేసివుంటాడని అందరు చెప్పుకుంటున్నారు."

కిశోర్ నిర్ఘాంతపోయి విన్నాడు.

మేనేజరు మళ్ళీ చెప్పాడు.

"మన ఇంజనీర్ గోపీని కూడా నిన్న రాత్రి పోలీసులు అరెస్టు చేశారట సర్! అతని భార్య ఈమధ్యనే కాలి చనిపోయింది కదా! అది ప్రమాదవశాత్తూ జరిగినది కాదని గోపీ అతని తల్లి హత్య చేసి సమాధి చేశారని తేలిందట. పోస్టుమార్టం జరిగాక అది నిజమేనని నిర్ధారణయిందట.

అదీగాక గోపీ అతని ప్రియురాలు సుందరిని హత్య చేస్తూ రెడ్‌హేండెడ్‌గా పోలీసులకి దొరికిపోయాడట. అతని తల్లిని కూడా హత్యానేరం కింద పోలీసులు అరెస్టు చేశారట సర్!"

కిశోర్ కి ఒకదాని వెంట మరొకటి నమ్మశక్యం కాని విషయాలు ఎదురవటంతో స్తబ్ధుగా చాలాసేపు అలాగే కూచుండిపోయాడు.

నిన్న అన్నీ విడ్డూరాలే జరిగాయి, తన విషయంలో

కూడా నమ్మశక్యంకాని సంఘటనే జరిగింది. తను నిజంగానే భ్రమపడ్డాడా? భ్రమే అయితే స్మశానం వరకు వెళ్ళటం, అరుణ్ ని స్మశానంలో చూడటం ఎలా సంభవించాయి? తను నడిరోడ్డుమీద ఎలా పడున్నాడు?

మేనేజరు యజమాని అనిమిత్తంగా ఉండటం గమనించి మెల్లిగా బయటకు వెళ్ళిపోయాడు.

సరిగ్గా అప్పుడే పోలీస్ ఇన్ స్పెక్టర్ లోనికొచ్చాడు. "ఐయామ్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్!" అన్నాడు తనని పరిచయం చేసుకుంటూ.

"వెరీ గ్లాడ్ టు సీయూ సర్!" అన్నాడు కిశోర్ ఇన్ స్పెక్టరుతో కరచాలనం చేస్తూ.

"మీతో పర్సనల్ గా మాట్లాడాలని వచ్చాను" అన్నాడు శ్రీనివాస్.

"చెప్పండి!" అన్నాడు కిశోర్ ముందుకి వాలి.

"మీ ఫ్యాక్టరీలో పనిచేసే యిరువురు ఉద్యోగుల విషయం ఎంక్వయిరీ చేయటానికొచ్చాను. ముఖ్యంగా ఇంజనీర్ గోపీ సంగతి. అతను స్త్రీలోలుడని, అతనికో ఉంపుడుకత్తె వుందని ఆమె పేరు సుందరి అని, తెలిసింది. ఈ విషయంలో మీకేమైనా ముఖ్య విషయాలు, మా కుపకరించేవి ఉంటే చెప్పండి!...." అన్నాడు శ్రీనివాస్.

"మీకు తెలిసిన విషయాలు కూడా నాకు ఈనాటి వరకు తెలియవు. అతని వ్యక్తిగత జీవితం గురించి నాకేమీ తెలీదు. సారీ!"

"ఆల్ రైట్! మరి, ఫోర్మన్ పోలారావు సంగతి!? అతను నిన్న కొడుకును చంపి, తను సూసైడ్ చేసుకున్నాడు."

"సారీ సర్! ఒన్స్ ఎగెయిన్ సారీ! అతని విషయాలు కూడా నాకు తెలియవు...."

"ఓకే డెన్!.... ఇప్పుడు మీ పర్సనల్ విషయాని కొస్తాను. మీకు శ్యామలరావు తెలుసా?"

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు కిశోర్. అతని ముఖకవళికల్ని పరిశీలనగా చూస్తూన్నాడు శ్రీనివాస్.

"శ్యామలరావా? ఏ శ్యామలరావు?"

"ఎంతమంది శ్యామలరావులు తెలుసు మీకు?"

"మీక్కావలసిన శ్యామలరావు యెవరు?"

"మీ ఆఫీసులో స్టెనోగా పనిచేసి రెండు నెల్ల క్రితం ప్రమాదానికి గురై చనిపోయిన సుధ, ఆమె తమ్ముడు శ్యామలరావు గురించిన వివరాలు కావాలి. అక్క, తమ్ముడు కూడా కొన్ని నిమిషాల వ్యవధిలో చనిపోవటం, సుధ మీ స్టెనో కావటం, అనుమానాస్పద పరిస్థితుల్లో రెండు మరణాలు సంభవించటం—ఇవన్నీ మా డిపార్టుమెంటు మీ వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవలసిన అవసరం కల్పించాయి. గోపీతో జరిగిన ఇంటరాగేషన్లో చాలా ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి" చెప్పాడు శ్రీనివాస్.

కిశోర్ కొన్ని క్షణాలు మాట్లాడలేదు. తర్వాత శ్రీనివాస్ వంక నిస్సహాయంగా చూశాడు.

"వాళ్ళిద్దరి మరణాలకీ నేను కారకుడనని మీరు భావిస్తున్నారా?"

"ఆ విషయం యిప్పుడే చెప్పటం సాధ్యం కాదు. దర్యాప్తు జరగాల్సి వుంది."

"రెండు నెలల క్రితం సంభవించిన మరణాల మీద

దర్యాప్తు ఎప్పుడు టేకప్ చేశారా?"

"రెండేళ్ళ క్రితం కేసులను కూడా అనుమానం మీద తిరగతోడి దోషుల్ని అరెస్టు చేసి శిక్షించిన కేసులు కూడా చాలా టేకప్ చేశాను. పదిహేనేళ్ళ క్రితం హత్యచేసి తప్పించుకుని ఘరానాగా పెద్దమనిషిలా చెలామణి అవుతున్న కోటీశ్వరుడికి ఉరిశిక్ష వేయించి నెల కూడా కాలేదు. ఇంకా చెప్పమంటారా ఉదాహరణలు?!...."

"అక్కర్లేదు. కేవలం క్యూరియాసిటీ కొద్దీ అడిగాను. మీక్కావలసిన వివరాలు అడగొచ్చు."

"థాంక్యూ! సుధ యెందుకు చనిపోయింది. యెలా చనిపోయింది? శ్యామలరావు మరణానికి దారితీసిన సంఘటనలు - అన్నీ మీ నోట వినాలని వచ్చాను. యేదీ దాచకుండా చెప్తారని విశ్వసిస్తున్నాను" అన్నాడు శ్రీనివాస్.

కిశోర్ ఇంటర్ కమ్‌లో స్టెనోకి ఫోన్ చేసి "నేను మళ్ళీ ఫోన్ చేసేవరకు యెవర్నీ నా గదికి రానివ్వద్దు. అంతగా అవసరమైతే మేనేజర్ని చూడమనండి" అని చెప్పాడు తర్వాత శ్రీనివాస్ వంక చూసి చెప్పటం మొదలెట్టాడు కిశోర్ —

15

సుధ మధ్యతరగతి కుటుంబంలో జన్మించినా హై క్లాస్ ఫేమిలీ స్త్రీలా చాలా హుందాగా, అందంగా, డీసెంట్ గా వుంటుంది. మొదటిసారిగా ఉద్యోగంకోసం తన దగ్గరకు వచ్చినపుడు ఆమె అందాన్ని కొద్ది క్షణాల వరకు రెప్పవాల్చకుండా చూశాడు కిశోర్.

ఆమెకు ఇరవైయేళ్ళకు పైగానే వుండొచ్చు కాని

పద్దెనిమిదేళ్ళ యువతిలా వుంది. ఆ రోజు చిన్న పువ్వులున్న రోజ్ కలర్ చీర కట్టుకొని మేచింగ్ బ్లౌసు వేసుకుంది. చెవులకు రోజ్ కలర్ క్రిస్టల్స్ తాపిన రింగ్స్ పెట్టుకుంది. నుదుట రోజ్ కలర్ బిందీ పెట్టుకుంది. ఎడమ చేతికి రోజ్ కలర్ ప్లాస్టిక్ గాజులు, కుడిచేతికి రిస్టువాచ్ పెట్టుకుంది. స్ట్రాప్ రోజ్ కలర్. రోజ్ కలర్ ఆమె శరీరం రంగుతో అద్భుతంగా మాచ్ అయింది.

ఇలాంటి సౌందర్యరాశికి, పెద్దింటి పిల్లకి ఉద్యోగంతో పనేమిటా అని ఆశ్చర్యపోయాడు కిశోర్. ఆ మాటే సుధతో అన్నాడు.

సుధ మనోహరంగా నవ్వింది. "ఈ వేషం లోకం కోసం సర్! నాన్న పోయాక కుటుంబభారం మోయాల్సింది యింటికి పెద్దదానిగా పుట్టిన నేనే కదా! తమ్ముడింకా చదువుకొంటున్నాడు. మీకు నా క్వాలిఫికేషన్స్ నచ్చితే ఉద్యోగమివ్వండి" అన్నది.

కిశోర్ ఆమె సర్టిఫికెట్స్ చూశాడు. స్టెనోగ్రాఫర్ కు కావలసిన అర్హత లున్నాయి. ఆమె వినయం, నమ్రత, నడవడి అతనికి బాగా నచ్చాయి. అందగత్తెనే అహంకారం గాని, ఆడంబరం గాని ఆమెలో మచ్చుకైనా లేవు. ఆమె తమ ఫ్యాక్టరీకే గొప్ప సెంటరాఫ్ ఎట్రాక్షన్ అవుతుందనటంలో అతిశయోక్తి లేదు.

కిశోర్ నిమిషాలమీద అపాయింట్ మెంట్ ఆర్డర్ టైపు చేయించి సంతకం పెట్టి ఆమె కందించాడు.

సుధ మనసు ఆ క్షణంలో అతనిపట్ల కృతజ్ఞతతో నిండిపోయింది. రెండు చేతులూ జోడించి హృదయపూర్వకంగా నమస్కారం పెట్టింది.

అది మొదలు ఆమె ఆ ఫ్యాక్టరీలో ఓ భాగమై

పోయింది. ఆమె ఆఫీసులో వుంటే సుందర నందనో ద్యానవనం గుబాళించినట్లుండేది. ఆమె తమతో కొద్ది క్షణాలు మాట్లాడితే చాలు, తమ జన్మ ధన్యమై పోయినట్లే భావించేవారు— ఆఫీసులోను, ఫ్యాక్టరీలోను కూడా.

అయితే, సుధ చాలా రిజర్వ్‌డ్. అవసరమైనదాని కన్న ఒక్క మాటకూడా ఎవరితోను మాట్లాడేది కాదు. కిశోర్ డిక్టేట్ చేసేటపుడు కూడా చాలా కామ్‌గా వుండేది. కిశోర్ మాత్రం ఆమెను చూస్తూ కామ్‌గా వుండటం కష్టమని తెల్సుకున్నాడు.

కిశోర్ త్వరలోనే తన మనసు ఆమెపట్ల ఆకర్షింప బడుతున్న విషయం గ్రహించాడు. అందుకతను సిగ్గుపడ లేదు, పైగా సంతోషించాడు. ఇన్నాళ్ళు తను పెళ్ళి చేసుకోకుండా వుండిపోయింది యిలాంటి జంటకోసమే ననిపించింది కూడా.

అతను సుధతో పెళ్ళి ప్రసక్తి తెచ్చినపుడు ఆమె ఆశ్చర్యపోలేదు. ఆమె కొన్నిరోజులుగా అతని చర్యల్ని చాలా శ్రద్ధగా గమనిస్తోంది. అతను తనతో మాట్లాడే టపుడు అతని కళ్ళలో మెరిసే కాంతి ఆమెకు అతను తనంటే యిష్టపడుతున్న నిజాన్ని చెప్పకనే చెప్పేది.

సిబ్బందిని, ఫ్యాక్టరీ వర్కర్సుని కొనచూపుతో శాసించగల కార్యదక్షుడు తన విషయంలో తత్తర పడటం, మాటలకు తడుముకోవటం చూసినపుడు ఆమెకు నవ్వొచ్చేది. ఎంతవారైనా కాంతాదాసులే కదా అను కునేది. అతను తనని కోరుకున్నాడనే అనుకొందిగాని, తనని దేవతగా ఆరాధిస్తున్నాడని తనని పవిత్రంగా ప్రేమి స్తున్నాడని, తనని పెళ్ళి అనే పవిత్ర బంధంతో ముడి వేసుకోవాలనుకుంటున్నాడని— అతను నోరు విప్పి చెప్పే

వరకు గ్రహించలేదు.

గ్రహించిన మరుక్షణం ఆమె ఆనందాతిరేకంతో కొద్ది సేపు మూగదై పోయింది. ఆ తర్వాత తన అదృష్టానికి తనే మురిసిపోయింది. ఆ పైన, తన లాంటి సామాన్యురాలికి అంత గొప్పవాడితో వివాహం సంభవమా అని భయపడింది. అతని పెద్దలు అడ్డుపడతారని సందేహించింది. కిశోర్ ఆమె అనుమానాలన్నీ పటాపంచాలు చేసేశాడు. తన చేతినున్న వజ్రపుటుంగరం ఆమె చేతికి తొడిగాడు. ఆ తర్వాత ఆ చేతిని ముద్దు పెట్టుకున్నాడు సున్నితంగా.

"ఇదే మన పెళ్ళికి గుర్తు! మనకి మానసికంగా పెళ్ళయిపోయినట్లే! త్వరలో పెద్దల సమక్షంలో పెళ్ళి చేసుకుందాం" అన్నాడు.

ఆమె తనువంతా పులకరించిపోయింది. అతని పాదాల మీద వాలి భక్తి పురస్సరంగా కళ్ళకద్దుకుంది. అతనామెను సందిట చేర్చుకుని సమాదరించాడు.

ఆ తర్వాత అనుకోకుండా యిద్దరు హద్దు మీరిపోయారు. అతడు తనని మోసం చెయ్యడని ఆమెకు తెలుసు—ఆమె మనసుకు తెలుసు. ఆమెను అన్యాయం చెయ్యాలనే దురాలోచన అతనికే కోశనా లేదు.

అయితే పరిస్థితులే అనుకూలంగా లేవు.

జపాన్ సాంకేతిక సహాయంతో ఎలక్ట్రానిక్ పరికరాల్ని తయారు చేయాలనే ఒప్పందం మీద ఆ దేశంలో ఆర్నెల్లు పర్యటించటానికి బయల్దేరి వెళ్ళాడు.

అయితే అతనొచ్చేసరికి చాలా విచిత్రాలు జరిగాయి. ఆమె చేతికున్న ఉంగరం వాళ్ళింట్లో ఓ తుఫాను సృష్టించింది. ఆమె తమ్ముడు శ్యామలరావు అప్పుడు ఫైనల్ బి. ఎస్సీలో వున్నాడు. సుధని యింట్లో నొక్కించి అడి

గాడు ఆ ఉంగరం గురించి. ఇప్పట్లో రేమీ అడగొద్దన్నదామె.

అయితే శ్యామలరావు ఆంతటితో సంతృప్తిపడి ఊరుకోలేదు. అక్కడ ప్రవర్తన గురించి ఫ్యాక్టరీలో ఎంక్వయిరీ చేశాడు. ఆమెకు కిశోర్‌తో వున్న సాన్నిహిత్యం గురించి తెలిసిపోయింది. తల్లితో చెప్పాడు. ఆమె నెత్తి నోరు బాదుకుంది. ఉద్యోగం అక్కర్లేదు—మానెయ్యమంది. తను ఉద్యోగం మానేస్తే ముగ్గురు పస్తు పడుకోవాల్సిందేనని సుధకు తెలుసు!

తల్లికి నచ్చచెప్పింది. ఏ సేం తప్పుపని చెయ్యటంలేదని, వాళ్ళు భయపడేట్టు యేం జరగదని హామీ ఇచ్చింది. అయితే మరో రెండు నెల్ల తర్వాత ఆమెకో నిప్పులాంటి నిజం తెలిసింది.

తను గర్భవతి! ఆమెకు ఆ నిజం తెలిసిన వెంటనే ముందు ఆనందమే కలిగింది. ఎందుకంటే ఆమె కిశోర్ని త్రికరణశుద్ధిగా ప్రేమించింది. అతను కూడా ఆమెను గాఢంగా ప్రేమించాడు. తనకి కల్లో కూడా అన్యాయం చెయ్యడు

అయితే అతను స్వదేశంలో లేనప్పుడే ఈ ప్రమాదం ముంచుకొచ్చింది. వెంటనే ఉత్తరం రాసిందతనికి. భయపడొద్దని, తనీ శుభవార్త విని చాలా ఆనందించానని మరో రెండు నెలల్లో తిరిగొస్తున్నానని, అంతగా అవమాన మనిపిస్తే కొన్నాళ్ళు ఉద్యోగానికి సెలవు పెట్టేసి యింట్లోనే వుండమని ఉత్తరం రాశాడు.

అయితే ఆ ఉత్తరం ఆమెకు ఆనందం కలిగించలేదు. నలుగుర్లోను అవమానకరమైన పరిస్థితి ఎదురయ్యింది. ముఖ్యంగా తల్లి తమ్ముడు తనని నీతిలేనిదాన్ని చూసినట్టు,

ఓ అంటరానిదాన్ని చూసినట్లు చూస్తున్నారు. మరో పక్క రోజు రోజుకీ ఎత్తుగా తయారవుతున్న పొట్ట— కన్యగానే తల్లివి కాబోతున్నావు సుమా!—అని హెచ్చరిస్తోంది.

ఎలాగో అన్నిటినీ భరించి కిశోర్ ఆగమనం కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూసింది సుధ.

అతనొస్తున్న రోజున ఆమెకు పండుగే అయింది. ఎప్పుడెప్పుడు తనని గట్టున పడేస్తాడా అని యెదురు తెన్నులు చూసింది.

కిశోర్ జపాన్ నుంచి తిరిగొచ్చాడు.

సుధ అతను ఆఫీసుకు రాగానే అతన్ని కల్సుకొంది. వెంటనే పెళ్ళి జరగాలన్నది.

కిశోర్ ఆఫీసు వ్యవహారాలన్నీ తను లేని సమయంలో అ స్తవ్యస్తం కావటంవల్లను, ఓ పక్క బోనస్, తదితర కోర్కెలు చెల్లించకపోతే సమ్మె చేస్తామని వర్కర్సు బెదిరించటం వల్లను బాగా చికాకుల్లో ఉన్నాడు.

సుధ రాగానే పెళ్ళి విషయం నొక్కించటంతో సహనం కోల్పోయాడు. ఆమెను తూలనాడాడు. సరిగ్గా అప్పుడే శ్యామలరావు అదంతా విని కిశోర్ మీద తిరగబడ్డాడు, అపార్థం చేసుకుని.

దాంతో కిశోర్ కు కోపంవచ్చి పిచ్చివాడై పోయాడు. బయటకు పొమ్మని అరిచాడు. సుధ మనసు తీవ్రంగా గాయపడింది. తమ్ముణ్ణి తీసుకుని వెంటనే అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

ఆ రాత్రే నూతిలో దూకి ఆత్మహత్య చేసుకొన్నది. ఆ విషయం తెలిసిన శ్యామలరావు కోపంతో పెట్రేగిపోయి కిశోర్ మీద ప్రతీకారం తీర్చుకోవటానికి బయ

ద్దరి వెళ్ళాడు.

ఆ సమయానికి కిశోర్ ఇంకా ఫ్యాక్టరీ ఆఫీసులోనే వున్నాడు. ఆవేశంతో కేకలు పెడుతూ అతనిమీదికి వొచ్చాడు శ్యామలరావు.

కిశోర్ మీదికి వొస్తున్న శ్యామలరావును అల్లంత దూరంలోనే నైట్ వాచ్‌మన్, ఓ వర్కరూ ఆపేశారు.

ఆ సమయానికి ఫ్యాక్టరీలో తయారవుతున్న సల్ఫ్యూరిక్ ఆసిడ్‌ని పరిశీలిస్తున్నాడు కిశోర్. అతని చేతిలో ఏసిడ్ ట్యూబ్స్ వున్నాయి.

శ్యామలరావు తనని నిరోధించిన యిద్దర్నీ గింజుకుని ఒక్కసారిగా కిశోర్ మీద కురికాడు. ఆ అదురుకు ఏసిడ్ ట్యూబ్స్ పగిలాయి. అంతే! శ్యామలరావు హృదయ విదారకంగా అరిచి రెండు చేతుల్తోను ముఖం మూసు కున్నాడు.

కిశోర్‌తో బాటు అక్కడున్న వారందరు, ఊహించని రీతిలో జరిగిపోయిన ప్రమాదానికి నిశ్చేష్టులై పోయారు.

శ్యామలరావు ఎడమకన్ను పూర్తిగా కాలిపోయి ఆ స్థానంలో నల్లటి గుంట మిగిలింది. కుడికన్ను గుడ్డు కాల్లి వొచ్చేసి తెల్లగా సొనలాంటి పదార్థం స్రవిస్తోంది. పళ్ళు వికృతంగా బయటికొచ్చేశాయి. ముఖమంతా మచ్చలు పడి పోయింది. బొబ్బలు లేచాయి.

హాస్పిటల్‌కు తరలించాలనుకునే లోపల శ్యామల రావు నరకయాతనపడుతూ ప్రాణాలొదిలేశాడు.

ఇది జరిగి దాదాపు రెండు నెలలయింది. దాదాపు అందరు ఆ సంఘటన మరచిపోయారు.

ఇప్పుడు ఇన్‌స్పెక్టరు వచ్చి దాన్ని మళ్ళీ కెలికాడు.

16

"అయితే ఏసిడ్ మీరు కావాలని శ్యామలరావు ముఖం మీద పొయ్యలేదని ప్రమాదవశాత్తు అది నేనే వచ్చి మీమీద పడటంవల్ల చిందిందని మీరంటారు.... అవునా?!" అడిగాడు శ్రీనివాస్.

"అవును ఇన్‌స్పెక్టర్! నా తప్పేంలేదు. నేను ప్రయత్నపూర్వకంగా చేసిందేమీ లేదు. నేను నిర్దోషిని."

"సుధ చావుకు కూడా మీరు కారకులు కాదంటారా!?"

"నిజంగా నేను కారకుడ్ని కాదు సార్! ఆఫ్‌కోర్స్ ఆమె నావల్లనే గర్భవతయింది. నన్ను ఘోరంగా అపార్థం చేసుకుని, తొందరపడి ప్రాణాలు తీసుకొంది. ఈ రెండు నెల్లుగా నేనెంత కుమిలిపోతున్నానో ఆ భగవంతుడికే ఎరుక!"

"కానీ మీ ఇంజనీరు గోపీ చెప్పిన కథనం ప్రకారం, మీరు సుధని అవమానించి, ఆమె కడుపులోని బిడ్డకు మీరు తండ్రిని కానని తిరస్కరించి ఆమెను తీవ్రపద జాలంతో దూషించి ఆమె ఆత్మహత్యకు కారకులయ్యారని తెలుస్తోంది. ఏమైనా, ఇందులోని నిజానిజాలు నేను దర్యాప్తు చేస్తాను. ఈ లోపల మీరేమైనా చెప్పదల్చుకుంటే నాకు ఫోన్ చేసి చెప్పండి."

శ్రీనివాస్ లేచి కిశోర్‌తో కరచాలనం చేసి, బూట్సు టకటక లాడించుకొంటూ వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన వెంటనే ఫ్రిజ్ లోంచి చల్లటి మంచి నీళ్ళు తీసుకుని గడగడ తాగాడు కిశోర్. కొద్ది నిమిషాల వరకూ అతను మామూలు మనిషిగా కాలేక

పోయాడు.

మరచిపోతున్న మధురమైన బాధని మళ్ళీ ఇన్‌స్పెక్టరు కెలికాడు. ఆ జ్ఞాపకాలు తనని చుట్టుముట్టి సుధని తనే చంపేసినట్టు తనని దోషిగా వేలెత్తి చూపుతున్నాయి కళ్ళారా చూసిన శ్యామలరావు మరణం తన గుండెని కలచివేసింది.

అదే రూపంలో మొన్న స్మశానంలో కనిపించిన శ్యామలరావు నిజంగా ప్రేతమేనా? అచ్చం చనిపోయే ముందు శ్యామలరావు ఎలా వున్నాడో అదే రూపం!

గాడ్, తన మనసేదో భ్రాంతికి లోనవుతోంది. 'తన ఎవరో ఊపిరాడకుండా పీక నొక్కేస్తూన్నట్టు,' తను కళ్ళు మూసినా తెరిచినా భయంకరమైన స్మశాన సన్నివేశాలు తనని భయభ్రాంతుడ్ని చేస్తున్నాయి.

ఓ పక్క అరుణ్‌ని ఏవో క్షుద్రశక్తులు పీడిస్తున్నాయని తను బాధపడుతుంటే తను కూడా వాటి ప్రభావానికి తలొగ్గవలసిన పరిస్థితి ఎదురయ్యింది. దానికి తోడు ఈ అభియోగం ఒకటి! ఇన్‌స్పెక్టరు మాటలే యింకా చెవుల్లో గింగురుమంటున్నాయి.

కిశోర్ అసహనంగా తల విదిలించాడు.

అప్పుడు గుర్తొచ్చిందతనికి — డాక్టరు సుధాకర్ సైకియాట్రిస్టు మేఘనాథ్‌కు అరుణ్‌ని చూపించమన్నాడు. తను గతరాత్రి ఫోన్ చేస్తే అతను నీరోజు వస్తాడని బాంబే వెళ్ళాడని జవాబు చెప్పారు. ఫోన్ చేస్తే....!?

ఫోన్ లాక్కుని మేఘనాథ్ నంబరు డయల్ చేశాడు. అది డైరెక్టు డయలింగ్ సౌకర్యమున్న ఫోను.

అవతల్నుంచి మేఘనాథ్ లైన్లో కొచ్చాడు.

క్లుప్తంగా అరుణ్ మానసిక పరిస్థితిని వివరించి "మీరో సారి సాయంత్రం మా ఇంటికి రాగలరా?" అడిగాడు కిశోర్.

రఘునాథ్ రెండు క్షణాలు ఏదో ఆలోచించి, "అలాగే వస్తాను. కేస్ ఈజ్ క్వైట్ ఇంట్రెస్టింగ్!" అన్నాడు.

"థాంక్యూ సో మచ్!" అంటూ ఫోన్ క్రెడిల్ చేశాడు కిశోర్.

అతనికి తలంతా దిమ్ముగా, బాగా వేసటగా అనిపించింది. వెంటనే చిక్కటి కమ్మటి స్ట్రాంగ్ కాఫీ పడకపోతే తల పగిలిపోయేలా వుంది.

కాలింగ్ బజ్జరు నొక్కి ఆర్డర్లీని పిలిచాడు.

17

పోలీస్ జీపును చూసి బయటికి తొంగి చూశాడు శేఖర్.

ఇన్స్పెక్టరు లోనికొస్తున్నాడు.

శేఖర్ గుండె ఝల్లుమన్నది. పోలీసు లెందుకు వస్తున్నట్టు? తన విషయం తెలిసిపోయిందా? తెలిసే అవకాశం లేదే....! ఏమో, పోలీసులు వేటకుక్కల్లాంటి వాళ్ళు. వాసన చూసి పసిగట్టేస్తారు నేరస్తుడ్ని.

లోకనాథం కూడా సమయానికి ఇంట్లోనే వున్నాడు. గోపికి జరిగిన శాస్తికి అతనికి ఆనందం కలిగింది. కాని యెంత చెడ్డా అల్లుడు! కూతురుతో కొన్నాళ్ళు కాపురం చేసినవాడు. అందుకే అది తలచుకున్నప్పుడల్లా చివుక్కుమనేది మనసు.

ఇన్స్పెక్టరు శ్రీనివాస్ లోనికొచ్చాడు.

శేఖర్ ముందుగదిలోనే వున్నాడు.

"హూ ఈజ్ మిస్టర్ శేఖర్?!" అనడిగాడు శ్రీనివాస్ గంభీరంగా.

శేఖర్ తలపంకించి, "నేనే! ఏం కావాలి మీకు?" అన్నాడు తడబాటు బయటకు ప్రదర్శించకుండా.

"గోపీ మీ బావగారే కదూ!"

"అవును."

"మీ చెల్లెలి భర్తా, అక్క భర్తా?"

"చెల్లెలి భర్త. నా చెల్లెలు పేరు సుజాత." చెప్పాడు శేఖర్. కొత్తవాళ్ళ మాటలు విని లోపల గదుల్లో వున్న లోకనాథం బయటికొచ్చాడు.

ఇన్స్పెక్టర్ని చూసి "ఏం కావాలి సార్?" అనడిగాడు లోకనాథం. "నేను సుజాత తండ్రిని" అని చెప్పాడు.

"గోపీ యెలాంటివాడు? అతను మీ అమ్మాయిని హత్య చేశాడని మీకు ముందుగానే తెలుసా?" అడిగాడు శ్రీనివాస్.

"తెలియదండి. తెలిసుంటే పోలీస్ కంప్లెయింట్ ఇచ్చివుండేవాళ్ళం కదా! తర్వాత, అంటే అమ్మాయిని అర్జంటుగా పూడ్చేశాక చూచాయగా అనుమానం వచ్చింది. కాని చుట్టుపక్కలవాళ్ళు కూడా అది ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా ధృవపరిచారు. దాంతో అనుమానించలేకపోయాం."

"గోపీకి మరో స్త్రీతో సంబంధముందని మీకు తెలుసా?"

"తెలియదు."

"మీకు తెలుసా శేఖర్?!"

శేఖర్ తల అడ్డంగా తిప్పి, "తెలియదండి. అతను

హత్యా నేరంమీద అరెస్టయిన విషయం తెలిశాక ఇవన్నీ పేపర్లో చదివాం" అన్నాడు.

"కాని గోపీ తన ఉంపుడుకత్తె సుందరిని హత్య చేయలేదు."

"మరి....?!"

"హంతకుడు వేరే వున్నాడు. అతనే హత్య చేసి, గోపీని ట్రాప్ చేసి, ఏం తెలియనట్టు మాకు ఫోన్ చేసి చెప్పాడు."

శేఖర్ తొట్రుపాటును కప్పిపుచ్చుకోవటానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. శ్రీనివాస్ తదేక దీక్షతో అతనివంక గుచ్చి చూస్తున్నాడు.

లోకనాథం అడిగాడు. "మరి గోపీని హత్యానేరం మీద అరెస్టు చేసినట్లు విన్నాం!?"

"మీ అమ్మాయి సుజాతని హత్య చేశాడని నిర్ధారణగా రుజువయ్యింది. పోస్టుమార్టం రిపోర్టులవల్ల అది సాధ్యమయ్యింది. కాని సుందరిని అతను హత్య చేయలేదు. అతని వేలిముద్రలున్న కత్తిని హంతకుడే కావాలని ఆమె పొట్టలో దిగవేశాడు. కాని, అంతకు చాలా సేపటి క్రితమే ఆమె ప్రాణాలు పోయాయని, అందుకే ఆమె పొట్ట నుంచి రక్తం స్రవించలేదని అతను గ్రహించి వుండడు."

"మరి గోపీని విడుదల చేసేశారా?" శేఖర్ గొంతులో దాచుకోవాలన్నా ఆత్రుత ఆగలేదు.

"లేదు. మీ అమ్మాయిని హత్య చేశానని ఒప్పుకున్నాడు. పైగా ఆధారాలు దొరికాయి. అతని తల్లి కూడా నేరం ఒప్పుకుంది."

"అయితే మీ రిప్పుడెందుకు వచ్చినట్టు?" లోక

నాథం ఆశ్చర్యంగా అడిగాడు.

"సుందరి కాంతకుడ్ని సగౌరవంగా తీసుకువెళ్ళాము!" అన్నాడు శ్రీనివాస్ కూల్‌గా.

"సుందరి కాంతకు డెక్కడుంటాడు?" లోకనాథం మరింత ఆశ్చర్యపోతూ.

సరిగ్గా అప్పుడే సార్జంట్ శివం, రాజు, అక్కడికొచ్చారు. శివం చేతుల్లో బేడీలున్నాయి.

లోకనాథం నిర్ఘాంతపోయి చూస్తున్నాడు.

శ్రీనివాస్ శేఖర్ వంక తీక్షణంగా చూసి, "మిస్టర్ శేఖర్! సుందరిని హత్య చేసిన నేరానికి నిన్ను అరెస్టు చేస్తున్నాం!" అన్నాడు.

మరుక్షణం శివం శేఖర్ చేతులకు బేడీలు తగిలించాడు. శేఖరం నిశ్చలంగా నిల్చున్నాడు.

లోకనాథం ఇన్‌స్పెక్టరు చేతులు పట్టుకొని, "ఏమిటి ఇన్‌స్పెక్టరుగారూ! నా బిడ్డ హంతకుడా? మీరు పొరబడుతున్నారు" అన్నాడు.

శ్రీనివాస్ జేబులోంచి ఓ పర్సు తీసి లోకనాథంకి చూపించి, "ఈ పర్సు గుర్తుపట్టగలరా?" అన్నాడు.

లోకనాథంకి అది బాగా గుర్తు అయినా నోరు మెదపలేదు. పర్సువంకే చూస్తూ నిల్చున్నాడు.

ఇన్‌స్పెక్టరు పర్సు విప్పి లోపలవైపు అరలో వున్న శేఖరం ఫోటో చూపించి, "ఈ పర్సు శవం పక్కన దొరికింది. అంతేకాదు, మేము సుందరి ఇంటికి వెళ్ళేటప్పటికి గోపీ క్లోరోఫాం మత్తులో పడివున్నాడు. మేము తలుపులు విరగ్గొట్టి లోనికి ప్రవేశించాం. హత్య చేసి, క్లోరోఫాం వాసన చూసి స్పృహతప్పి శవంపక్కన పడుండే మూర్ఖుడెవడూ వుండడు ప్రపంచంలో.

"అందుకే మొదటే గోపీ హంతకుడు కాదని తెలిసిపోయింది మాకు. ఆ వెంటనే ఈ పర్సు మా కళ్ళ పడింది. కేసు విడిపోయింది. అయినా గోపీని కస్టడీలోకి తీసుకున్నాం. ఎందుకంటే అతనిమీద వచ్చిన మరో అభియోగం ప్రూవ్ చేసుకోవటానికి సుజాత శవం తవ్వి పోస్టుమార్టం చేశాక గోపీ హంతకుడని కన్ఫర్మ్ చేసుకున్నాం.

"అంతే కాదు; హత్య చేశాక మాకు ఫోన్ చేసిన శేఖర్ గొంతు బాగా గుర్తు పెట్టుకున్నాను. మరో పాయింట్ — శేఖర్ సుజాత అన్న కావటం! అందుకే కత్తితో హంతురాల్ని ముఖం మీద కత్తితో కోసి హింసించి చంపారు. అయితే ఆ మాత్రానికే ఆమె చనిపోలేదు. ముక్కు చెవులు కోసేశాడు కాబట్టి తను వికృతంగా మారిపోయానని షాక్‌తో చనిపోయిందామె.

"ఈ లోపల గోపీ లోనికొచ్చాడు. అప్పుడు వచ్చివుంటుంది శేఖర్‌కి — అతన్ని హత్యలో ఇరికించాలనే ఆలోచన! వెంటనే కార్యరూపంలో పెట్టాడు" అన్నాడు.

శేఖర్ తల దించుకున్నాడు.

18

మెట్లు దిగి బయటకు వెళ్ళబోతూ చటుక్కున ఆగిపోయాడు రవీంద్ర. అతని ఎడమచేతికి సిమెంట్ కట్టుంది. మెడలో జోలెలా వేసుకున్నాడు.

ఎదురుగా పోలీస్ జీప్ ఆగింది.

ఇన్‌స్పెక్టరు, పోలీసులు లోనికొస్తున్నారు.

రవీంద్ర గుండె వేగంగా కొట్టుకొంది. ఏమిటిది? పోలీసులకి నిజం తెలిసిపోయిందా? అయినా తనెవర్నీ

హత్య చెయ్యలేదు తనెందుకు భయపడాలి? ...

ఇన్‌స్పెక్టరుతో వచ్చిన ఓ మధ్య వయస్కుడు రవీంద్రని చూపి "అవునండి అతనే!" అన్నాడు.

ఇన్‌స్పెక్టరు రవీంద్రని తీక్షణంగా చూసి, "నిన్న నువ్వు పోలారావింటికి వెళ్ళావు. నువ్వు లోపలికి వెళ్ళటం చాలామంది చూశారు. మరో అరగంట తర్వాత పోలారావు కొడుకు సురేంద్ర లోనికి వెళ్ళటం కూడా చూశారు. మరో పదినిమిషాల తర్వాత నువ్వు బయటికి పారిపోవటం కూడా చూశారు. మీ యిల్లు సోదా చెయ్యాలి. హత్యాస్థలంలో నువ్వుండటం నిజం! పోలారావుని ఆత్మహత్య అని తేలేవరకు నువ్వు హంతకుడిగా అనుమానితుడివే!" అన్నాడు.

"ఇన్‌స్పెక్టర్, నేను హత్య చెయ్యలేదు. అక్కడ నేను ఆ సమయంలో ఉన్నమాట నిజమే! కాని ఆ రెండు మరణాలతోను నా కెలాంటి సంబంధం లేదు. నేను నిరపరాధిని!" అన్నాడు రవీంద్ర. అతని గొంతులో ధ్వనించిన నిజాయితీని సిన్సియార్టీని గుర్తించాడు శ్రీనివాస్.

జరిగిందంతా వివరంగా చెప్పాడు రవీంద్ర. శ్రీనివాస్ శ్రద్ధగా విన్నాడు. అతని విరిగిన చేతిని, బాండేజిని చూశాడు. తల పంకించాడు.

"అసలు మీ అన్న జనార్దనాన్ని పోలారావు హత్య చేశాడని నీకెలా తెలిసింది? ఆధార మేమిటి?" అడిగాడు శ్రీనివాస్.

రవీంద్ర వెంటనే మాట్లాడలేదు. ఆ తర్వాత నోరు విప్పి "మీ రెక్కడా అతని పేరు బయట పెట్టనంటే చెప్తాను" అన్నాడు.

"కేసులో యెవరి ప్రాముఖ్యత యెలాంటిదో తెలిసేనే కదా, పేరు బయట పెట్టేది, లేనిది తెలిసేది!" అన్నాడు శ్రీనివాస్.

రవీంద్ర కొద్ది క్షణాల తర్వాత, "మసేనయ్య చెప్పాడు" అన్నాడు.

"మసేనయ్యా?! అతను ఎవరు....?" అడిగాడు శ్రీనివాస్.

"ప్రేతాత్మలతో మాట్లాడే క్షుద్రదేవతా ఉపాసకుడు."

"ఉపాసకుడా? అతనికెలా తెలుస్తుంది?"

"చనిపోయిన వ్యక్తికి శవం పూడ్చిపెట్టి వుంటేనే అతని విద్య ఫలిస్తుంది. శవాన్ని కాలిస్తే చెప్పలేడు. ....పాతిపెట్టిన శవం సమాధి దగ్గర అతను తన విద్యను ప్రయోగిస్తాడు. మనిషి చనిపోయిన ఓ సంవత్సరం వరకు ఆ మనిషి ప్రేతాత్మ ఆ సమాధి చుట్టుపక్కలే సంచరిస్తుందనీ, సంవత్సరం దాటిపోతే మళ్ళీ జన్మ నెత్తుతుందనీ మసేనయ్య విశ్వాసం.

"ఎవరో మసేనయ్య గురించి చెపితే, అన్నయ్య మరణం గురించి తెలుసుకోవాలనని మసేనయ్యను కలుసుకున్నాను. అతను నన్ను వివరాలన్నీ అడిగి మర్నాడు అర్ధరాత్రి దాటాక స్మశానానికి రమ్మన్నాడు. నేను అతను చెప్పినట్టే ఆ సమయానికి వెళ్ళాను.

"మసేనయ్య ముందు ఓ వ్యక్తి కూచుని వున్నాడు. చనువుగా నే కర్రాడీలా వున్నాడు. అన్నయ్య సమాధి తవ్వబడి వుంది. అప్పటికే అర్నెల్లయిపోయింది. అస్థిపంజరం తప్ప ఆకారం మిగలేదు. ఆ అస్థిపంజరంతోనే తన విద్యను ప్రయోగిస్తున్నాడు మసేనయ్య.

"ఆ ఫ్రాడిని ఆవహించింది ఆ ప్రేతాత్మ. తనని మా చిన్నాన్న సముద్రంలో ముంచి చంపేసినట్టు స్పష్టంగా చెప్పాడు. నేను స్పష్టంగా నా చెవులతో స్వయంగా విన్నాను. గొంతు కూడా అన్నయ్యదే! ఆ తర్వాత ఆ ఫ్రాడు నిద్రలో నడుస్తున్నవాడిలా వెళ్ళిపోయాడు.

"తర్వాత మసేనయ్య గొయ్యి పూడ్చేశాడు, అస్థి పంజరం పెట్టి. నేను అతని కివ్వాల్సిన సొమ్మిచ్చి ఇంటి కొచ్చేశాను" చెప్పాడు రవీంద్ర.

శ్రీనివాస్ ఆశ్చర్యంగా విన్నాడు. ఈ ఆధునిక కాలంలో కూడా ప్రేతాత్మలు ఆవహించటం, ఇదంతా నమ్మశక్యమైనదేనా? సరిగ్గా అప్పుడే అతనికి మరో విషయం గుర్తొచ్చింది. శేఖర్‌కి తన చెల్లెలు చంపబడిందని యెలా తెలిసింది? అతను కూడా మసేనయ్యను అందుకు నియోగించాడా. చూడాలి. ఈ మసేనయ్య విషయం యేదో వింతగానే వున్నట్టుంది!

"ఎవరా మసేనయ్య? ఎక్కడుంటాడు?" అడిగాడు రవీంద్రని శ్రీనివాస్. రవీంద్ర వివరాలు చెప్పాడు.

శ్రీనివాస్ అతనివంక తీక్షణంగా చూసి, "ఏది, ఏమైనా పోలారావుతో నువ్వు పెనుగులాడుతుండగానే గుండు అతని తలలోకి పేల్చబడింది అది నువ్వే చేశావో అతనే ప్రమాదవశాత్తు కాల్చుకున్నాడో వివరాలు తెలియాల్సి వుంది. అంతదాకా మా కస్టడీలో వుండక తప్పదు!" అన్నాడు.

సార్జంట్ రాజా బేడీలు పట్టుకుని నుంచున్నాడు. శ్రీనివాస్ వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"అతని మరో చెయ్యి గాయపడింది. బేడీలు వెయ్య

నక్కర్లేదు. అతన్ని అరెస్టు చేసినట్టే! తీసుకుపద"
అన్నాడు శ్రీనివాస్.

రవీంద్ర మౌనంగా పోలీసుల వెంట నడిచి జీప్ ఎక్కాడు. తను నిర్దోషి! తనకు శిక్ష పడినా పడక పోయినా, తమ కుటుంబాన్ని నాశనం చేసిన పోలా రావు తన పాపానికి శిక్ష ననుభవించాడు. తనని నిర్దోషిగా విడుదల చెయ్యటానికి కవసరమైన సమాచారం కేసెట్ రూపంలో తన దగ్గరుంది. పోలారావుతో వాదోప వాదాలు చేసినపుడు తనజేబులో దాచుకున్న మినీ టేప్ రికార్డర్లో అతను స్వయంగా చెప్పిన రహస్యాలన్నీ రికార్డయిపోయాయి. తన తండ్రిని చంపినట్టు కూడా పోలా రావు ఒప్పుకున్నాడు.

ఆ కాసెట్ భద్రంగా ఇంట్లో దాచాడు. తనమీద కేసు కోర్టుకి రాక తప్పదు అప్పుడు తన తరఫు లాయరుకి అది అందిస్తే సరిపోతుంది. తనిప్పుడు లక్షాధికారి! ఎంత ఖర్చయినా ఫరవాలేదు. నిర్దోషిగా నిరూపింపబడతాడు! తృప్తిగా లోలోన నవ్వుకున్నాడు రవీంద్ర.

19

"రండి, రండి!" సాదరంగా ఆహ్వానించాడు కిశోర్ హైకోర్టులో లాయరు మేఘనాథ్ ని.

మేఘనాథ్ లోని కడుగు పెట్టాడు. దాదాపు అరవదుల విగ్రహంలో ఎప్పుడూ చెదరని చిరునవ్వుతో, నలగని మల్లెపువ్వులాంటి తెల్లటి దుస్తుల్లో చక్కటి వర్ఛస్సుతో చూపరులను ఇట్టే ఆకర్షిస్తాడు మేఘనాద్.

"ఇతనే మా తమ్ముడు అరుణ్!" అంటూ పరిచయం చేశాడు కిశోర్.

మేఘనాథ్ అరుణ్ని పరీక్షగా చూశాడు.

పైకి యేలాంటి అవలక్షణాలు వున్నట్టు కనిపించటం లేదు. చాలా మామూలుగా, నార్మల్ గా వున్నాడు.

"మీరేం చేస్తున్నారు?" అడిగాడు మేఘనాథ్.

చెప్పాడు అరుణ్.

"రాత్రిళ్ళు బాగా నిద్రపోతున్నారా?"

"ఒక్కోరకంగా" అన్నాడు అరుణ్ నవ్వి.

"ఓసారి మీ గదికి వెళ్దామా?" అన్నాడు మేఘనాథ్.

"విత్ ప్లెజర్!" అని లేచాడు అరుణ్.

ప్రసాదరావు ఇంకా ఫ్యాక్టరీ నుంచి రాలేదు. మేఘనాథ్ కోసమని ముందుగా బయల్దేరి వచ్చేశాడు కిశోర్.

అందరు అరుణ్ గదిలోకి వెళ్ళారు.

మేఘనాథ్ తన ఎక్స్‌రే కళ్ళతో గదంతా చాలా తీక్ష్ణంగా పరిశీలిస్తున్నాడు.

కిశోర్‌తో చెప్పాడు మేఘనాథ్. "మీతో విడిగా కాసేపు మాట్లాడాలి!" అని.

"రండి. నా గదికి వెళ్దాం!" అన్నాడు కిశోర్.

"మళ్ళీ మీ దగ్గర కొస్తాను. మాట్లాడుదాం" అన్నాడు మేఘనాథ్ అరుణ్‌తో.

అరుణ్ నవ్వుతూ తలూపాడు.

కిశోర్ గదిలో యిద్దరు కూర్చున్నాక కేసు పూర్వాపరాలన్నీ వివరంగా కనుక్కున్నాడు మేఘనాథ్.

అతని ముఖం గంభీరముద్ర దాల్చింది. "పదండి, అరుణ్‌తో మాట్లాడుదాం" అన్నాడు మేఘనాథ్.

ఇద్దరు అరుణ్ గదిలోకి వెళ్ళారు. మేఘనాథ్ అరుణ్‌ని చూసి నవ్వి, "మిమ్మల్ని కొద్ది క్షణాలు హిప్నటైజ్ చేస్తాను. మీ కిష్టమేనా?" అనడిగాడు.

అరుణ్ నవ్వుతూ ఆగి "నేను హిప్నటిజం నేర్చుకోవాలని చాన్నాళ్ళుగా అనుకొంటున్నాను. అన్నయ్య వద్దని వారించాడు. ఆ కోరిక నేటిదాకా తీరలేదు" అన్నాడు.

మేఘనాథ్ కిశోర్ వంక ఆశ్చర్యంగా చూసి, "హిప్నటిజం పట్ల మీకు సదభిప్రాయం లేదా? ఎందుకు వద్దన్నారు?" అనడిగాడు.

కిశోర్ వెంటనే "దురభిప్రాయం మాత్రం లేదండీ! ఛార్టర్డు ఎకౌంటెంట్ కావలసినవాడు చదువు గురించి ఏకాగ్రత చెడగొట్టుకుని డైవర్ట్ అయిపోతాడని భయం. అంతే!" అన్నాడు.

మేఘనాథ్ నవ్వి, అరుణ్‌ని ట్రాన్స్‌లోకి తీసుకు వెళ్ళాడు. అతి స్వల్ప వ్యవధిలోనే అతడు డీప్ హిప్నసిస్‌లోకి వెళ్ళిపోవటం గమనించి ఆశ్చర్యపోయాడు. "హీ ఈజ్ టూ సెన్సిటివ్!" అనుకున్నాడు మనసులో.

తర్వాత అతన్ని కొన్ని ప్రశ్నలు వేశాడు మేఘనాథ్. డీప్ హిప్నసిస్‌లో వుండగా అతను తన పేరు కూడా సరిగా చెప్పలేకపోయాడు. కాసేపు జనార్దనం అని, కాసేపు సుజాత అని మరోసారి మరొకటి చెప్పాడు.

"నువ్వు ప్రతిరోజు అర్ధరాత్రి స్మశానానికి యెందుకు వెళుతున్నావు?" అనడిగాడు మేఘనాథ్.

"రాత్రి పన్నెండున్నరయ్యేసరికి నా చెవుల్లో యేదో హోరు వినిపిస్తుంది. ఎవరో నా చెవిలో మెల్లిగా లే.... లేచి తిన్నగా నడువు... స్మశానానికి సరాసరి వెళ్ళు.... వెళ్ళు వెళ్ళు....అంటూ చెపుతారు. నేను వెంటనే నిద్రలోనే నడుస్తూ స్మశానానికి వెళ్తాను. ఆ తర్వాత నా మీద యెవరో బరువు మోపినట్టు భ్రాంతి కలుగుతుంది.

తర్వాత యేం జరుగుతుందో, నేనేమి సమాధానం చెప్తానో నాకు తెలియదు.

"ఆ తర్వాత యెవరో వెళ్ళిపో.... ఇంటికి వెళ్ళిపో.... అంటున్నట్టు వినిపిస్తుంది.... లేచి వచ్చేస్తుంటే స్పృహ తప్పిపోతుంది. నేను మెలకువ వచ్చి చూసేసరికి నా గదిలో వుంటాను. అంతకుమించి యేం జరుగుతున్నదీ నాకు తెలియదు" చెప్పాడు అరుణ్.

"నిన్ను ప్రశ్నలడిగే వ్యక్తి ఎవరు?"

"తెలియదు!"

"ఏమడుగుతాడు?"

"గుర్తులేదు. వెంటనే మరచిపోతాను."

"ఇప్పటికి యెన్నిసార్లు స్మశానానికి వెళ్ళావు?"

"మూడుసార్లు"

"స్మశానంలో నీకు భయం వెయ్యదా?"

"ఊహు! ఇంకా యెంతో ధైర్యంగా వుంటుంది. ఎవరో అనుక్షణం నన్ను కనిపెట్టుకుని రక్షిస్తున్నట్టు నిశ్చింతగా వుంటుంది."

మేఘనాథ్ ప్రశ్నిస్తూనే ఆలోచిస్తున్నాడు.

ఇతని మెదడుని తమ కంట్రోల్లో ఉంచుకొని ఆజ్ఞలు జారీచేస్తూ అతన్ని తన దగ్గరకు రప్పించుకుంటున్నారెవరో. అక్కడ అతన్ని హిప్నటైజ్ చేసి అతనిచేత ప్రశ్నలకు సమాధానాలు రప్పిస్తున్నారు.

ఆ ప్రశ్నలు ఎలాంటివి? వాటివల్ల ఎవరికి లాభం? మేఘనాథ్ తీవ్రంగా ఆలోచిస్తూన్నాడు. ఇంకా అరుణ్‌ని హిప్నటైజ్ చేయటంవల్ల లాభమేమీ వుండదని అతనికి తెలుసు. అరుణ్‌ని పోస్టు హిప్నసిస్‌కి తీసుకొచ్చి, కిశోర్‌తో అతని గదికి వెళ్ళాడు మేఘనాథ్.

"చివరిసారిగా జరిగిన సంఘటన మరోసారి చెప్పండి" అన్నాడు కిశోర్ తో.

కిశోర్ తో క్రితం రాత్రి జరిగిన సంఘటన గురించి, తను స్వయంగా స్మశానంలో ఆ ఉపాసకుడ్ని చూసినట్టు అతన్ని పట్టుకోవాలని పరుగెత్తినట్టు అతను పారిపోయినట్టు, తను అరుణ్ ని ఎత్తుకొని వెళ్తుండగా తనకి స్పృహ తప్పినట్టు మెలకువ వచ్చి చూసేసరికి తను తన గదిలో తన బెడ్ మీదున్నట్టు, అరుణ్ తన గదిలోంచి ఎక్కడికీ వెళ్ళలేదని ప్రసాదరావు చెప్పినట్టు—అన్నీ వివరించాడు.

"అయితే అరుణ్ గదిలోనుంచి వెళ్ళినదీ లేనిదీ మీ అమ్మగారుగాని, చెల్లాయిగాని చూడలేదు, అవునా?"

"అవును. మా చిన్నాన్నకూడా నేను గదిలో లేనని తలుపులు బార్లా తెరిచివున్నాయని అనుమానం వచ్చి నాకోసం బయల్దేరానని చెప్పాడు."

"మరి మీ అమ్మగార్నిగాని, చెల్లాయినిగాని లేపి జరిగిందేమిటో వాళ్ళతో చెప్పలేదా?"

"లేదు. నేను లేకపోగానే ఆయనకు మరేం తోచలేదు. నేనుకూడా అరుణ్ లాగా నిద్రలో నడుస్తూ వెళ్ళిపోయా నేమోనని భయపడి వెతుక్కుంటూ కార్లో బయల్దేరాడు. కార్లో రోడ్డుకి అడ్డంగా నేను పడివుంటే తీసుకొచ్చి బెడ్ మీద పడుకోబెట్టి అప్పుడు అమ్మనీ చెల్లాయిని లేపి చెప్పాడు.

"అరుణ్ నిద్రలో నడిచి వెళ్ళిపోతుంటాడని తెలుసు కదా! అతను గదిలో ఒంటరిగా వుంటే అలాగే వదిలేసి, ఆడవాళ్ళకి మాటమాత్రంగానైనా చెప్పకుండా మీకోసం వెతుకుతూ వెళ్ళిపోయారన్న మాట!"

"అవును. నేను రోడ్డుమధ్య కనిపించటం అరుణ్

ఇంట్లో కీ నిద్రపోతూ వుండటం నాకు చాలా ఆశ్చర్యం కలిగించాయి."

మేఘనాథ్ మెదడులో ఫ్లాష్ వెలిగింది.

"పదండి అరుణ్ గదికి వెళ్దాం" అంటూ చకచక అరుణ్ గదిలోకి నడిచాడు.

అరుణ్ మంచం దగ్గర ఆగాడు మేఘనాథ్. అది సన్ మైకా తాపడం చేసిన రోజ్ వుడ్ కాట్. డన్ లప్ పరుపుమీద మల్లెపూవులాంటి దుప్పటి పరచి వుంది.

మంచం గోడకి దగ్గరగా వేసి వున్నది. రెండుపక్కల గోడల్ని తాకుతూ అరేంజి చేయబడి వుంది.

మేఘనాథ్ అరుణ్ మంచం తలవైపు పరుపు పైకెత్తాడు. అతని కళ్ళు మెరిశాయి.

డెకోలామ్‌కి అతికించబడి వున్న అయస్కాంతాన్ని పైకెత్తాడు. రెండంగుళాల వ్యాసంతో వున్న గుండ్రటి బిళ్ళ కనిపించిందక్కడ.

మైక్రోస్పీకర్ అతిసూక్ష్మంగా అమర్చబడి వున్నది. సరిగ్గా అరుణ్ తలకి అతిసమీపంగా.

మేఘనాథ్ దాన్నించి కనెక్షన్ ఇవ్వబడ్డ అతి సన్నని దారంలాంటి వైర్‌ని కనుగొన్నాడు. అది మంచం నలువుపట్టె దిగువభాగంనించి టేప్‌తో మధ్య మధ్య అతికించబడి కాళ్ళవరకు సాగివున్నది.

మేఘనాథ్ కాళ్ళవైపున్న డెకోలాం దిగువనున్న పట్టె దగ్గర చేతితో తడిమాడు. వైరు అక్కడినించా కొనసాగి, పక్కగోడలోకి సన్నటి ఇనపగొట్టంద్వారా చొచ్చుకుపోయి వుండటం గమనించాడు.

"ఈ పక్క గది ఎవరిది?.... ఐమీన్, అందులో ఎవరుంటారు?" అనడిగాడు మేఘనాథ్.

అంతదాకా అతని చర్యలను నోరు తెరచుకొని ఆశ్చర్యంగా చూస్తున్న కిశోర్ అరుణ్ తేరుకొని, "మా చిన్నాన్నగారు టున్నారందులో!" అన్నాడు.

"ఆయనున్నారా?"

"ఇంకా ఫ్యాక్టరీనుంచి రాలేదు" అన్నాడు కిశోర్.

"ఆ గది తాళాలు మీ దగ్గరున్నాయా?"

"లేవు. చిన్నాన్న దగ్గరే వున్నాయి. కారు తాళం చెవులతోబాటు బంచ్‌లో వుంటాయి. అవి యెప్పుడూ ఆయనతోనే వుంటాయి."

"ఆయనిప్పుడొస్తారా?"

"ఈ పాటికి రావలసిందే! ఎందుకో రాలేదు!"

"ఆయనొచ్చేలోపల మనం ఆ గదినోసారి పరీక్షించాలి."

కిశోర్ అరుణ్ ఆశ్చర్యంగా చూశాడు. "అంటే మీరు ..."

"అవన్నీ తర్వాత వివరంగా చెప్తాను. వెనకవైపు నుంచి కిటికీలున్నాయి కదా! అద్దాలు పగలగొట్టి లోపలికి వెళ్దాం. అభ్యంతరమా?"

కిశోర్ యేదో చెప్పబోయాడు మేఘనాధ్ వారించి "నామీద నమ్మకముంటే మీరు నా చర్యలకి అడ్డు చెప్పకండి. ప్లీజ్!" అన్నాడు.

"ఆల్ రైట్! మీరేం చేసినా అభ్యంతరపెట్టను" అన్నాడు కిశోర్.

మేఘనాధ్ ఆవరణలోనించి వెనకవైపుకు వచ్చి కిటికీ అద్దాలు పగలగొట్టాడు. ఊచలు లేని కిటికీ అది!

కిటికీనించి లోపలకి దిగాడు.

అరుణ్ మంచం కాళ్ళవైపునుంచి సరాసరి ఆ గది

లో! ఇనపగొట్టం ద్వారా సన్నటి వైరు వచ్చి వుండాలి! సరిగా మంచం కాళ్ళ వైపు ఆనుకున్న సరిహద్దు గోడ దగ్గర అల్మయిరా వుంది.

దాన్నిండా పుస్తకాలు నిలువుగా పేర్చబడి వున్నాయి. మేఘనాథ్ పుస్తకాల్ని తొలగించాడు.

అతని కళ్ళు మెరిశాయి.

అక్కడ మైక్ వున్నది! దాని చివరనున్న వైరు సరాసరి యినపగొట్టానికి కనెక్టు చేయబడి వుంది. ఆ ఇనపగొట్టం అరుణ్ గదిలోనుంచి ఈ గదిలోకి గోడకి రంధ్రం చేసి అమర్చారు.

కిటికీలోనుంచి అరుణ్, కిశోర్ కూడా దిగారు. వాళ్ళకి మైక్, దాని వైరు చూపించాడు మేఘనాథ్! వాళ్ళిద్దరు నిర్ఘాంతపోయి చూశారు.

"అంటే చిన్నాన్న...!?" తర్వాతి మాటలు పలకటానికి ఇద్దరికీ భయంగా వుంది.

మేఘనాథ్ చిన్నగా నవ్వి, "రాత్రిళ్ళు మీ చిన్నాన్న అరుణ్ కి నిద్రలోనే సంకేతాలు పంపిస్తున్నాడు, యీ మైక్ ద్వారా ... ఈ వైరు చివరున్న స్పీకర్ ద్వారా అతని ఆజ్ఞలు సరాసరి అరుణ్ మెదడులో వైబ్రేషన్స్ సృష్టిస్తున్నాయి. వాటి ఫలితంగా అరుణ్ నిద్రలో లేచి నడుస్తూ సరాసరి స్మశానం చేరుతున్నాడు. స్మశానం ఎందుకు చేరుతున్నాడు, అతన్ని మీ చిన్నాన్న స్మశానానికెందుకు పంపిస్తూన్నాడు — అన్న విషయం తెలుసుకోవాలి...." అని అతను చెప్తుండగానే తాళం తీస్తూన్న చప్పుడు వినిపించింది గుమ్మం దగ్గర్నుంచి.

చెవులప్పగించి విన్నారు ముగ్గురు.

బయట ప్రసాదరావు తాళం తీస్తున్నాడు.

20

పోలీసుల్ని చూసి కొద్దిగా వెనక్కి తగ్గాడు మసేనయ్య.

"నువ్వేనా మసేనయ్యా?" అన్నాడు శ్రీనివాస్.

మసేనయ్య దాదాపు ఆరడుగుల పొడవున్నాడు. ముఖానికి సింధూరం బొట్టు వున్నది. ఒంటికి చితాభస్మం పూసుకున్నాడు. కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా తాగినవాడి కళ్ళలా వున్నాయి. కొత్తగా చూసేవాళ్ళకి మొదటి సారి భయం పుట్టక మానదు.

"నేనే! ఎందుకు?" అన్నాడు తిరస్కారంగా మసేనయ్య.

"నీనుంచి కొన్ని వివరాలు కావాలి!"

"నేను ఎవరి నించైనా వివరాలు అడిగి తెల్సుకుంటానే గాని యెవరికీ వివరాలు చెప్పను. చెప్పాల్సిన అవసరం లేదు."

"ఓహో, అలాగా! నీ గురించి ఇద్దరు కుర్రాళ్ళు మాకు రిపోర్టిచ్చారు. శేఖర్, రవీంద్ర వాళ్ళ పేర్లు. అర్ధరాత్రిపూట సమాధులు తవ్వి శవాల్ని పైకితీసి క్షుద్ర విద్యలు ప్రయోగిస్తూన్నావని రూఢిగా తెలిసింది. అది పెద్ద నేరం. అందుకు శిక్షేమిటో తెలుసా....?" శ్రీనివాస్ గొంతులోని కాఠిన్యానికి మసేనయ్య కొద్దిగా జంకాడు.

"అడగండి మీకేం కావాలో, చెప్తాను" అన్నాడు.

"రెండురోజుల క్రితం రవీంద్ర అనే కుర్రాడికి వాళ్ళన్నయ్యని చిన్నాన్నే హత్యచేశాడని ప్రేతాత్మని ఆవాహన చేసి చెప్పించావు. అలాగే శేఖర్ అనే కుర్రాడి చెల్లాయిని ఆమె భర్త, అత్త కిరోసిన్‌తో కాల్చి చంపేశారని చెప్పించావు అవునా?"

"అవును. నా విద్యనింతవరకు ఎవరు తప్పుపట్టలేదు. ప్రేతాత్మ అబద్ధం చెప్పదు...."

"అలాగే అనుకుందాం. అయితే ఆ ఆత్మని రప్పించటానికి ఎవరో యువకుడ్ని ఉపయోగించుకుంటున్నారని తెలిసింది. ఎవరతను?"

"నా వ్యాపార రహస్యాలు బయటపెట్టను."

"ఊఁ, అలాగా! మరిప్పుడా కుర్రాడు చచ్చిపోయాడు. అందుకు కారకుడివి నువ్వే!"

"అఁ! చచ్చిపోయాడా? కేవలం పిచ్చివాడిగా మారుస్తే చాలని చెప్పాడే ఆ పెద్దాయన?"

"ఎవరా పెద్దాయన?"

"ఆయన పేరు నాకు తెలియదు. ఊరవతల పెద్ద ఫ్యాక్టరీ ఉందిగదా! ఏసిడ్, ఫ్యాక్టరీ. దాని యజమాని."

"క్రిష్ణారావా?"

"కాదు, వాళ్ళ చిన్నాయన."

శ్రీనివాస్ అలర్టుగా అయ్యాడు. తీగలాగితే డొంకంతా కదుల్తోంది ఇదీ మంచిదే!

"మసేనయ్యా, నీమీదికే గొడవరాకుండా చూస్తాను. అసలు జరిగిందేమిటో చెప్పు!" అన్నాడు శ్రీనివాస్.

మసేనయ్య చెప్పుకొచ్చాడు.

ప్రసాదరావు అరుణ్‌ని పిచ్చివాడిగా మార్చేయమని మసేనయ్యతో ఒప్పందం చేసుకున్నాడు. అవసరమైతే క్షుద్రశక్తిని ప్రయోగించమనికూడా చెప్పాడు. క్షుద్రశక్తిని ఆవాహన చెయ్యటానికి బలహీన మనస్కులు, బాగా సెన్సిటివ్‌గా వున్నవాళ్ళు కావాలి! ప్రసాదరావు అతిసున్నిత మనస్కుడయిన అరుణ్‌ని మసేనయ్యకు అప్పగిస్తానన్నాడు.

మనేనయ్య సంతోషించాడు. అందువల్ల అతనికి లాభముంది. చనిపోయిన వాళ్ళ గురించి వాళ్ళ బంధువులు రహస్యాలు అడుగుతుంటారు. అవి చెప్పటానికి ప్రేతాత్మలని ఓ మనిషి ద్వారా ఆవాహన చెయ్యాలి. ఆ మనిషి అరుణ్ కావటంవల్ల మనేనయ్య స్వార్థమే కాకుండా ప్రసాదరావు కోరిక తీరుతుంది.

అరుణ్ ని స్మశానంవరకు పంపటం తను బాధ్యత తీసుకుంటానని చెప్పాడు ప్రసాదరావు. స్మశానంలోని తంతు మనేనయ్య చూసుకుంటాడు. ప్రేతాత్మలని ఆహ్వానించటానికి అరుణ్ ని ఉపయోగించుకుని చివర్లో అతని మీద క్షుద్రశక్తుల్ని ప్రయోగిస్తానని మనేనయ్య చెప్పాడు.

ఇప్పటిదాకా అతన్ని తన పనులకి ఉపయోగించుకున్నాడు మనేనయ్య. ఒకటి రెండు రోజుల్లో అరుణ్ మీద శక్తుల్ని ప్రయోగించి ప్రసాదరావు అప్పగించిన పని పూర్తిచెయ్యాలనుకుంటున్నాడు మనేనయ్య.

“నీ వృత్తి యేదో నువ్వు చేసుకోక, ఇలాంటి అమాయకులైన యువకుల్ని యెందుకు బలిచేయబోయావు?” అడిగాడు శ్రీనివాస్ అంతా విని.

“తప్పయిపోయింది బాబూ! నా వృత్తిలో వచ్చే డబ్బు నాకు చాలు. ఇలా మనుషుల్ని చంపే పనులు ఒప్పుకోవటం పొరపాటే! అయినా నేను ఆ కుర్రవాడ్ని చంపటానికొప్పుకోలేదు. పిచ్చివాడిగా మారిస్తే చాలంటే, డబ్బు కక్కుర్తితో సరేనన్నాను” అన్నాడు మనేనయ్య పశ్చాత్తాప పడుతూ.

శ్రీనివాస్ వేగంగా ఆలోచిస్తూన్నాడు. మనేనయ్య చేస్తున్న పని చట్టవిరుద్ధమయినదీ, అతి నీచమైనదీను— అయినా అతని పొట్టకోసం ఆ వృత్తి స్వీకరించాడు—

అతనివల్ల కొందరు హంతకులు దొరికినా, వానివల్ల ఎవరికీ ఏ యోగం? మసేనయ్యని అదుపులోకి తీసుకోకతప్పదు!

"ఆ పెద్దమనిషిని మాకు చూపించు—అసలు నిన్ను వదిలేస్తాం" అన్నాడు శ్రీనివాస్.

మసేనయ్య "పదండి, చూపిస్తాను" అన్నాడు.

శ్రీనివాస్ మసేనయ్యను జీప్ ఎక్కించాడు.

జీప్ కిశోర్ ఇంటివైపు దూసుకుపోయింది.

21

"ఏం చేస్తున్నారు గదిలో?" అడిగాడు ప్రసాదరావు వాళ్ళ ముగ్గుర్నీ గదిలో చూసి నిర్ఘాంతపోయి.

"రా చిన్నాన్నా! నీ కోసమే ఎదురుచూస్తున్నాం" అన్నాడు కిశోర్ వ్యంగ్యంగా.

"నా అనుమతి లేకుండా నా గదిలోకి ఎవరు అడుగు పెట్టమన్నారు మిమ్మల్ని? ఈయనెవరు?" అన్నాడు మేఘనాథ్ వంక గుర్రుగా చూసి ప్రసాదరావు.

"అదంతా తీరిగ్గా మాట్లాడుకుందాం. ఈ మైక్రోఫోన్లు, స్పీకర్లు—ఏమిటీ తతంగం? చిన్నాన్నా నీ గుట్టురట్టయింది. నీ నేరం ఒప్పుకో!" అన్నాడు కిశోర్ తీవ్రంగా అతనివంక చూస్తూ.

ప్రసాదరావు చేతిలో రివాల్వరు ప్రత్యక్షమయ్యింది. "ఎవరూ కదలొద్దు. ఇటువచ్చి గోడవారగా నిల్చోండి. కిటికీవైపు అడుగులు వెయ్యొద్దు మిష్టర్ ...బుద్ధిగా ఇటు నించోండి" హుంకరించాడు ప్రసాదరావు తలుపువైపు జరుగుతూ. బోల్టు పెట్టాలని అతని ప్రయత్నం.

అయితే అప్పుడే తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి. ఇన్స్పెక్టరు శ్రీనివాస్, మసేనయ్యతో పాటు ఎదురుగా ప్రత్యక్షమయ్యాడు.

ప్రసాదరావు చేష్టలుడిగి అలాగే నిల్చుండిపోయాడు.

అరుణ్ మెరుపువేగంతో ప్రసాదరావుమీద ఉరికి రివాల్వరు లాక్కొని కాల్చెయ్యబోయాడు. కాని వెనక నుంచి కిశోర్ అతన్ని సందిట బిగించి ఆపేశాడు.

లేకుంటే ప్రసాదరావు ప్రాణాలు యెగిరిపోయుండేవి.... కోపం తీరక ప్రసాదరావు రెండు చెంపలు ఛెళ్ళున వాయించేశాడు అరుణ్.

శ్రీనివాస్ సార్జంట్ వంక తలతిప్పి "అరెస్టు హిమ్!" అన్నాడు.

ప్రసాదరావు కోపంగా శ్రీనివాస్ని చూసి, "ఎందుకు? షో మి వారంట్!" అని అరిచాడు.

"వారంట్ అవసరం లేదు. మీరు వాళ్ళ ముగ్గుర్ని కాల్చబోతుండగా అరెస్టు చేస్తున్నాం. మీ సంగతులన్నీ మీ వాళ్ళే చెపుతారు. ఇదిగో, ఈ మసేనయ్యను మించిన సాక్షి అక్కర్లేదు" అన్నాడు శ్రీనివాస్ నవ్వుతూ.

ప్రసాదరావు ముఖం నెత్తురుచుక్క లేకుండా పాలిపోయింది. రెండు చేతులు ముందుకు చాచాడు. సార్జంట్ శివం అతని చేతులకి బేడీలు బిగించాడు.

ప్రసాదరావు తన స్టేట్ మెంట్లో యిలా చెప్పాడు: "నేను నా అన్న ఆస్తిని కాజేయటానికి ప్లాన్ వేశాను. అన్న వారసు లిద్దర్ని చట్టానికి దొరక్కుండా హత్య చెయ్యాలని పథకం వేశాను. అందుకు మసేనయ్యను ఎన్నుకున్నాను. కాని కిశోర్ మెదడు నా హిప్నటిజమ్కి లొంగదని తెల్సుకుని ముందుగా అరుణ్ మీద ప్రయోగించాను. అతని మెదడుని నా స్వరతరంగాల కనుగుణంగా మలచుకున్నాను. ప్రతి రాత్రి పన్నెండున్నరకి అతని మెదడులో వైబ్రేషన్స్ సృష్టిస్తూ అతన్ని ఆటంకం

లేకుండా స్మశానానికి వెళ్ళటానికి వీలుగా గడి తలుపులు, గేట్లు నేనే తెరిచిపెట్టేవాడ్ని.

అయితే, కిశోర్ అరుణ్ నడుస్తూ వెళ్ళటం స్మశానం పరిసరాలకు సరాసరిపోవటం గమనించి ఫాలో అయ్యాడు. మొదటిసారి ఊరుకున్నాను. రెండోసారి కూడా అలాగే కావటంతో నాకు మహా చక్కటి ఆలోచన వచ్చింది.

గతంలో కిశోర్‌ని ప్రేమించిన సుధ తమ్ముడు శ్యామలరావు కధ నాకు తెలుసు—అతను చనిపోయే సమయంలో నేను కూడా అక్కడున్నాను. శ్యామలరావు చనిపోయే సమయంలో యెలా వున్నాడో అదే వికృత రూపంతో ఓ మనిషిని యేర్పాటు చేశాను స్మశానంలో. ఫియట్ కారు వైర్లు తప్పించి స్టార్టు కాకుండా చేసి, దూరంగా ఆపివుంచిన నా కార్లో యింటికి తిరిగొచ్చాను.

శ్యామలరావుని స్మశానంలో చూసిన కిశోర్ గుండె చెదిరి చచ్చిపోతాడని నా ఊహ! కాని అలా జరగలేదు.

అరుణ్‌ని కూడా స్మశానంలో ఒంటరిని చీకట్లో వదిలేసి కిశోర్ యింటికి పరుగెత్తుకొచ్చాడు. అంతిక్రితమే ప్రవంతి నన్ను లేపి, అన్నయ్యలిద్దరు కనిపించటంలేదని చెప్పింది. నేను నా మారుతి కార్లో బయల్దేరుడగా కిశోర్ ఇంటికి చేరుకున్నాడు. అతన్ని తీసుకుని మళ్ళీ కార్లో స్మశానానికి వెళ్ళాను. అక్కడ శ్యామలరావు వేషం వేసుకున్న వ్యక్తి కనిపించకుండా యేర్పాటు చేశాను ముందుగానే! ఫియట్ కారు వైర్లు సరిచేసి స్టార్టు చేశాను.

మరుసటిరోజు కూడా కిశోర్ అరుణ్‌ని అనుసరించి స్మశానానికి వెళ్ళాడు. నేను ఫాలో అయ్యాను. మనస్యా అరుణ్ మీదికి ప్రేతాత్మ ఆవహిస్తున్న సమయంలో కిశోర్ అతనిమీదికి దాడిచేశాడు. అతను పారిపోయాడు.

అరుణ్ స్పృహతప్పి పడిపోయాడు.

అప్పుడు కూడా కిశోర్ భయపడకుండా అరుణ్ ని తీసుకొని మోసుకుంటూ రాబోయాడు. నేను వెనకనుండి అతని తలమీద కొట్టి స్పృహతప్పించాను.

అయితే తనని కొట్టిందెవరో చూడకుండానే, కొట్టారని కూడా గ్రహించలేక కిశోర్ నేలమీద పడి స్పృహ కోల్పోయాడు. అరుణ్ ని. కిశోర్ ని నేనే ఇంటికి తీసుకొచ్చాను. అరుణ్ ని అతని గదిలో పరుండబెట్టి. కిశోర్ ని కిశోర్ గదిలో పరుండజేశాను. అంతక్రితం మెయిన్ ఆఫ్ చేసి ఇల్లు చీకటి చేసింది నేనే!

శాంతమ్మని, స్రవంతిని ఆ తర్వాత పిలిచాను. కిశోర్. ఒక్కడే ఒంటరిగా నిద్రలో నడుస్తూ వెళ్ళిపోయాడని, దార్లో రోడ్డు కడ్డంగా పడుంటే తీసుకొచ్చానని చెప్పాను.

దాంతో కిశోర్ మెంటల్ డిప్రెషన్ కు లోనవుతాడని, క్రమంగా మరో రెండు మూడు షాక్ ట్రీట్మెంట్స్ ఇచ్చి పిచ్చివాడిగా మార్చెయ్యాలని నా పథకం.

అయితే, అటు అరుణ్ ని గాని, ఇటు కిశోర్ ని గాని నే ననుకున్న పద్ధతిలో పిచ్చివాళ్ళగా మార్చలేక పోయాను. కనీసం భయభ్రాంతులై గుండె ఆగి మరణిస్తారని ఆశిస్తే అదీ జరగలేదు.

చివరికి మేఘనాథ్ వల్ల నా గుట్టు రట్టయ్యింది. ఇన్ స్పెక్టరు శ్రీనివాస్ శంశోధించి ఘనసేనయ్యని పట్టుకోవటంతో నా గురించి అంతా చెప్పేశాడు...."

—: అయిపోయింది :—